మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

బిసి రిజర్వేషన్ల సాధనకు దేశాన్ని ఏకం చేస్తాం

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్

సర్పంచ్‌ల అభినందన సభలో డిప్యూటీ సిఎం భట్టి

03

సంపుటి 09, సంచిక: 21 | బుధవారం | 17-12-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## గ్రామీణ శ్రామికుల ఉపాధిహక్కు రద్దు

"బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం మహాత్మా గాంధీని అవమానిస్తోంది. ప్రతిపాదిత చట్టాన్ని ఉపసంహరించుకోవాలి."

గాంధీజీకి జరిగిన అవమానాన్ని హిందుస్థాన్ సహించదు




- లక్షలాది మంది కార్మికులకు ఉన్న చట్టబద్ధమైన ఉపాధి హామీని తొలగించేందుకు కాషాయ పార్టీ కుట్ర
- 'ఎంజి నరేగా' రద్దు, కొత్త చట్టం తీసుకురావడంపై ప్రతిపక్ష ఎంపిలు ధ్వజం
- పార్లమెంట్ సముదాయంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన

**న్యూఢిల్లీ :** 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం ' (ఎంజి నరేగా)ను రద్దు చేస్తూ దాని స్థానంలో కొత్త చట్టం 'వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) (విబి–జి రామ్ జి) బిల్లు –2025ను కేంద్రం తీసుకువస్తుండడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. బిల్లుపై మంగళవారం పార్లమెంట్ భవన సముదాయంలో పలువురు ప్రతిపక్ష ఎంపిలు నిరసన తెలిపారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మహాత్మా గాంధీని అవమానిస్తోందని ఆరోపిస్తూ, ప్రతిపాదిత చట్టాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. 'ఎజి నరేగా' స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టిన వెంటనే, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, డిఎంకెకు చెందిన టి.ఆర్. బాలు, ఆర్‌ఎస్‌పికి చెందిన ఎన్.కె. ప్రేమచంద్రన్ తదితరులు పార్లమెంట్ సముదాయంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. 'గాంధీజీకి జరిగిన ఈ అవమానాన్ని హిందుస్థాన్ సహించదు' వంటి నినాదాలు చేశారు. గత యుపిఎ ప్రభుత్వం అమలు చేసిన' మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నరేగా), 2005 ను ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందని ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. ప్రతిపక్ష ఎంపిలు మహాత్మా గాంధీ చిత్రపటాలను

తరువాయి 2లో

ప్రతిపక్షాల అభ్యంతరాల మధ్య లోక్‌సభలో

### 'విబి-జి రామ్ జి'

బిల్లును ముక్తకంఠంతో వ్యతిరేకించిన విపక్ష సభ్యులు

### పార్లమెంటులో ఎఫ్‌డిఐ బిల్లు

ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

05



## ఐఐఎం ఇవ్వండి

- అవసరమైన 200 ఎకరాల భూమిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంగణంలో గుర్తించాం
- ఐఐఎం తరగతులు వెంటనే ప్రారంభించేందుకు ట్రాన్సిట్ క్యాంపస్ సిద్ధంగా ఉంది
- 13 రాష్ట్రాలు, యుటిల్లో 21 ఉన్నాయి, తెలంగాణలోనూ ఏర్పాటు చేయండి
- 9 కేంద్రీయ, 16 జవహర్ నవోదయ విద్యాలయాలు మంజూరు చేయండి
- తెలంగాణలో విద్యారంగ అభివృద్ధికి మద్దతివ్వండి
- ఎస్‌పిసి ద్వారా సేకరించే రుణాలకు ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితి నుంచి మినహాయింపునివ్వండి

కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రదాన్, నిర్మలాసీతారామన్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌కు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు విజ్ఞప్తి చేశారు. టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, లాజిస్టిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ముందున్న హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పార్లమెంట్‌లోని ఛాంబర్‌లో భేటీ అయ్యారు. దేశంలో 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో కలిపి 21 ఐఐఎంలు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనూ ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల భూమిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంగణంలో గుర్తించిన విషయాన్ని సిఎం తెలిపారు. ఐఐఎం తరగతులు వెంటనే ప్రారంభించేందుకు ట్రాన్సిట్ క్యాంపస్ సిద్ధంగా ఉందని, అందుకు అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయడంతో పాటు అవసరమైన వసతులు కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు సిఎం తెలియజేశారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా హైదరాబాద్‌కు ఎయిర్, రైల్, రోడ్ కనెక్టివిటీ ఉందని, అనుకూల వాతావరణం, భిన్న రంగాల ప్రముఖులను అందజేసిన చరిత్ర హైదరాబాద్‌కు

తరువాయి 2లో

విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా తెలంగాణను

### అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లండి

సిఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియాగాంధీ సూచన

03




'ఎంజి నరేగా' రక్షణకు

## ఈనెల 22న దేశవ్యాప్త నిరసనలు

- సిపిఐ పిలుపు
- చట్టాన్ని మార్చేయడం కార్మిక, రాజ్యాంగ వ్యతిరేక చర్య అని వ్యాఖ్య

**న్యూఢిల్లీ:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) చట్టాన్ని రక్షించుకునేందుకు ఈనెల 22వ తేదీ (డిసెంబరు) దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలలోనూ నిరసన ప్రదర్శనలు జరపాలని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) పిలుపు ఇచ్చింది. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ స్థానంలో సరికొత్త గ్రామీణ ఉపాధిబిల్లు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు చేయాలని పార్టీ శాఖలను కోరింది. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ చట్టాన్ని మార్చేయడం కార్మిక వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక చర్య అని గట్టి హెచ్చరిక చేసింది. ఎలాంటి సంప్రదింపులూ లేకుండా చేసే ఇలాంటి మార్పులను దేశవ్యాప్తంగాకార్మికులు, ప్రజాస్వామ్యశక్తులు చాలా

తరువాయి 2లో

## 16 మంది నక్సల్స్ అరెస్ట్?

- ఆదిలాబాద్ ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టుల కలకలం
- ఛత్తీస్‌గఢ్ – బీజాపూర్‌లో మరో 34 మంది లొంగుబాటు

ప్రజాపక్షం / సిర్పూర్ యు / ఆసిఫాబాద్

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు) అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి చొక్కారావుతో పాటు 16 మంది నక్సల్స్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పొరుగు రాష్ట్రాల్లో ఆపరేషన్ కగార్ కారణంగా మావోయిస్టులు ప్రాణహిత నది దాటి జిల్లాలోకి ప్రవేశించి ఆశ్రయం పొందుతున్నట్లు నిఘావర్గాల సమాచారం అందింది. దీంతో ఆసిఫాబాద్ ఎస్‌పి నితికా పంత్ ఆదేశాల మేరకు ఎఎస్‌పి చిత్తరంజన్ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులు సోమవారం రాత్రి కూంబింగ్ నిర్వహించారు. కూంబింగ్‌లో 16 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పట్టుబడిన వారిలో 9 మంది మహిళలు, 7 మంది పురుషులు ఉన్నారని, వీరిలో నలుగురు డిసిఎం సభ్యులు ఉన్నట్లు సమాచారం. వారి వద్ద ఎకే 47, రెండు పిస్టల్స్, మందుపాతర సామాగ్రి లభించినట్లు తెలుస్తోంది. పట్టుబడిన వారిని

తరువాయి 12లో



ఛత్తీస్‌గఢ్ – బీజాపూర్‌లో లొంగిపోయిన మావోయిస్టులు

## సంబంధం లేదు

- ఆస్ట్రేలియాలో ఉగ్రదాడిని భారత్, తెలంగాణకు రుద్దొద్దు
- సిడ్నీ కాల్పుల్లో హైదరాబాద్ మూలాలున్న సజీద్ అక్రమ్‌గా గుర్తింపుపై డిజిపి శివధర్‌రెడ్డి స్పష్టీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆస్ట్రేలియా సిడ్నీ సమీపంలోని బాండి బీచ్ వద్ద ఈ నెల 14న ప్రజల మధ్య జరుగుతున్న హనుక్కా వేడుకల సమయంలో జరిగిన కాల్పుల ఘటనను ఆస్ట్రేలియా ప్రభుత్వం ఉగ్రదాడిగా ప్రకటించింది. ఈ ఘటనలో 15 మంది మృతి చెందగా, దాడికి పాల్పడ్డ ఇద్దరిలో ఒకరు అక్కడికక్కడే మరణించారు. ఈ దాడికి పాల్పడ్డ వారు హైదరాబాద్ మూలాలున్న సజీద్ అక్రమ్ (50), అతని కుమారుడు నవీద్ అక్రమ్ (24) ను ఆస్ట్రేలియా అధికారులు గుర్తించారు. ప్రాథమిక విచారణలో వీరిద్దరూ ఐసిస్ భావజాల ప్రభావంతో తీవ్రవాదానికి లోనైనట్లు అధికారులు వెల్లడించారు. ఘటనపై ఆస్ట్రేలియా భద్రతా సంస్థలు లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సజీద్ అక్రమ్ హైదరాబాద్‌లో బి.కాం పూర్తి చేసి, 1998 నవంబర్‌లో ఉపాధి నిమిత్తం ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. అక్కడే స్థిరపడిన అతడు యూరోపియన్ మూలాలున్న వెనెరా గ్రోస్సోను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. సజీద్ అక్రమ్ ప్రస్తుతం కూడా భారతీయ పాస్‌పోర్ట్ కలిగి ఉండగా, అతని ఇద్దరు పిల్లలు ఆస్ట్రేలియాలో జన్మించి అక్కడి పౌరసత్వం పొందారు. గత 27 ఏళ్లుగా హైదరాబాద్‌లోని కుటుంబ సభ్యులతో అతనికి పరిమిత సంబంధాలే ఉన్నాయని బంధువులు తెలిపారు. ఆస్ట్రేలియాకు వెళ్లిన తర్వాత అతడు కేవలం ఆరు సార్లు మాత్రమే భారత్‌కు వచ్చాడని,

తరువాయి 2లో




## తుదివిడత పల్లెపోరు నేడే

- 3,752 సర్పంచ్ స్థానాల్లో పోలింగ్
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు
- 394 సర్పంచ్‌లు ఏకగ్రీవం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల తుది విడత పోలింగ్ బుధవారం జరగనుంది. ఈ నేపథ్యంలో పోలింగ్ అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలకు ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. పంచాయతీ ఎన్నికల చివరి విడతలో భాగంగా, నేడు ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాలు మినహా మిగిలిన గ్రామ పంచాయతీలలో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోలింగ్ జరుగుతుంది. బుధవారం, 3,752 గ్రామాల్లో సర్పంచ్, 28,406 వార్డు సభ్యుల పదవులకు పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు

తరువాయి 2లో

రామగుండం నుంచి 70%

## కేటాయించండి



- రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు వేగంగా ఎరువులందుతాయ్
- కర్మాగారం నుంచి ఎరువుల సరఫరాపై అధికారులతో మంత్రి తుమ్మల, శ్రీధర్‌బాబు సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

రామగుండంలో ఉత్పత్తి అవుతున్న యూరియాలో తెలంగాణ రాష్ట్రానికి కనీసం 70 శాతమైనా కేటాయించాలని,తద్వారా రవాణ ఖర్చులు తగ్గడంతో పాటు రైతులకు వేగంగా ఎరువులు అందుతాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. యూరియా ఉత్పత్తి అంశంపైన పరిశ్రమలు,ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు 'రామగుండం ఎరువుల కర్మాగారం' (ఆర్‌ఎఫ్‌సిఎల్) అధికారులతో మంగళశారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఖరీఫ్ సీజన్‌లో రామగుండంలో ఎరువుల ఉత్పత్తి నిలిచిపోవడంతో తెలంగాణ రైతులకు యూరియా సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురైన విషయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

తరువాయి 2లో

## బస్సుల్లో మంటలు

### 13 మంది సజీవ దహనం

- మరో 43 మందికి గాయాలు
- పొగ మంచుతో మధురలోని ఢిల్లీ-ఆగ్రా ఎక్స్‌ప్రెస్ రహదారిపై ఏడు బస్సులు, మూడు కార్లు ఢీ

**మధుర:** ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. మంగళవారం తెల్లవారుజామున మధురలోని ఢిల్లీ–ఆగ్రా ఎక్స్‌ప్రెస్ రహదారిపై ఏడు బస్సులు, మూడు కార్లు ఢీకొన్నాయి. భారీగా మంటలు చెలరేగాయి. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో 13 మంది సజీవ దహనమయ్యారు. మరో 43 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదంతో ఘటనాస్థలంలో భీతావహ పరిస్థితి నెలకొంది. ఉదయం 4.30 గంటల ప్రాంతంలో దట్టమైన పొగమంచులో ఎనిమిది బస్సులు, మూడు చిన్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయని అధికారి తెలిపారు. ఈ ఘటన బలదేవ్ పోలీస్ స్టేషన్ పరిధిలో

తరువాయి 12లో



నేషనల్ హెరాల్డ్ కేసులో

## ఇడి చార్జిషీట్ నిరాకరణ

**న్యూఢిల్లీ :** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఊరట లభించింది. ఈ కేసులో వారిద్దరిపై ఇడి దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకునేందుకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరించింది. మనీలాండరింగ్ యాక్ట్ కింద ఇడి దాఖలు చేసిన ఫిర్యాదును కొనసాగించలేమని కోర్టు పేర్కొంది. ప్రైవేటు వ్యక్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఇడి ఈ కేసులో దర్యాప్తు జరిపి ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసినట్లు ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే వెల్లడించారు. చట్టప్రకారం దీనిని పరిగణనలోకి తీసుకోవడం కుదరదని స్పష్టం చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఢిల్లీ ఆర్థిక నేరాల విభాగం

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## హాలీవుడ్ ప్రముఖుడు రాబ్ రైనర్ హత్యకేసులో కొడుకు అరెస్టు

**బ్రెంట్‌వుడ్ :** ప్రముఖ హాలీవుడ్ నటుడు, చిత్ర నిర్మాత రాబ్ రైనర్ (78), ఆయన భార్య మిచెల్ (68 ) జంట హత్యల కేసులో వారి కుమారుడు నిక్ రైనర్ (32)ను లాస్ ఏంజెల్స్ పోలీసులు అరెస్టు చేశారు. లాస్‌ఏంజెల్స్ బ్రెంట్‌వుడ్‌లో అత్యంత సంపన్నవంతులు నివసించే ప్రాంతంలో ఉన్న స్వంత నివాసంలో రాబ్ రైనర్, ఆయన భార్య మిచెల్ శవాలై కనిపించారు. ఈ కేసులో కుమారుణ్ణి అనుమానంతో అరెస్టు చేశామని, అయన బెయిలు లేకుండా కస్టడీలో ఉన్నాడనీ పోలీసులు చెప్పారు. ఆయన తీవ్రమైన కత్తిపోట్లకు గురికావడంతో ఆ కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. రాబరీ, హోమీసైడ్ డివిజన్ డిటెక్టివ్ విభాగం దర్యాప్తు చేపట్టింది. తల్లిదండ్రులు ఇద్దరూ మరణించి ఉండటం చూసిన రాబ్ రైనర్ కుమార్తె రోమీ (28) ఆదివారం పోలీసులు, అత్యవసర విభాగం వారికి సమాచారం తెలియజేసింది. వారి హత్యలు జరిగిన రోజు రాత్రి పొద్దుపోయాక కుమారుడు నిక్ రైనర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

## కొద్ది రోజుల్లో శాంతి ప్రతిపాదనలు పంపుతాం



**కీవ్ :** యుద్ధం ముగించేందుకు సంబంధించిన శాంతి ప్రతిపాదనలను కొద్ది రోజుల్లోనే ఖరారు చేసి అమెరికాకు పంపుతామని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. యుద్ధం ముగించేందుకు అమెరికా శాంతి ఒప్పందంపై ట్రంప్ దూతలతో బెర్లిన్‌లో సంప్రదింపుల తర్వాత ఆయన మాట్లాడుతూ, కొద్దిరోజుల్లో తమ ప్రతిపాదనలను ఖరారు చేస్తామన్నారు. ఈ ప్రతిపాదనలు తదుపరి సమావేశాల్లో అమెరికా దూతల ద్వారా రష్యా వద్దకు వెళతాయి. బహుశా వచ్చే వారాంతానికి అమెరికా–రష్యా మధ్య జరిగే సమావేశాల్లో జెలెన్‌స్కీ ప్రతిపాదనలపై చర్చిస్తారు. బెర్లిన్‌లో శాంతి ఒప్పందంపై ట్రంప్ దూతలతో జరిపిన చర్చలు ప్రయోజనాత్మకంగా, క్రియాత్మకంగా ఉన్నాయన జెలెన్‌స్కీ చెప్పారు. ఐతే అమెరికా దూతలతో చర్చలు చాలా సంక్లిష్టమైనవనీ, ఐనా క్రియాశీలంగానే ఉన్నాయన్నారు. రష్యా దళాలు దాడిచేసి ఆక్రమించుకున్న ఉక్రేన్ భూభాగాలకు సంబంధించిన సమస్యలు మాత్రం ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. కానీ డాన్‌బాస్‌లోని ఏ భూభాగంపైనా కూడా రష్యా పెత్తనాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతం తమ దేశానికి ఆర్థికంగా చాలా కీలకమైనదన్నారు. అమెరికా మాత్రం ఈ విషయంలో రాజీ చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. డాన్‌బాస్‌లో ఒక స్వేచ్ఛావాణిజ్య మండలాన్ని అమెరికా ప్రతిపాదిస్తోందని నెదర్లాండ్స్ పర్యటనకు వెళ్ళేముందుగా జెలెన్‌స్కీ చెప్పారు. స్వేచ్ఛా ఆర్థిక మండలంఅంటే అది ఎప్పటికీ రష్యా నియంత్రణలో ఉండకూడదన్నారు. భూభాగాల సమస్య అతి కీలకమైనదని, అదే పెద్ద ఆటంకంగా ఉందని అన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన ప్రణాళికపై ఉక్రేన్, యూరోపియన్ యూనియన్ నాయకులు, ప్రతినిధులు 90 శాతం మేరకు ఏకాభిప్రాయం ప్రకటించారని వైట్‌హౌస్‌యంత్రాంగం మంగళవారం ప్రకటించింది.

## ఉక్రేన్‌పై ఒప్పందానికి చేరువలో ఉన్నాం : ట్రంప్



**వాషింగ్టన్ :** రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం ముగించే ఒప్పందానికి చేరువలో ఉన్నామని, గడచిన నాలుగు సంవత్సరాలలో ఇరువైపులా చర్చలు ఒప్పందానికి ఇంత దగ్గరగా రాలేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఓవల్ కార్యాలయంలో ట్రంప్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ''మనం గతంలో ఎన్నడూలేనంతగా శాంతి ఒప్పందానికి దగ్గరయ్యాం, జెలెన్‌స్కీ, బ్రిటన్, ఫ్రాన్స్,జర్మనీ, ఇతర నాటో నాయకులతో నేను చాలా సుదీర్ఘమైన, ఫలవంతమైన చర్చలు జరిపా'' అని చెప్పారు. బెర్లిన్‌లో ట్రంప్ దూతలు, యూరోపియన్ నాయకులమధ్య చర్చలు ముగిసిన తర్వాత, శాంతి ఒప్పందానికి ముందుగానే ఉక్రేన్‌కు చాలా బలమైన సెక్యూరిటీ గ్యారంటీలు అమెరికా ఇవ్వాలని కోరుతూ ఉమ్మడి ప్రకటన వెలువడింది. ఇ.యు, నాటో నాయకులు,ట్రంప్ దూతలతో సంభాషించిన తర్వాత ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా స్పందించారు. బెర్లిన్ పరిణామాలపై ట్రంప్ ఓవల్ ఆఫీసులో స్పందించారు.

బెర్లిన్‌లో జరిగిన కీలక సమావేశాల్లో ఉక్రేన్ సార్వభౌమాధికారాన్ని కాపాడాలని, యూరప్‌కు పూర్తి భద్రత ఉండాలని యూరోపియన్ దేశాల విదేశీమంత్రులు, యూరోపియన్ యూనియన్ ముఖ్యనాయకులు ఉమ్మడి ప్రకటన చేశారు. కాల్పుల విరమణ, శాంతి ఒప్పందానికి ముందుగానే ఉక్రేన్‌కు చాలా బలమైన సెక్యూరిటీ గ్యారంటీలు ఇవ్వాలని కోరారు. ఉక్రేన్‌లో శాంతి ఒప్పందం అమలు చేయడానికి బహుళ దేశాల ఉమ్మడి బలగాలను పర్యవేక్షణకోసం మోహరించాలని కూడావారు ఈ ప్రకటనలో కోరారు.

# కొలంబియాలో విషాదం

### బస్సు లోయలోపడి 17 మంది విద్యార్థులు మృతి



**రెమెడియోస్ :** దక్షిణ అమెరికా దేశం కొలంబియాలో బస్సు లోయలో పడిపోవడంతో 17 మంది విద్యార్థులు దుర్మణం చెందారు. ఈ ఘటన యావత్ కొలంబియాను తీవ్ర విషాదంలో ముంచేసింది. ఈ ఘటనలో మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. కొలంబియా అంతటా ప్రజలు వారికోసం ప్రార్థనలు చేస్తున్నారు. సంతాపాలు తెలియజేస్తున్నారు. గ్రాడ్యుయేషన్ వేడుకలు పూర్తిచేసుకుని మెడిలిన్‌కు తిరిగి వెళుతున్న విద్యార్థులు తమ తమ గమ్యాలకు చేరకుండా అనంత లోకాలకు ప్రయాణం చేసి వెళ్ళిపోయారు. ఆంటియోక్వియా ప్రాంతంలోని రెమెడియోస్ మున్సిపాలిటీ పరిధిలో 40 మీటర్ల లోతులో ఉన్న ఒక లోయలో బస్సు పడిపోయింది. ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విద్యార్థులందరూ కొలంబియా బెల్లోలో ఉన్న లైసియో యాంటియో క్వెనో స్కూలులో చదువుతున్నారు. విద్యార్థుల మరణంపట్ల స్కూలు యాజమాన్యం తీవ్ర సంతాపం తెలియజేసింది. వారి కుటుంబీకులకు సానుభూతి ప్రకటించింది. స్కూలు ప్రవేశద్వారా వద్ద తాత్కాలిక సంతాపవేదిక ఏర్పాటు చేశారు. అక్కడే విద్యార్థులందరూ పుష్పగుచ్ఛాలు ఉంచి కొవ్వొత్తులు వెలిగించి వారి మృతికి నివాళులు అర్పించారు.

### యుద్ధ ఘర్షణ ఉద్రిక్తతల మధ్య

# థాయ్‌లాండ్‌లో ఫిబ్రవరి 8న ఎన్నికలు



**బ్యాంకాక్ :** కాంబోడియాతో మరోసారి రెండు వారాలుగా ఒకవైపు సరిహద్దుల్లో ఘర్షణలు కొనసాగుతున్న తరుణంలో థాయ్‌లాండ్ రాజు ఆదేశంతో పార్లమెంటు రద్దు కావడంతో ఆ దేశంలో ఎన్నికలు ముంచుకొచ్చాయి. 2026 ఫిబ్రవరి 8వ తేదీన పార్లమెంటుకు ఎన్నికలు జరుగుతాయి. ప్రధానమంత్రి పదవికి పోటీ చేసే అభ్యర్థుల పేర్లను రాజకీయ పార్టీలు ఈనెల 27 నుండి నాలుగురోజుల్లో ఎన్నికల సంఘానికి సమర్పించాలి. బహుశా ఏప్రిల్ తొమ్మిదోతేదీనాటికి ఎన్నికల ఫలితాలు ప్రకటించే అవకాశం ఉంది. దేశంలో 16 రాజకీయపార్టీలున్నాయి. పీపుల్స్ పార్టీ, ఫూ థాయ్ పార్టీ, భూమిజైథాయ్‌పార్టీ, పలాంగ్ ప్రచారథ్‌పార్టీలు వరుస ప్రాధాన్యతల్లో ఉన్నాయి. దేశ సర్వోన్నత చట్టసభకు 500 మంది ప్రతినిధులను ఎన్నుకోవాల్సి ఉంద. మొత్తం 400 నియోజకవర్గాలు ఉండగా, మిగిలిన 100 స్థానాలకు ప్రతినిధులను పార్టీల ప్రాతిపదికపై ఎన్నుకుంటారు. పొరుగున కాంబోడియాతో తాజా ఘర్షణలు ప్రారంభమైన వారం రోజులకు థాయ్‌లాండ్ రాజు ఆదేశంతో ప్రధానమంత్రి అనుతిన్ పార్లమెంటును రద్దుచేశారు. పార్లమెంటు రద్దైన తర్వాత 60 రోజులలోపు దేశంలో తిరిగి ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈనెల 12న పార్లమెంటు రద్దుకు రాజు డిక్రీ జారీ చేశారు. ప్రజల చేతికి తిరిగి అధికారాన్ని ఇస్తున్నామని, వారు ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారని ఆయన ప్రకటించారు. పార్లమెంటు రద్దు ఒక్కటే ప్రస్తుత దేశ సమస్యకు పరిష్కారమని రాజు అభిప్రాయపడ్డారు. 2023 ఆగస్టులో ఎన్నికలో భూమ్‌జైథాయ్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత థాయ్‌లాండ్‌కు అనుతిన్ మూడో ప్రధానమంత్రి. సెప్టెంబరులో అధికారం చేపట్టినప్పుడే జనవరి చివరి నాటికి పార్లమెంటును రద్దుచేస్తానని అనుతిన్ ముందుగానే ప్రకటించారు. గతనెలలో ఊహించనిరీతిలో థాయ్‌లాండ్‌కు వచ్చిన భారీ తుఫాను ప్రమాదాన్ని అరికట్టడంలో, ముందస్తు చర్యలు, ఆ తర్వాత సహాయ చర్యలు తీసుకోవడంలో ప్రధానమంత్రితోపాటు ఆయన భూమ్‌జైథాయ్ పార్టీ కూడా తీవ్ర విమర్శలపాలైంది. ఈ తుఫాను, వరదలకారణంగా 176 మంది మరణించారు. ఆయన పార్టీ మొదటినుండీ విమర్శలపాలైంది. అనుతిన్‌కు ముందు పనిచేసిన ప్రధానమంత్రి పేటోంగ్‌టర్న్ షినవత్ర కాంబోడియా మాజీనేత హున్‌సేన్‌తో రహస్యంగా ఫోన్ సంభాషణ జరిపారు. ఆయనను 'అంకుల్' అని సంబోధించారు. ఈ ఫోన్‌కాల్‌ను సైన్యం బయటకు లీక్ చేయడంతో ఆమె నైతిక విలువలు తప్పారని గగ్గోలు రేగడంతో షినవత్ర రాజీనామా చేశారు. తర్వాత అనుతిన్ ప్రధానమంత్రి అయ్యాక ఈ ఏడాది జులై 28న కాంబోడియాతో సరిహద్దు ఘర్షణలు మొదలయ్యాయి.

# మెక్సికోలో విమాన ప్రమాదం

### 10 మంది దుర్మరణం

**టోలుగా :** మెక్సికోలో ఒక ప్రైవేటు విమానాన్ని ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసేందుకు జరిగిన ప్రయత్నంలో ఘోర ప్రమాదానికి గురికావడంతో ముగ్గురు మైనర్లు సహా పదిమందిమరణించారు. ఏడుగురి మృతదేహాలు కనిపించాయి. మరో ముగ్గురు జాడ కోసం వెతుకుతున్నారు. వారు కూడా మరణించారనే భావిస్తున్నారు. మృతుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నారు. మెక్సికో సిటీకి పశ్చిమంగా 31 మైళ్ళ దూరంలో ఉన్న శాన్ మాటినో అటెన్కో రాష్ట్రం టోలుకా విమానాశ్రయానకి మూడు మైళ్ళ సమీపంలో ఉన్న పారిశ్రామికవాడ పరిసరాల్లో విమానం కుప్పకూలిపోయిందని మెక్సికో పౌర సంరక్షణ సమన్వయకర్త ఆడ్రినో హెర్నాండెజ్ మీడియాకు చెప్పారు. పైలట్ విమానాన్ని ల్యాండింగ్ చేసేందుకు ప్రయత్నం చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మెక్సికో పసిఫిక్ తీరంలోని అకాపుల్కో నుండి ఎనిమిది ప్రయాణికులతో విమానం బయలుదేరింది. వారితో మరో ఇద్దరు విమాన సిబ్బంది ఉన్నారు. సాకర్ మైదానంలో విమానాన్ని ల్యాండింగ్ చేసే ప్రయత్నంలో ఒక వ్యాపార సంస్థకు చెందిన వేర్ హౌస్ మెటల్ పైకప్పును ఢీకొట్టడంతో ఆకస్మికంగా విమానం కుప్పకూలిపోయింది. వెంటనే మంటల్లో విమానం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న ఏడుగురు ఆచూకీ మాత్రమే తెలిసింది. మిగిలిన ముగ్గురూ ఏమయ్యారో తెలియరాలేదు. వారికోసం ఆరాతీస్తున్నారు. ఈ వేర్ హౌస్‌లో ఇంధనం, ఇతర ప్రమాదకర వస్తువులను భద్రపరిచి ఉంచారు. అందువల్ల ఆ పరిసర ప్రాంత ప్రజలను తక్షణం ఖాళీచేయించి మరోచోటకు తరలించారు.

## విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం శంషాబాద్లోని తొల్లబస్తీలోని ఓ షెడ్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా 80 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మహమ్మద్ ఇంతియాజ్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారున స్వాధీనం చేసుకున్న పిడిఎస్ బియ్యం విలువ సుమారు రూ. 3,20,000 ఉంటుందని అధికారులు వెల్లడించారు. నిందితుడు ఇంతియాజ్‌ను, స్వాధీనం చేసుకున్న బియ్యంతో సహా ఆర్‌జిఐ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అలాగే ఇసి చట్టం లోని సెక్షన్ 6ఎ కింద, క్రిమినల్ కేసు నమోదు చేయడానికి పౌర సరఫరాల శాఖ కు సమాచారం అందించారు.

**కరీంనగర్‌లో దాడులు..** కరీంనగర్ పెద్దపల్లి మధ్య రాజీవ్‌రహదారిపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆర్‌టిఒ అధికారులతో కలిసి ఆకిస్మక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 15 వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధించారు. ఎంవి చట్టం కింద పన్నులు చెల్లించనందుకు గాను మరో రూ. 3,50,000 జరిమానా విధించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడటం, ప్రభుత్వ నిధులు మరియు సహజ వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల విధి. ప్రభుత్వ నిధులు లేదా వనరుల దుర్వినియోగం లేదా ఏవైనా అక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 14432 ద్వారా తెలియజేయాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి శిఖాగోయల్ విజ్ఞప్తి చేశారు.

## దేశవ్యాప్త నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

బలంగా ప్రతిఘటించాలని పిలుపు ఇచ్చింది.

వామపక్షాల మద్దతుతో యుపిఎ ప్రభుత్వం తెచ్చిన ఎంజిఎన్‌ఆర్‌ఇజి చట్టం మన భారత గణతంత్ర చరిత్రలో ఒక మైలురాయి ఘట్టం,భారతరాజ్యాంగం రూపకల్పన చేసిన పని హక్కుకు ఒక మూలస్తంభం, భారత రాజ్యవిధానంలోని ఆదేశిక సూత్రాల నుండి ప్రత్యక్షంగా దేశంలోని పౌరులు అందరికీ జీవనభృతి ఇచ్చే మార్గం, గ్రామీణ భారతదేశంలో పునాదిస్థాయిలో వేతనం సమకూర్చే వ్యవస్థాగతమైన ఈ చట్టంలోని నిబంధనలను ఏ విధంగానైనా నీరుగారిస్తే గ్రామీణ కార్మికులను మరింతగా దోపిడీ చేయడానికి దారితీస్తుందని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం హెచ్చరించింది. కృత్రిమ మేధ, సాంకేతికీకరణలు పట్టణ ప్రాంతాలలో, చదువుకున్నవారిలో ఉద్యోగాలను నిర్మూలిస్తున్న ఈ తరుణంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరం ఉంది తప్ప ఈ పథకం దార్శనికతను, గ్రామీణ భారతదేశంలో కార్మికులకు ఉన్న రక్షణలను నాశనం చేయకూడదని ప్రకటన పేర్కొంది. ''చరిత్రాత్మకమైన గ్రామీణ ఉపాధిహామీ చట్టంలో మహాత్మాగాంధీ పేరు తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వక చర్యలకు పూనుకుంది. ఇది కేవలం పాలనాయంత్రాంగం పరమైన చిన్న మార్పు కాదు, గాంధీజీ వారసత్వాన్ని, విలువలను ఉల్లంఘించేందుకు బిజెపి చేస్తున్న లోతైన ఫాసిస్టు నియంతృత్వ సైద్ధాంతిక ఉద్దేశపూర్వక చర్యను బహిర్గతం చేస్తోంది, బిజెపి, దాని సైద్ధాంతిక పద్ధతులన్నీ వారు గాడ్సేకు నిజమైన అంతేవాసులని దేశ ప్రజలకు ఇప్పటికే తెలిసిన వాస్తవాను ఈ చర్య మరోసారి రూఢీగా ధృవీకరిస్తోంది'' అని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం విమర్శించింది. మహాత్మా గాంధీ పేరుతో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ చట్టం లేకుండా పేరుమార్పు సాకుతో ఆ స్థానంలో విబి–జి రామ్ జి (వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ) పథకంగా మార్చేందుకు పార్లమెంటులో బిల్లుకు బిజెపి రంగం సిద్ధం చేసింది. హక్కుల ప్రాతిపదికపై ఉన్న ఒక చట్టాని చిందర వందర చేసి దానిని వివక్షతో కూడిన పథకంగా మార్చుచేసి, ఉపాధికి హామీ కల్పించే ఒక మౌలిక ఆలోచనను ప్రభుత్వం నీరుగార్చడం, అధికారుల కోటాలు, కాంట్రాక్టర్లు నడిపించే యంత్రాంగం దయాదాక్షిణ్యాలపై బతికేవిధంగా గ్రామీణ కార్మికులను దిగజార్చడంకోసమేనని పార్టీ విమర్శించింది.

''ప్రతిపాదిత కొత్త బిల్లు ద్వారా గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రాలపై 40 శాతం ఆర్థిక భారం వేస్తోంది, వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) విధాన రూపకల్పనలో అనుసరించిన తప్పుడు పద్ధతులు, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి, రాజకీయ ప్రతీకార ద్వేషం కారణంగా రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఇప్పటికే తీవ్రమైన ఆర్థిక భారాలతో కుంగపోతున్నాయి, అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాయి, అందరితోనూ విస్తారంగా చర్చించకుండా, సంప్రదింపులు చేయకుండా, వేతనాలపై పెరుగుదలపై ఒక స్పష్టమైన దృష్టి పెట్టకుండా, హామీతో కూడిన ఉపాధి పనిదినాలు ప్రకటించకుండా ఈ విధమైన చాలా పెద్ద పెద్ద మార్పులను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రవేశపెట్టకూడదు, ఈ విధమైన కార్మిక వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక చర్యలను దేశవ్యాప్తంగా ఉన్న కార్మికవర్గం, ప్రజాస్వామ్యశక్తులు ప్రతిఘటించాలి''అని పార్టీ జాతీయ కార్యదర్శివర్గంఆ ప్రకటనలో కోరింది.

## పల్లెపోరు నేడే

(మొదటి పేజీ తరువాయి)

జరగనుంది. ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుంది. ఓట్ల లెక్కింపునకు అనుగుణంగా ఫలితాలు ప్రకటించనున్నారు. పంచాయతీ ఎన్నికల చివరి విడత పోలింగ్, ఓట్ల లెక్కింపు కోసం పోలీసు అధికారులు పట్టిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. చివరి విడతలో మొత్తంగా 4,157 గ్రామాల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే 11 సర్పంచ్, 112 వార్డు పదవుల కోసం నామినేషన్‌లు దాఖలు కాలేదు. కాగా, 394 సర్పంచ్, 7,916 వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవమయ్యాయి. దీంతో మిగిలిన 3,752 సర్పంచ్, 28,406 వార్డు పదవుల కోసం నేడు పోలింగ్ జరగనుంది.

## కేటాయించండి

(మొదటి పేజీ తరువాయి)

గుర్తు చేశారు. కేంద్ర ఎరువుల రసాయనాల శాఖ నుంచి 2,05,315 మెట్రిక్ టన్నుల కేటాయింపులకు గాను కేవలం 1,10,720 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయిందని, దీంతో లోటు ఏర్పడిందని,ఈ లోటును భర్తీ చేయాలని కేంద్రాన్ని పలుమార్లు కోరినప్పటికీ సమయానికి స్పందించలేదని తద్వారా రైతులు నష్టపోయారని వివరించారు.

మంత్రి శ్రీధర్ బాబు రబీ సీజన్‌కు సంబంధించి ఆర్‌ఎఫ్‌సిఎల్ తీసుకుంటున్న చర్యలు,ఉత్పత్తిలో ఎలాంటి ఆటంకాలు రాకుండా చేపడుతున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. దీనికి స్పందించిన కంపెనీ ప్రతినిధులు, గత ఖరీఫ్‌లో హెచ్‌టిఆర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యల కారణంగా ఉత్పత్తి నిలిచిపోయిందని, రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులకు చింతిస్తున్నామన్నారు. ఈ రబీలో ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో కేటాయింపుల మేరకు యూరియాను సరఫరా చేశామని, డిసెంబర్ నెలలో కూడా 50,450 మెట్రిక్ టన్నుల సరఫరా చేయనున్నట్లు వారు వివరించారు.

అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రామగుండంలో నెలకు సుమారు లక్ష టన్నుల యూరియా ఉత్పత్తి అవుతున్నప్పటికీ తెలంగాణ రాష్ట్రానికి కేవలం 40 నుంచి 50 శాతం మాత్రమే కేటాయింపులు జరుగుతున్నాయని వివరించారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే యూరియాలో కనీసం 70 శాతం అయినా తెలంగాణకే కేటాయించాలని కోరారు. దీనిపైన మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని పరిశ్రమల శాఖ ఎండిని ఆదేశించారు. అలాగే ఉత్పత్తిలో ఎటువంటి అవాంతరాలు వచ్చినా ప్రత్యామ్నాయ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని ఎన్‌ఎఫ్‌ఎల్ కంపెనీ ప్రతినిధులను మంత్రులు ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధిహక్కు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేతబూని పార్లమెంట్ మకర ద్వారం మెట్ల వద్ద గుమిగూడి, ప్రేరణ స్థలంలో ఉన్న జాతిపిత విగ్రహం వద్ద ర్యాలీగా నిర్వహించారు.

'జాతిపిత మహాత్మా గాంధీ దేశ ఆత్మను మేల్కొల్పారు. మన దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారు... ఈ రోజు బిజెపికి చేయడానికి కొత్తగా ఏమీ లేదు, అందుకే వారు పేరు మారుస్తున్నారు' అని సమాజ్‌వాదీ పార్టీ అధినేత, లోక్‌సభ ఎంపి అఖిలేష్ యాదవ్ అన్నారు. ప్రియాంకాగాంధీ మీడియాతో మాట్లాడుతూ పథకాల పేర్లను మార్చాలనే ప్రభుత్వ 'వ్యామోహం'పై ప్రియాంక గాంధీ కూడా విమర్శలు గుప్పించారు. ఈ పథకానికి మన జాతిపిత అయిన మహాత్మా గాంధీ పేరు పెట్టారని ఆమె గుర్తు చేశారు. ఎంజి నరేగాను రద్దు చేసే బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా, దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులకు ఉన్న చట్టబద్ధమైన ఉపాధి హామీని తొలగించాలని బిజెపి ప్రభుత్వం చూస్తోందని ఆమె ఆరోపించారు. 'వారు ప్రవేశపెట్టిన బిల్లు దేశంలోని లక్షలాది మంది కార్మికులకు, అలాగే గ్రామ సభలు, గ్రామ పంచాయతీలకు వ్యతిరేకం. దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాలని' ఆమె అన్నారు. ప్రభుత్వం ఈ బిల్లులో రెండు మూడు అంశాలను చేర్చిందని, అవి పైకి చూస్తే పనిదినాల సంఖ్యను పెంచినట్లు సూచిస్తాయి కానీ, వేతన రేటును పెంచారా? అని ఆమె ప్రశ్నించారు. ఇది రాష్ట్రాలపై భారం మోపుతుందని, పేద రాష్ట్రాలు ఈ భారాన్ని భరించలేవని, ఫలితంగా ఈ పథకం కుప్పకూలిపోతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో, ఈ పథకం కింద చేయాల్సిన పనులను గ్రామ పంచాయతీ నిర్ణయించేది, కానీ ఈ బిల్లు ఆ హక్కును కేంద్రానికి ఇస్తుందని, దీంతో నిధులను ఎక్కడ కేటాయించాలో కూడా కేంద్రమే నిర్ణయిస్తుందని ఆమె అన్నారు. నిధులను ఎక్కడ కేటాయించాలో, పనులను ఎక్కడ చేయాలో నిర్ణయించే గ్రామ పంచాయతీ హక్కును లాగేసుకుంటున్నారు. కాబట్టి అన్ని కోణాల నుండి ఈ బిల్లు తప్పు అని తాము భావిస్తున్నామని ప్రియాంక గాంధీ అన్నారు.

నాడు యువత భవిష్యత్తు నాశనం... నేడు పేదల జీవనోపాధికి గండి

గ్రామీణ ఉపాధిపై కేంద్రం తెచ్చిన కొత్త బిల్లుపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. మహాత్మాగాంధీ ఆదర్శాలకు అవమానకరమని అభివర్ణించారు. ఇప్పటికే మోదీ సర్కార్ తీవ్ర నిరుద్యోగం ద్వారా భారతదేశ యువత భవిష్యత్తును నాశనం చేసిందని ఇప్పుడు గ్రామీణ పేదల సురక్షితమైన జీవనోపాధిని నిర్మూలించడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎల్లప్పుడూ మహాత్మా గాంధీ ఆలోచనలకు వ్యతిరేకంగా ఉన్నారని, అధికారంలోకి వచ్చినప్పటి నుండి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇటువంటి చర్యలను వ్యతిరేకిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. 'మోదీజీకి రెండు విషయాలపై తీవ్రమైన ద్వేషం ఉంది. అవి మహాత్మా గాంధీ ఆలోచనలు, పేదల హక్కులు అని అన్నారు. 'ఎంజి నరేగా అనేది గ్రామ స్వయం పాలన అనే మహాత్మా గాంధీ కలలకు సజీవ స్వరూపం.

ఇది లక్షలాది గ్రామీణ జీవితాలకు జీవనాధారం, ఇది కొవిడ్ కాలంలో వారికి ఆర్థిక భద్రతా కవచంగా కూడా నిరూపించబడింది. 'కానీ ప్రధాన మంత్రి మోదీకి ఈ పథకంపై ఎప్పుడూ చిరాకుగా ఉండేది. గత 10 సంవత్సరాలుగా ఆయన దానిని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ రోజు, ఆయన ఈ పథకాన్ని పూర్తిగా తుడిచిపెట్టడానికి నిశ్చయించుకున్నారు' అని ఆయన తన హిందీ పోస్ట్‌లో ఆరోపించారు.

## ఐఐఎం ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఉందన్నారు. తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా నూతనంగా 9 కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న పట్టణీకరణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు అవసరం ఉందని రేవంత్ రెడ్డి చెప్పారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నాగర్కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, నిర్మల్ జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, ములుగు, నారాయణపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాలు వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఇతర వసతులు కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎ.పి.జితేందర్ రెడ్డి, ఎంపిలు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

### విద్యారంగం సమగ్రాభివృద్ధికి రూ.30వేల కోట్లు వెచ్చిస్తున్నాం : సిఎం

విద్యా రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా నిలవాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మొత్తంగా రాష్ట్రంలో విద్యా రంగం సమగ్రాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ.30 వేల కోట్లు వెచ్చించనున్నామని, ఈ నిధుల సమీకరణకు ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్‌పివి) ను ఏర్పాటు చేయనున్నామని, తద్వారా సేకరించే రుణాలకు ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితి నుంచి మినహాయించాలని ముఖ్యమంత్రి కోరారు. విద్యా రంగంపై ప్రభుత్వం చేస్తున్న వ్యయాన్ని మానవ వనరుల అభివృద్ధికి చేస్తున్న పెట్టుబడిగా భావించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ సిఎం మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో పార్లమెంట్‌లోని ఆమె ఛాంబర్‌లో సమావేశమయ్యారు. తెలంగాణ వ్యాప్తంగా 105 శాసన సభ నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల (వైఐఐఆర్‌ఎస్) ప్రాధాన్యతను ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. తెలంగాణలో అత్యధిక సంఖ్యలో ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. ఐదవ తరగతి నుంచి 12 తరగతుల వరకు ఉండే ఒక్కో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ (వైఐఐఆర్‌ఎస్) లో 2,560 మంది విద్యార్థులు ఉంటారని, మొత్తంగా 105 పాఠశాలతో 2.70 లక్షల మంది విద్యార్థులకు ప్రత్యక్షంగా నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని, వైఐఐఆర్‌ఎస్‌లు సమీప ప్రభుత్వ పాఠశాలలకు విద్యా హబ్‌లుగా ఉండడంతో పరోక్షంగా లక్షలాది మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని సిఎం వివరించారు. అత్యాధునిక వసతులు, లేబొరేటరీలు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని తెలిపారు. అలాగే, రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు మరో రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు చెప్పారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, తెలంగాణలో విద్యా రంగం అభివృద్ధిపై సిఎం రేవంత్ రెడ్డి చూపుతున్న చొరవను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసించారు.

వైఐఐఆర్‌ఎస్ మోడల్ బాగుందని కేంద్ర మంత్రి ఎస్‌పివికి సంబంధించిన వివరాలను అందజేయాలని సూచించారు. సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఎంపిలు మందాడి అనిల్ కుమార్, డాక్టర్ మల్లు రవి గారు, సురేశ్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నారు.

## సంబంధం లేదు

(మొదటి పేజీ తరువాయి)

అవి కూడా ప్రధానంగా ఆస్థి వ్యవహారాలు, వృద్ధ తల్లిదండ్రులను కలిసేందుకు మాత్రమేనని చెప్పారు. తన తండ్రి మృతి చెందిన సమయంలో కూడా భారత్‌కు రాలేదని కుటుంబవర్గాలు వెల్లడించాయి. సజీద్ అక్రమ్ లేదా అతని కుమారుడు తీవ్రవాద భావజాలం వైపు మళ్లారన్న విషయంపై తమకు ఎలాంటి సమాచారంలేదని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. అతని రాడికలైజేషన్ ఎలా జరిగిందనే దానిపై తమకు అవగాహన లేదన్నారు. ఈ ఘటన నేపథ్యంలో తెలంగాణ పోలీస్ శాఖ కీలకమైన సమాచారం ఇచ్చింది. సజీద్ అక్రమ్ 1998కి ముందు భారత్‌లో ఉన్న సమయంలో అతనిపై ఎలాంటి నేర రికార్డు లేదని, అలాగే అతని తీవ్రవాద దృక్పథానికి దారితీసిన కారణాలకు భారత్ లేదా తెలంగాణతో ఎలాంటి సంబంధం లేదని అధికారికంగా తెలిపింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు, అంతర్జాతీయ ఏజెన్సీలకు అవసరమైనప్పుడు పూర్తి సహకారం అందిస్తామని తెలంగాణ పోలీసులు తెలిపారు. అదే సమయంలో నిర్ధారణ కాని సమాచారంతో ఊహాగానాలు చేయవద్దని, బాధ్యతాయుతంగా వార్తలు ప్రచురించాలని మీడియాను, ప్రజలను రాష్ట్ర పోలీసు అధికారులు కోరారు.



# జనరల్
STATE & REGIONAL NEWS



విజయ్ దివస్ సందర్భంగా మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లోని అమర జవాన్ల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం ఉపముముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ విజయ్ దివస్ సందర్భంగా ఆనాటి అమర జవాన్లను స్మరించుకోవడం గుర్తించుకోదగిన సందర్భమన్నారు. యుద్ధ సమయంలో భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడిన నాటి ప్రధాని ఇందిరా గాంధీ, సైనిక నాయకులు, అమర జవాన్లు అందరికీ వందనాలు తెలిపారు.

## రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలి


**సిఎం రేవంత్ రెడ్డికి సోనియాగాంధీ సూచన**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'తెలంగాణ రైజింగ్– 2047' విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పనితీరు, రాష్ట్ర అభివృద్ధి విషయంలో సిఎం రేవంత్ రెడ్డి దూరదృష్టిని సోనియా గాంధీ అభినందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోనియా గాంధీని మంగళవా రం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను సిఎం ఆమెకు అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025' విశేషాలను సోని యా గాంధీకి సిఎం తెలియజేశారు. ప్రజా పాలన లో గత రెండేండ్లుగా అమలవుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో బిజెపికి చెంపపెట్టు

- ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర
- గాంధీ పేరు తొలగించడం ఆర్‌ఎస్‌ఎస్ ఎ జెండాలో భాగమే
- ఇడి, సిబిఐలను రాజకీయ ఆయుధాలుగా వాడుతున్నారు
- కేంద్రంపై భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను రాజకీయ కక్ష సాధింపు చర్యలకు వాడుకుంటోందని, మరోవైపు పేదలకు అండగా నిలిచే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని భువనగిరి కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో నేషనల్ హెరాల్డ్ కేసు పరిణామాలు, ఉపాధి హామీ పథకంలో కేంద్రం చేస్తున్న మార్పులపై ఆయన నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్సమెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాఖలు చేసిన ఫిర్యాదును కోర్టు కొట్టివేయడం బిజెపికి గట్టి చెంపపెట్టు అన్నారు. ఈ కేసులో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు గానీ, అక్రమ ఆస్తుల బదలాయింపు గానీ జరగలేదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన వెల్లడించారు. కేవలం రాహుల్ గాంధీ, సోనియా గాంధీలపై కక్ష సాధింపు కోసమే ఈ కేసును బూచీగా చూపించారని ఆయన ఆరోపించారు. మన్మోహన్ సింగ్ హయాంలో 2005లో ప్రారంభమైన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' దేశ చరిత్రలోనే పేదలకు అండగా నిలిచిన గొప్ప పథకమని ఎంపి గుర్తు చేశారు. అయితే, కేంద్రం ఇప్పుడు ఈ పథకం పేరును 'వికసిత్ భారత్ జి రామ్ జి'గా మార్చడం ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల ఆలోచనా విధానానికి నిదర్శనమన్నారు. చరిత్ర నుంచి మహాత్మా గాంధీ పేరును చెరిపేసేందుకే ఈ పేరు మార్పు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకానికి దేవుడి పేరు పెట్టి, అసలు సమస్యల నుండి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కిరణ్‌కుమార్ విమర్శించారు. గతంలో ఉపాధి హామీ పథకానికి కేంద్రం 100 శాతం నిధులు కేటాయించేదని, కానీ ఇప్పుడు దానిని 40:60 నిష్పత్తికి (కేంద్రం:రాష్ట్రం) మార్చి రాష్ట్రాలపై భారం మోపుతోందని ఎంపి ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయలేక చేతులెత్తేసే పరిస్థితి కల్పించారని ఆరోపించారు. పేదలు, దళితులు, మైనారిటీల పొట్టకొట్టేలా కేంద్రం వ్యవహరిస్తోందని అన్నారు.

**దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు**

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలను, పేదల వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని సిఎం కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉపాధి హామీ పథకంలో చేస్తున్న మార్పులకు వ్యతిరేకంగా మండల స్థాయి నుంచి దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు చేపడతామని ఆయన ప్రకటించారు. పేదల ఉపాధి హక్కును కాపాడుకునేందుకు ప్రజలు కూడా ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## సింగరేణి సిఎండిగా కృష్ణ భాస్కర్



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** సింగరేణి సంస్థ నూతన సిఎండిగా కృష్ణభాస్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సిఎండిగా ఉన్న ఎన్.బలరామ్ ఏడు సంవత్సరాల డిప్యూటేషన్ అనంతరం మాతృ విభాగానికి తిరిగి వెళుతున్న నేపథ్యంలో సింగరేణికి సిఎండి (ఎఫ్ఎసి)గా దేవరకొండ కృష్ణ భాస్కర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయన సింగరేణి భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుత చైర్మన్ ఎన్.బలరామ్ నుండి బాధ్యతలను తీసుకున్నారు. డి.కృష్ణ భాస్కర్ 2012 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన తెలంగాణ ట్రాన్స్‌కో సిఎండిగానూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీగా నూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆ యన రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. తెలంగాణ ఇం డస్ట్రీస్ శాఖకు డైరెక్టర్ గానూ, రాష్ట్ర ఆర్థిక, ప్ర ణాళిక శాఖకు స్పెషల్ సెక్రటరీ గానూ వ్యవహరించారు.



## అసంఘటిత కార్మికులకు బలమైన అండ సిపిఐ

- కార్మికులు అనుభవించే ప్రతీ హక్కూ ఎఐటియుసి పోరాట ఫలితమే
- హక్కుల సాధన పరిరక్షణకు ఎర్రజెండా అభ్యర్థులను గెలిపించండి : ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సంఘటిత, అసంఘటిత కార్మికులకు అండగా నిలిచేది, వారి హక్కుల పరిరక్షిస్తూ నూతన హక్కులను సాధించి పెడుతుంది ఎర్రజెండానే అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో మంగళవారం జరిగిన కొత్తగూడెం డివిజన్ హమాలీ కార్మికుల ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు అనుభవిస్తున్న ప్రతీ హక్కు సౌకర్యం వెనుక ఎఐటియుసి, సిపిఐ పోరాటం ఉందని, పోరాటాలు సాగిస్తే హక్కులు ఏర్పడతాయన్నారు. హక్కుల సాధన, పరిరక్షణకు ఎర్రజెండాపై పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గరీబ్ పేట, హేమచంద్రాపురం తదితర పంచాయతీల్లో హమాలీ కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నారని ప్రజలు, కార్మికుల కోసం పోరాడే కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా అభివృద్ధికి బాటలు వేసిన వారవుతారని సూచించారు. ఈసమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాంజనేయ కాలనీ సర్పంచ్, 12 మంది వార్డు సభ్యులు కూనంనేని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూల మాలతో సత్కరించారు.

## బుక్కపాడు పారిశ్రామిక వార్డులో మౌలిక వసతులు కల్పించండి

**అధికారులను ఆదేశించిన ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బుగ్గపాడులో మౌలిక వసతులు పూర్తి చేయండి: ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని బుగ్గపాడు పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన మంగళవారం టిజిఐఐసి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. బుగ్గపాడులోని 200 ఎకరాల్లో మెగా ఫుడ్ పార్కు, తెలంగాణా ఫుడ్ ప్రాసెసింగ్ జోన్, ఎంఎస్ ఎంఇ జోన్ లను టిజిఐఐసి ఏర్పాటు చేసింది. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి పెట్టుబడిదారులు ముందుకొస్తున్నందున త్వరితగతిన ఏర్పాట్లన్నీ పూర్తిచేయాలని శ్రీధర్ బాబు సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులో జనవరిలో పరిశ్రమల నిర్మాణాలు మొదలయ్యేలా చూడాలని ఆయన ఆదేశించారు. మెగా ఫుడ్ పార్కుకు కేటాయించిన 60 ఎకరాల్లో యూనిట్ల నిర్మాణాలను ప్రారంభించేలా భూకేటాయింపులు పొందిన వారిని కోరాలని తెలిపారు. తెలంగాణా ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌ను 80 ఎకరాలు, ఎంఎస్ ఎంఇ జోన్‌ను 60 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో కొత్తగా వ్యవసాయ, అక్వారంగ పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. సమావేశంలో టిజిఐఐసి ఎండి శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, డైరెక్టర్ (ఇన్ వెస్ట్ మెంట్స్) మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



## మూరగుండ్ల లక్ష్మయ్య మరణం బాధాకరం

**తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగంహేమంతరావు, ప్రధానకార్యదర్శి పశ్యపద్మ సంతాపం**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) సూర్యాపేట జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు మూరగుండ్ల లక్ష్మయ్య మరణం బాధకరమని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగంహేమంతరావు, ప్రధానకార్యదర్శి పశ్యపద్మ అన్నారు. లక్ష్మయ్య మృతికి తమ ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. తుంగతుర్తి ప్రజా నాయకుడిగా , తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా రైతాంగ సమస్యలపై లక్ష్మయ్య నిరంతరం పోరాడిన యోధుడని,. ఎంజెన్నారెడ్డి భూములపైన, పేద రైతుల పట్టాల కోసం సిసిఎల్ ఏ కార్యాలయం ముందు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ధర్నాల్లో పాల్గొన్నారని, ఈ సందర్భంగా తమతో పాటు నాటి అధికారి సోమేష్ కుమార్‌తో ధరణి సమస్యలపై మాట్లాడారని గుర్తు చేశారు. సన్న, చిన్నకారు రైతులకు పట్టాలు రావాలని ఆయన తన తుది శ్వాస వరకు పోరాడారని, రైతు సంఘం నిర్మాణం పట్ల ,ఇతర రైతు సంఘాలతో కలిసి సంయుక్త కిసాన్ మోర్చా కార్యక్రమాలలో లక్ష్మయ్య ముందుండి నిలబడ్డారని తెలిపారు.ఇటీవల అనారోగ్యానికి గురై మరణించారన్నారు.


ఫారం VII

(సెక్షన్ ఉప నియమం (1) యొక్క నియమం -25 మరియు సెక్షన్ 19(1) యొక్క చట్టం -30/2013)

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
రూఢి ప్రకటన

గెజిట్ నెం. 145/2025 తేది: 04.12.2025
నెం. ఎఫ్/7321/2025 తేది: 28.11.2025
నెం. జి/942/2025 తేది: 04.12.2025

ప్రజా ప్రయోజనము నిమిత్తం అనగా నారాయణపేట కొండంగల్ లిఫ్టు ఇరిగేషన్ నిర్మాణం లో భాగంగా ఉట్కూర్ చెరువు పునరొధరణ కొరకు నారాయణపేట జిల్లా, ఉట్కూర్ మండలం, ఉట్కూర్ గ్రామం పరిదిలో మొత్తం **ఎ .44.11 గుంటలు** భూమీ అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ నారాయణపేట వారు భావించుచున్నారు.

కావున ఇట్టి ప్రకటన ద్వారా నారాయణపేట జిల్లా, ఉట్కూర్ మండలం, ఉట్కూర్ గ్రామం పైన పేర్కొన ప్రాజెక్ట్ కొసం భూమి కొలిచి ఎక్కువ లేదా తక్కువ **ఎ. 44.11 గుంటలు** అంటే 17.85 హెక్టార్లు దీని వివరణాత్మక వర్ణన ఈ క్రింది విధంగా ఉంది.

| క్ర.సం. | సర్వే నెం. | భూమి స్వభావం | భూమి రకం | భూ సేకరణ క్రింద తీసుకోబడిన విస్తీర్ణం | ఆసక్తిగల వ్యక్తుల పేర్లు | సరిహద్దులు ఉ | తూ | ప | ద | చెట్లు రకం | సంఖ్య | కట్టడాలు రకం | విస్తీర్ణం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 19 | పట్టా | మెట్ట | 0.10 | చంద్రమ్మ భర్త శివ రెడ్డి | 30 | 20 | 28 | 17 | - | - | - | - |
| 2 | 25/1 | పట్టా | మెట్ట | 1.04 | అవ్వ హేమాసుందర వర ప్రసాద్ (అగ్రిగోల్డ్) | 39 | 24 | 99 | 26 | - | - | - | - |
| 3 | 25/ఆ/1 | పట్టా | మెట్ట | 1.29 | | 39 | 24 | 99 | 26 | - | - | - | - |
| 4 | 25/ఆ/1/2 | పట్టా | మెట్ట | 1.00 | | 39 | 24 | 99 | 26 | - | - | - | - |
| 5 | 25/ఇ/1 | పట్టా | మెట్ట | 1.28 | | 39 | 24 | 99 | 26 | - | - | - | - |
| 6 | 25/ఆ/1 | పట్టా | మెట్ట | 1.04 | | 39 | 24 | 99 | 26 | - | - | - | - |
| 7 | 26అ/1 | పట్టా | మెట్ట | 5.27 | అవ్వ హేమాసుందర వర ప్రసాద్ (అగ్రిగోల్డ్) | 144 | 23 | 25 | 27 | - | - | - | - |
| 8 | 26అ/2 | పట్టా | మెట్ట | 0.05 | | 144 | 23 | 25 | 27 | - | - | - | - |
| 9 | 27అ/ఆ | పట్టా | మెట్ట | 1.06 | నర్సింగ్ రెడ్డి తండ్రి లక్ష్మా రెడ్డి | 45 | 22 | 26 | 28 | - | - | - | - |
| 10 | 27అ1 | పట్టా | మెట్ట | 0.15 | పి వెంకట్ రెడ్డి తండ్రి మల్ రెడ్డి | 45 | 22 | 26 | 28 | - | - | - | - |
| 11 | 27ఆ2 | పట్టా | మెట్ట | 0.16 | పి మురలీధర్ రెడ్డి తండ్రి మల్ రెడ్డి | 45 | 22 | 26 | 28 | - | - | - | - |
| 12 | 27ఆ3 | పట్టా | మెట్ట | 0.16 | పి శ్రీనివాస్ రెడ్డి తండ్రి మల్ రెడ్డి | 45 | 22 | 26 | 28 | - | - | - | - |
| 13 | 27ఇఆ | పట్టా | మెట్ట | 0.23 | కోరం నారాయణ రెడ్డి తండ్రి కోరం రామప్ప | 45 | 22 | 26 | 28 | - | - | - | - |
| 14 | 27ఇ/ఇ | పట్టా | మెట్ట | 0.23 | పేట పద్మమ్మ భర్త అనంత రెడ్డి | 45 | 22 | 26 | 28 | - | - | - | - |
| 15 | 27ఇ1 | పట్టా | మెట్ట | 0.37 | వర్తియా మంజుల భర్త వర్తియా రాఘ వేందర్ | 45 | 22 | 26 | 28 | - | - | - | - |
| 16 | 27ఇఅ1 | పట్టా | మెట్ట | 0.10 | వర్తియా మంజుల భర్త వర్తియా రాఘ వేందర్ | 45 | 22 | 26 | 28 | - | - | - | - |
| 17 | 27ఇ/1 | పట్టా | మెట్ట | 2.13 | వేంకటేశ్వర్ రెడ్డి తండ్రి చెన్న రెడ్డి | 45 | 22 | 26 | 28 | - | - | - | - |
| 18 | 27ఆ/2 | పట్టా | మెట్ట | 1.13 | పి కవిత భర్త మల్లా రెడ్డి | 45 | 22 | 26 | 28 | - | - | - | - |
| 19 | 27ఆ/1 | పట్టా | మెట్ట | 1.00 | పి మహేందర్ తండ్రి పి మల్లా రెడ్డి | 45 | 22 | 26 | 28 | - | - | - | - |
| 20 | 28/ఆ/2 | పట్టా | మెట్ట | 0.30 | శ్రీనివాస్ రెడ్డి ఇంజం తండ్రి రామ్ రెడ్డి | 29 | 21 | 27 | 19 | - | - | - | - |
| 21 | 29/ఆ | పట్టా | మెట్ట | 7.29 | శ్రీనివాస్ రెడ్డి ఇంజం తండ్రి రామ్ రెడ్డి | 30 | 28 | 53 | 19 | - | - | - | - |
| 22 | 30 | పట్టా | మెట్ట | 1.08 | బసీర్ ఉల్ హసన్ తండ్రి మో యూసుఫ్ సాబ్ | 31 | 29 | 154 | 31 | - | - | - | - |
| 23 | 30/2 | పట్టా | మెట్ట | 1.07 | యూసుఫ్ తండ్రి ఇస్మాయిల్ సాబ్ | 31 | 29 | 154 | 31 | - | - | - | - |
| 24 | 30/1 | పట్టా | మెట్ట | 1.08 | ఇద్రిస్ తండ్రి మో ఇస్మాయిల్ సాబ్ | 31 | 29 | 154 | 31 | - | - | - | - |
| 25 | 31 | ప్రభుత్వ భూమి | మెట్ట | 8.31 | ప్రభుత్వ భూమి | 204 | 30 | 157 | 32 | - | - | - | - |
| 26 | 31/10 | ప్రభుత్వ భూమి | మెట్ట | 1.00 | చింతన్ పల్లి సుదర్శన్ రెడ్డి తండ్రి చింతన్ పల్లి భీం రెడ్డి | 204 | 30 | 157 | 32 | - | - | - | - |
| 27 | 31/13 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.19 | ప్రభుత్వ భూమి | 204 | 30 | 157 | 32 | - | - | - | - |
| మొత్తం | | ఎ.44.11 గుంటలు | | | | | | | | | | | |

30/2013 చట్టంలోని u/s 15 అందించిన విధంగా ఆసక్తి గల వ్యక్తుల అభ్యంతరాలను విన్న తర్వాత మరియు తగిన విచారణ తర్వాత ఈ ప్రకటన చేయబడింది.

భూసేకరణ, పునరావాసం మరియు పునస్తాపన లో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం (30 /2013 చట్టం ) లోని సెక్షన్ 16 ప్రకారం, ప్రభావిత కుటుంబాల కోసం గ్రామ సభలు మరియు సామజిక ఆర్థిక సర్వే నిర్వయించ బడ్డాయి. భూసేకరణ చేయు భూమిలో ఎటువంటి నివాస గృహములు లేవు, వ్యవసాయ భూమి భాగములు మాత్రమే సేకరించబడుచున్నవి. ఇట్టి ప్రాజెక్టు భూసేకరణ ద్వారా ఏ యొక్క కుటుంబము కూడా భూనిర్వాసితులు కావడం లేదు. ఏ ఒక్క వృత్తి కళాకారులు కాని, చిరు వ్యాపారులు కాని, వాణిజ్య సముదాయములు కానీ, ప్రజల సామూహిక సౌకర్యములు అనగా రోడ్లు, నీటి ట్యాంకులు, పార్కులు సేకరించబడుట లేదు.

ఈ భూమి కింద ఉన్న బొగ్గు, ఇనుప రాయి, ప్లేట్ లేదా ఇతర ఖనిజాల గనులు లేదా పేర్కొన్న భూమిలోని ఏదైనా నిర్దిష్ట భాగం తప్ప, భూమిని సేకరించే ఉద్దేశ్యంతో ప్రాజెక్ట్ నిర్మాణ దశలో తవ్వడానికి లేదా తొలగించడానికి లేదా ఉపయోగించాల్సిన గనులు మరియు ఖనిజాల భాగాలు తప్ప, అవసరం లేదు.

నారాయణపేటలోని భూ సేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఏదైనా పని రోజున భూమి యొక్క ప్రణాళికను తనిఖీ చేయవచ్చు.

పునరావాసం మరియు పునస్తాపన యొక్క సారాంశం శూన్యం.

సం/- భూసేకరణ అధికారి& రాజస్వ మండలాధికారి నారాయణపేట
సం/- అదనపు కలెక్టర్(రెవిన్యూ) నారాయణపేట
సం/- జిల్లా కలెక్టర్ నారాయణపేట

DIPR RO NO. 951/LA/PP/Advt/Pub/2025-26


## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్

- గ్రామస్థాయిలో కార్యకర్తల పోరాటం అద్భుతం
- మధిర నియోజకవర్గంలో సర్పంచ్‌లకు అభినందన సభలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**ప్రజాపక్షం/ మధిర :** రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటికే 85శాతం స్థానాలు గెలుచుకుని కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని, ఇందిరమ్మ ప్రజాపాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున దీవించి కాంగ్రెస్ నేతలను పెద్ద ఎత్తున గెలిపిస్తున్నారని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం ఆయన మధిర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో నూతనంగా గెలిచిన సర్పంచ్‌ల అభినందన సభలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున స్థానాలు గెలుచుకుని విజయ ఢంకాను మోగించి చరిత్ర సృష్టించారని, పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా అత్యంత ప్రజాస్వామిక పద్ధతిలో జరుగుతున్నాయని డిప్యూటీ సిఎం తెలిపారు. ఫలితాలు హర్షించదగిన రీతిలో వెల్లడి అయ్యాయన్నారు. ఎవరు సర్పంచ్‌లు గెలిచిన ప్రభుత్వం తరుపున న్యాయం చేస్తామని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను సమానంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ విజయ దుందుభిలో కాంగ్రెస్ కార్యకర్తల కృషి పోరాటం అద్భుతమైనదని తెలిపారు. మొదటి విడతలో చేపట్టిన నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు, ప్రతి ఇంటికి రూ.5లక్షలు ఖర్చు చేస్తున్న తీరు, రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం వారి పక్షాన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.8,600 కోట్లు ఆర్‌టిసికి చెల్లించిందని ఆయన వివరించారు. దేశంలో నే అతి ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సాధించిందని, అభివృద్ధి చెందిన గుజరాత్ లాంటి రాష్ట్రాలు కూడా తెలంగాణతో పోటీపడే పరిస్థితి లేదని అన్నారు. 2017 కల్లా త్రి ట్రిలియన్ డాలర్ ఎకనామిని సాధించబోతున్నామని, అందులో భాగంగా 1.39 లక్షల మెగా వాట్ల విద్యుత్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఎలా అందించబోతున్నామో విజన్ డ్యాకుమెంట్లో వివరించామని డిప్యూటీ సిఎం తెలిపారు. విజన్ డాక్యుమెంట్ విడుదల చేసిన గంటల వ్యవధిలోనే 5.76లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తరలివచ్చాయని, భవిష్యత్‌లో రాష్ట్రంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలి రానున్నాయని తెలిపారు. మధిర నియోజకవర్గంలో 131 సర్పంచ్ స్థానాలకుగాను 90 స్థానాలకు పైగా కాంగ్రెస్ అభ్యర్థులు గెల్చుకుని రికార్డు సృష్టించారని, 1983 నుంచి చూస్తే ఈ స్థాయిలో కాంగ్రెస్ అభ్యర్థు లు ఎన్నడూ కూడా ఇంత పెద్ద మొత్తంలో సర్పంచ్ స్థానాలు గెల్చుకోలేదని తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అద్భుత విజయాలు సాధించారని తెలిపారు. ఈ రోజు నుంచే సర్పంచ్‌ల బాధ్యత మొదలైందని, కేవలం వ్యవసాయమే కాకుండా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, విద్యా, వైద్య రంగాలపై సర్పంచ్‌లు దృష్టి సారించాలని, నిత్యం సమీక్షించాలని తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో మౌలిక వసతులు, ప్రభుత్వ పాఠశాలలు, తదితర ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని తెలిపారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తనకు నేరుగా ఫోన్ చేయవచ్చు లేదా తన కార్యాలయానికి సిబ్బంది అందుబాటులో ఉంటారని డిప్యూటీ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల, పట్టణ ముఖ్య నేతలు, గ్రామశాఖ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణను స్వాగతిస్తున్నాం

**కల్వకుంట్ల కవిత**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐడిపిఎల్ సహా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్, రెవెన్యూ అధికారులతో విచారణకు ఆదేశించడాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత స్వాగతించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత వివిధ విచారణల పేరుతో ప్రచారం చేసుకోవడం తప్ప, చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణను త్వరితగతిన పూర్తి చేసి, ప్రభుత్వ భూములను అక్రమార్కుల చెర నుంచి విడిపించాలని, ఆ భూములన్నీ ప్రజలకే చెందాలని కవిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ జిల్లా పర్యటన సందర్భంగా ఐడిపిఎల్ సహా ప్రభుత్వ భూముల ఆక్రమణల విషయాన్ని ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని, ఈ విషయాలనే తాను మీడియాకు వెల్లడించానని తెలిపారు. ఈ విచారణలో నిజాలను నిగ్గు తేల్చాలని తద్వారా తమ కుటుంబంపైన రాజకీయ కా రణాలతో ప్రత్యర్థులు చేసిన తప్పుడు ఆరోపణలు కూడా తేలిపోతాయని కవిత స్పష్టం చేశారు.

# బిసి రిజర్వేషన్ల సాధనకు దేశాన్ని ఏకం చేస్తాం

- బిసి రిజర్వేషన్లపై పార్లమెంటులో కాంగ్రెస్ ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టాలి
- కేంద్రం స్పందించకుంటే రైతు ఉద్యమ తరహాలో బిసి ఉద్యమాన్ని చేపడతాం
- ఢిల్లీలో ఓబిసి జాతీయ సెమినార్‌లో బిసి జెఎసి నేతల ప్రకటన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తున్న అన్ని రాష్ట్రాలతో కలిసి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలంగాణ బిసి జెఎసి ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేసి జనాభా దామాషా ప్రకారం బిసి రిజర్వేషన్లు పెంచాలని దేశంలోని 11 రాష్ట్రాల అసెంబ్లీల్లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారని, ఇంకొక వైపు రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం కల్పించాలని సుప్రీంకోర్టులో న్యాయపోరాటం జరుగుతున్నదని జెఎసి వెల్లడించింది. న్యూఢిల్లీ తెలంగాణ భవన్‌లోని సెమినార్ హాల్‌లో మగళవారం తెలంగాణ బిసి జెఎసి ఆధ్వర్యంలో ఓబిసి జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సెమినార్‌కు తెలంగాణ బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, అధికార ప్రతినిధి తాటికొండ విక్రమ్ సమన్వయం చేయగా సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె.నారాయణ, బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మాజీ ఎంపి వి.హనుమంతరావు హాజరయ్యారు. డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బిసిలను అన్ని పార్టీలు మోసం చేస్తున్నాయని, ఒకవైపు రాజకీయ పార్టీలు అన్యాయం చేస్తుంటే ఇంకొక వైపు పచ్చ గట్టిగా పచ్చపాము కనపడకుండా కాటు వేసినట్టు బిసి నాయకులే బిసిలను బలి తీసుకుంటున్నారని విమర్శించారు. బిసి ఉద్యమానికి జాతీయస్థాయిలో సిపిఐ అండగా ఉంటుందని ఆయన ప్రకటించారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో ప్రవేట్ బిల్లును ప్రవేశపెట్టాలని, ఈ బిల్లుకు బిజెపి మద్దతు పలకాలని లేనట్లయితే ఇప్పటికే టిఆర్‌ఎస్ ఎంపి వద్దిరాజు రవిచంద్ర పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రైవేట్ బిల్లుకు కాంగ్రెస్, బిజెపి మద్దతు పలకాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్లపై స్పందించకపోతే రైతు ఉద్యమ తరహాలోనే దేశాన్ని ఒక్కటి చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, ఫిబ్రవరిలో తెలంగాణలో రాష్ట్రవ్యాప్త బిసి యాత్ర చేపట్టి మార్చిలో లక్షలాదిమందితో హైదరాబాదులో సింహగర్జన సభను నిర్వహించి బిసిల తడాఖాను ఢిల్లీ పెద్దలకు చూపిస్తామని ఆయన హెచ్చరించారు. వి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల పెంపు బాధ్యత కాంగ్రెస్ బిజెపి పార్టీలదేనని, వారిపై ఒత్తిడి పెంచడానికి తెలంగాణ ఉద్యమ తరహాలోనే బిసి ఉద్యమాన్ని చేపడతామన్నారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం బిఆర్‌ఎస్ పార్లమెంటులో ప్రై వేట్ బిల్లును ప్రవేశపెట్టిందని, దీనిని ముందుకు తీసుకెళ్లే బాధ్యత కాంగ్రెస్‌దేనన్నారు. బిసి జెఎసి ఉద్యమానికి బిఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. హనుమంతరావు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లపై పార్లమెంటులో ప్రవేట్ బిల్లును ప్రవేశపెట్టాలని రాహుల్ గాంధీకి తాను లేఖ రాశానని, అతి త్వరలోనే ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఒత్తిడి తీసుకొస్తామ ని తెలిపారు. సమావేశంలో బిసి జెఎసి రాష్ట్ర కన్వీనర్ పెరిక సురేష్, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్, బిసి జెఎసి నేతలు పిట్ల శ్రీధర్, బి.మనీమంజరి తదితరులు పాల్గొన్నారు.


**CHANGE OF NAME**

I, **LAXMI KOTESWARI VERICHARLA** (Old Name), W/o. **PRABHAKAR RAO MUNAGANTI**, R/o. H.NO. 1-1-101, Prashanth Nagar, NIT, Kazipeta, Hanumakonda District, Telangana state,have changed my name from **LAXMI KOTESWARI VERICHARLA** to **MUNAGANTI LAKSHMI KOTESHWARI** (New Name) for all purposes



# జనరల్
STATE & REGIONAL NEWS

## డివిజన్ల ఏర్పాటుపై పిటిషన్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి)కి సమీపంలోని మున్సిపాల్టీలను విలీనం చేసి డివిజన్ల సంఖ్యను 300కు పెంపు ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందని దాఖలైన లంచ్మోషన్ పిటిషన్లను హైకోర్టు బుధవారం విచారణ చేయనుంది. డీలిమిటేషన్ ప్రక్రియను సవాల్ చేసిన పిటిషన్లను మంగళవారం జస్టిస్ బి.విజయ్సేన్‌రెడ్డి విచారించి ఈ ఉత్తర్వులు జారీ చేశారు. నాగేంద్ర ప్రకాష్ రెడ్డి ఇతరులు దాఖలు చేసిన లంచ్మోషన్ పిటిషన్లల్లో డివిజన్ల ఏర్పాటు ప్రతిపాదన అశాస్త్రీయమని, మ్యాప్లు కూడా లేవని, డివిజన్లలో జనాభా సంఖ్యలో చాలా వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కొత్త డివిజన్ల ఏర్పాటులో భాగంగా రాంనగర్ డివిజన్కు అన్యాయం జరిగిందని పేర్కొంటూ విజయ్కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిష్ను న్యాయమూర్తి విచారణ పూర్తి చేశారు. నాలాను సరిహద్దుగా చేసుకుని డివిజన్ విభన జరిగిందని, డివిజన్ల ఏర్పాటుపై లేవనెత్తే అభ్యంతరాలు సహేతుకంగా లేవంటూ పిటిషనర్ ఇచ్చిన వినతిపత్రాలను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. ఇతర లంచ్మోషన్ పిటిషన్లపై బుధవారం విచారిస్తామన్నారు.

## శాటిలైట్ ద్వారా పంటల సర్వే అంశంపై జర్మనీ కంపెనీతో తుది దశలో చర్చలు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాటిలైట్ ద్వారా పంటల సర్వే అంశంపైన జర్మనీ కంపెనీతో చర్చలు తుది దశలో ఉన్నాయని, ఆ ఒప్పందం కుదిరితే, పండించిన పంటకే రైతు భరోసా సహాయం ఇచ్చే అవకాశం ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. కొండలు, గుట్టలకు భరోసా నిలిపేసి, ఆ నిధులను ఫసల్ భీమకు ఉపయోగిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపైన త్వరలో మంత్రివర్గం సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.హైదరాబాద్‌లోని సచివాలయంలో తనను కలిసిన కొంతమంది జర్నలిస్టులతో తుమ్మల నాగేశ్వర్ రావు మంగళవారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. యూరియా కొనుగోళ్ల కోసమే రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ యాప్‌ను తీసుకొస్తుందని, రైతు వేదికల ద్వారా మొబైల్ యాప్‌లపైన రైతుల అభిప్రాయాలను సేకరించామని, మొబైల్ యాప్‌పైన రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేవని మంత్రి తెలిపారు. పత్తి అమ్మకం పట్ల రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటున్నారని, ఇది వంద శాతం విజయ వంతమైందన్నారు. రాజకీయ పబ్బం కోసం కొంతమంది వ్యక్తులు విమర్శలు చేస్తున్నారన్నారు. యూరియాను బ్లాక్‌లో పరిశ్రమల అవసరాలకు తరలిస్తున్నారనే ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయని, యూరియా పక్కదారి పట్టకుండా నేరుగా రైతులకు అందే విధంగా మొబైల్ యాప్ పని చేస్తుందని తెలిపారు.

## అవార్డు అందుకున్న జిఎం శ్రీవాస్తవ

దక్షిణ మధ్య రైల్వేకు నాలుగు 'జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు -2025'



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుండి ఉత్తమ పనితీరు కనబరిచి న యూనిట్ అవార్డును అందుకున్నారు. రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 14న జరిగిన నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డ్స్2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రపతి జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా, దక్షిణ మధ్య రైల్వేకు 2025 సంవత్సరానికిగాను నాలుగు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు లభించాయి. భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. కేంద్ర విద్యుత్, గృహనిర్మాణం మరియు పట్టణ వ్యవహారాల శాఖల మంత్రి మనోహర్ లాల్ , కేంద్ర విద్యుత్, ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ వై. నాయక్ జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులను ప్రదానం చేశారు. గుంతకల్లులోని డీజిల్ ట్రాక్షన్ శిక్షణ కేంద్రం హాస్టల్ ఉత్తమ పనితీరును కనబరిచినందుకు యూనిట్ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అందుకున్నారు.

## 26వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అఖిల భారత పోలీసు బ్యాండ్2025 పోటీలను రాష్ట్ర డిజిపి బి.శివధర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. మౌలాలీలోని ఆర్‌పిఎఫ్ శిఖనా కేంద్రంలో దక్షిణ మధ్య రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 26వ అఖిల భారత పోలీస్ బ్యాండ పోటీల ప్రారంభోత్సవానికి శివధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో పాటు రైల్వే అధికారులు సత్య ప్రకాష్,అరోమా సింగ్ ఠాకూర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ ప్రతిష్టాత్మక పోటీలో పాల్గొంటున్న పోలీసు బ్యాండ్‌లన్నింటికీ స్వాగతం పలికారు. ఈ పోటీ కేవలం సంగీత నైపుణ్యాన్ని ప్రదర్శించడమే కాకుండా, భారత పోలీసు దళాలను నిర్వచించే ఐక్యత, క్రమశిక్షణ, సేవా స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. 26వ అఖిల భారత పోలీస్ పోటీలను నిర్వహించడంలో దక్షిణ మధ్య రైల్వే రైల్వే రక్షణ దళం (ఆర్‌పిఎఫ్) చేసిన ప్రయత్నాలను ఆయన అభినందించారు. ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్‌లో ప్రయాణికుల భద్రతకు, రైల్వే ఆస్తుల రక్షణకు బాధ్యత వహించే దేశంలోని ముఖ్యమైన భద్రతా దళాలలో ఆర్‌పిఎఫ్ ఒకటి అని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, ప్రతి పోలీసు బ్యాండ్ వెనుక జట్టుకృషి, క్రమశిక్షణ, అంకితభావం ఉంటాయని, ఇది పోలీసు బలగాల ప్రధాన లక్షణాలను కూడా ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు.

## 'ఉపాధి హామీ'లో గాంధీ పేరు కొనసాగించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలని, లేదంటే ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండబోవని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించడం దుర్మార్గ చర్య అని, ఇందుకు మోదీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ పథకాన్ని గ్రామీణ, పట్టణ ప్రజలు విజయవంతంగా ఉపయోగించుకుంటున్నారని, ఇలాంటి సమయంలో గాంధీ పేరును తొలగించడం సమంజసం కాదని చిన్నారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్రాన్ని తెచ్చిన మహాత్మా గాంధీ స్వరాష్ట్రమైన గుజరాత్ అని కూడా చూడకుండా మోదీ ప్రభుత్వం ఆ మహనీయుని పేరును తొలగించడం అన్యాయమని, దేశ స్వాతంత్ర పోరాటంలో బిజెపి పాత్ర ఏమాత్రం లేదనే విషయం ప్రతి ఒక్కరికి తెలుసునని చిన్నారెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బిఆర్ఎస్ కార్యవర్గ, శాసనసభాపక్ష సమావేశం 21వ తేదీకి వాయిదా: హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఈ నెల 19వ తేదీన నిర్వహించాల్సిన బిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ, బిఆర్ఎస్ఎల్‌పి సమావేశాన్ని ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసినట్టు బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వెల్లడించారు. ఈ నెల 19వ తేదీన పార్లమెంట్ సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు పాల్గొంటున్నారని, అందుకే సమావేశాన్ని వాయిదా వేసినట్టు హరీశ్ రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# అశాస్త్రీయంగా వార్డుల పునర్విభజన

● అభ్యంతరాలు వ్యక్తం చేసిన అన్ని పార్టీల సభ్యులు ● హోరాహోరీగా జిహెచ్ఎంసి పాలక మండలి ప్రత్యేక సమావేశం





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వార్డుల పునర్విభజన అంశంపై మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) ప్రత్యేక పాలక మండలి సమావేశం హోరాహోరీగా సాగింది. సమాచారం ఇవ్వకుండా, ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా వార్డుల విభజన చేశారంటూ అధికార పక్షం, ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి ప్రత్యేక పాలక మండలి సర్వసభ్య సమావేశం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగింది. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం సహా అన్ని పార్టీల కార్పొరేటర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు పునర్విభజనను అశాస్త్రీయమని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. పునర్విభజన ఎంఐఎంకు అనుకూలంగా ఉందని బిజెపి సభ్యులు ఆరోపించగా, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా చేపట్టారని బిఆర్ఎస్ తెలిపింది. జనాభా వ్యత్యాసం 10 శాతాన్ని మించిందని, సహజ సరిహద్దులు పాటించలేదని సభ్యులు అభ్యంతరం తెలిపారు. జిహెచ్ఎంసి పరిధిలో కొత్తగా విలీనం చేసిన 27 మునిసిపాలిటీలతో పాటు, వార్డుల సంఖ్యను 150 నుంచి 300 వరకు పెంచేందుకు ప్రభుత్వం చేసిన వార్డుల పునర్విభజనపై కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు చర్చలో పాల్గొన్నారు. సరిహద్దులు నిర్ధారించడంలో శాస్త్రీయత పాటించలేదని, అనేక డివిజన్‌లకు పొంతనలేని పేర్లు పెట్టారని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వార్డుల పునర్విభజనలో చోటు చేసుకున్న పొరపాట్లను తాము వ్యక్తం చేసిన అభ్యంతరాలను తప్పనిసరిగా మార్పులు చేర్పులు చేయాలని సభ్యులు ముక్తకంఠంతో కోరారు. అయితే సభ అసాంతం వాడివేడి చర్చల మధ్య సాగింది. అధికార, ప్రతిపక్ష సభ్యులు సందర్భోచితంగా చలోక్తులు, వ్యగాస్త్రాలు, విసుర్లతో పరస్పరం సాధించుకున్నారు. మధ్య మధ్యలో చిన్న చిన్న వాగ్వాదాలు చోటు చేసుకున్నా, మేయర్ విజయలక్ష్మి సభ్యులను సముదాయిస్తూ సమావేశాన్ని సావధానంగా నడిపించారు. అయితే సమావేశం చివరిలో పలువురు సభ్యులకు అవకాశం కల్పిస్తామని చెప్పినా.. దారుస్సలంలో వార్డుల విభజన చేశారంటూ బిజెపి సభ్యులు చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. దీంతో ఎంఐఎం, బిజెపి సభ్యులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గెజిటెడ్ పేపర్లను చింపి సభలో విసురుతూ, మేయర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. దీంతో బిజెపి కార్పొరేటర్‌పై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గందరగోళం నడుమ పునర్విజనపై కార్పొరేటర్ల నుంచి వచ్చిన అభిప్రాయాలను, అభ్యంతరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని మేయర్ ప్రకటించారు. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ముందు బిజెపి కార్పొరేటర్లు బైఠాయించి నిరసన చేపట్టారు. ప్రభుత్వం పునర్విభజనపై పునరాలోచించి శాస్త్రీయంగా తుది నోటిఫికేషన్ విడుదల చేయాల ని బిజెపి సభ్యులు డిమాండ్ చేశారు. సమావేశంలో డి ప్యూటి మేయర్ శ్రీలత శోభన్ రెడ్డితో పాటు అన్ని పార్టీల సభ్యులు తమ అభ్యంతరాలను, సూచనలు సభ దృష్టికి తీసుకొచ్చారు.

### విలీనం నగర అభివృద్ధిలో కొత్త యుగాన్ని సృష్టిస్తోంది : మేయర్ విజయలక్ష్మి

నగర శివారు మున్సిపాలిటీల విలీనం నగరాభివృద్ధిలో కొత్త యుగాన్ని సృష్టిస్తుందని మేయర్ విజయలక్ష్మి తన ప్రసంగంలో తెలిపారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో ఇది చారిత్రాత్మక రోజు అన్నారు. తెలంగాణ గెజిట్‌లో ఈనెల 9న ప్రచురితమైన నోటిఫికేషన్ ప్రకారం 27 పట్టణ స్థానిక సంస్థలను జిహెచ్ఎంసిలో విలీనం చేయడంతో పాటు, వార్డుల ప్రాథమిక పునరిభజన ప్రక్రియపై చర్చించేందుకు ఈ సమావేశం నిర్వహించామని తెలిపారు. ఈ విస్తరణతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఏకీకృత పాలన సాధ్యమవుతుందని, సమాన అభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులు, ప్రజలకు ఉత్తమ పౌర సేవలు అందించేందుకు ఇది దోహదపడుతుందన్నారు.

### ప్రతి అభ్యంతరాన్ని పరిశీలిస్తాం : కర్ణన్

జిహెచ్ఎంసి 650 నుంచి 2050 చదరపు కిలోమీటర్లకు విస్తరించిందని, ప్రస్తుత జిహెచ్ఎంసి దేశంలోనే అత్యధిక జనాభా ఉన్న కార్పొరేషన్‌గా మారిందని జిహెచ్ఎంసి కమిషనర్ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, జి హెచ్ఎంసి అధికారులు కసరత్తు చేసి వార్డుల విభజన చేశారన్నారు. గతంలో ఔటర్ పరిధిలో గ్రామ పంచాయ తీ, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, జిహెచ్ఎంసి ఇలా నాలుగు రకాల పాలన ఉండేదన్నారు. ఇప్పుడు ఒకటే జిహెచ్ఎంసిగా మారిందన్నారు. 20 ము న్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు జిహెచ్ఎంసిలో కలిపిన తర్వాత జిహెచ్ఎంసి వార్డుల విభజన జరిగిందని వివరించారు. జిహెచ్ఎంసి వార్డుల విభజన ప్రక్రియ డిసెంబర్ చివరికి పూర్తి చేస్తే జనగణనకు ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం చెప్పిందన్నారు. సభ్యులు ఇచ్చే ప్రతీ అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. లిఖిత పూర్వకంగా ఇచ్చే అభ్యంతరాలు ఇవ్వడానికి బుధవారం చివరి రోజు అని తెలిపారు. సహ జ సరిహద్దులు అయిన నాలా, రోడ్లు, రైల్వే లైన్‌లను ప్రతిపాదకగా తీసుకుని వార్డుల విభజన చేశామన్నారు. రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న వార్డులను ఒకే నియోజకవర్గానికి తీసుకొచ్చేలా చేశామన్నారు. తెల్లాపూర్‌లో 23 వేల జనాభా ఉందని, కానీ రానున్న ఐదేళ్లలో 4 లక్షలకు పైగా జనాభా రానుందని చెప్పారు. పెద్ద పెద్ద భవనాలు, అపార్ట్‌మెంట్‌లు వస్తున్నాయని, అందుకే అక్కడ వార్డులను పెంచామని వివరించారు. వార్డుల పే ర్లు మార్పు చేయాలని ఎక్కువగా అభ్యంతరాలు వచ్చాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో హద్దులపై అభ్యంతరాలు వచ్చాయన్నారు. జోన్‌ల విభజన పూర్తి అవ్వలేదని, ప్ర స్తుతం తాత్కాలికంగా సమీప మున్సిపాలిటీలను వివిధ జోన్‌లలో కలిపామన్నారు. చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మే డ్చల్ ఎమ్మెల్యేలను కూడా ఈసారి కౌన్సిల్ సమావేశానికి ఆహ్వానించామని తెలిపారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలు ప్రస్తుతం జిహెచ్ఎంసి పరిధిలోకి వస్తాయన్నారు.

### ముందస్తు సమాచారం ఇవ్వకుండా వార్డుల విభజన : తలసాని

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఏ కార్పొరేటర్‌కీ, ఏ రాజకీయ పార్టీకి ముందస్తు సమాచారం ఇవ్వకుండా వార్డుల విభజన చేశారని ఆరోపించారు. మేయర్, డిప్యూటీ మేయర్‌లకైనా దీనిపై సమాచారం ఉందో లేదో గుండెపై చేయి వేసుకుని చెప్పాలన్నారు. పునర్విభజనపై సభలో ఓటింగ్ నిర్వహించాలని కోరారు. విలీనమైన మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల పరిస్థితి ఏంటో పరిశీలించాలని, ట్యాక్స్ భారం వల్ల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముందన్నారు.

### గడువు పొడిగించాలి : దానం

ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ వార్డుల విభజనపై అభ్యంతరాల స్వీకరణ గడువును పొడిగించే అవకాశాన్ని కమిషనర్ పరిశీలించాలని కోరారు. శాస్త్రీయంగా వార్డుల పునర్విభన జరగాలని, వార్డుల సంఖ్య పెంచడంతో పాటు ఆయా వార్డుల అభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులపై స్పష్టత ఇవ్వాలని సూచించారు. గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్‌లో 300 వార్డులతో జిహెచ్ఎంసి ఏర్పడటం స్వాగతిస్తున్నామన్నారు.

### విలీనాన్ని స్వాగతిస్తున్నాం : బల్మూరి వెంకట్

కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ జిహెచ్ఎంసిలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతానికి ప్రక్రియ ప్రకారమే పునర్విభజన జరుగుతోందని, అయితే స్థానిక ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి నగర అభివృద్ధికి అనుగుణంగా విభజన జరగాలని సూచించారు.

### ఎంఐఎంను దెబ్బతీయడానికే విభజన : ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బలాల

ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బలాల మాట్లాడుతూ 2011 జనగణన డేటాతో పునర్విభజన చేశారంటూ చెబుతున్నారని, కానీ ఆ డేటాను అడిగినా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ ప్రక్రియతో ఎంఐఎం పార్టీకి నష్టం చేకూర్చారని, పార్టీని దెబ్బతీయడానికే విభజన చేశారంటూ విమర్శించారు. తమ సూచనలు కూడా తీసుకుని సక్రమంగా పునర్విభజన చేయాలని కోరారు.

### సిజిజి రాజ్యాంగ బద్ధమైన సంస్థకాదు : దాసోజు

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వార్డుల విభజన జరిగిందన్నారు. రాజ్యాంగబద్ధంగా, సాంకేతికంగా డివిజన్ చేయాలని, జనాభా వ్యత్యాసం 10 శాతాన్ని మించకూడదన్నారు. కానీ ప్రస్తుతం భారీ వ్యత్యాసాలు ఉన్నాయని, ఒక్కో వార్డు ఒక్కో సైజులో ఉందని విమర్శించారు. సిజిజి రాజ్యాంగ బద్ధమైనదికాదన్నారు. వారి అభిప్రాయాల ఆధారంగా విభజన చేయడం సరికాదన్నారు. కమిటీ ఏర్పా టు చేసి ప్రజాస్వామ్యబద్ధంగా పునర్విభజన చేయాలని కోరారు.

### అభివృద్ధి చేశాకే విలీనం చేయాలి : మల్లా రెడ్డి

మాజీ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గాన్ని జిహెచ్ఎంసిలో కలపడం వల్ల అన్యాయం జరిగిందన్నారు. అభివృద్ధి చేసిన తర్వాతే విలీనం చేయాలని, జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ భారం తమ ప్రాంతంపైనే పడుతోందని, ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో 220 మంది కౌన్సిలర్లు ఉన్న ప్రాంతాన్ని ఇప్పుడు కేవలం 16 వార్డులకు కుదించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



## వక్ఫ్ ఆస్తుల నమోదు కోసం మూడు నెలల గడువు పొడిగింపు


మంత్రి మహ్మద్ అజహరుద్దీన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో వక్ఫ్ ఆస్తుల రక్షణ, నిర్వహణను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో వక్ఫ్ ట్రిబ్యునల్, ఉమీద్ పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తుల వివరాలు అప్‌లోడ్ చేసేందుకు మూడు నెలల గడువు పొడిగించినట్లు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ మంగళవారం తెలిపారు. సచివాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 63,180 వక్ఫ్ ఆస్తులను ఉమీద్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉందని మంత్రి తెలిపారు. ఆస్తుల సంఖ్య ఎక్కువగా ఉండటం, వాటి వివరాలను సేకరించడం, పరిశీలించడం, డిజిటలైజ్ చేయడం వంటి ప్రక్రియలకు సమయం అవసరమవడంతో గడువు పొడిగింపు అవసరమైందని ఆయన చెప్పారు.డేటాను అప్‌లోడ్ చేయడం మాత్రమే లక్ష్యం కాదని, ప్రతి వక్ఫ్ ఆస్తి వివరాలు తప్పుల్లేకుండా సక్రమంగా నమోదు కావాలి, అని మంత్రి అన్నారు. గడువు పొడిగింపు ద్వారా అధికారులు, ముతవల్లీలు మరియు ఇతర భాగస్వాములు ఈ ప్రక్రియను పారదర్శకంగా, పద్ధతిగా పూర్తిచేయగలరని ఆయన తెలిపారు. పొడిగించిన గడువును సమర్థవంతంగా వినియోగించి పెండింగ్‌లో ఉన్న అన్ని ఆస్తుల వివరాలను పూర్తిచేయాలని సంబంధిత శాఖలను ఆయన కోరారు. అన్ని సంబంధిత శాఖల సమన్వయంతో పొడిగించిన గడువు లోపల నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేస్తామని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇలాంటి సంస్కరణలు మైనారిటీ సంస్థల ఆస్తులను న్యాయబద్ధంగా, సమర్థవంతంగా నిర్వహించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిఐఎంఆర్ఐఎస్ చైర్మన్ మొహమ్మద్ ఫహీం ఖురేషీ, హజ్ కమిటీ చైర్మన్ హుస్సనీ పాషా, మైనారిటీ సంక్షేమ శాఖ సిఇఒ షఫీ ఉల్లా, కాంగ్రెస్ సీనియర్ నేత మొహమ్మద్ అలీ షబ్బీర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## యూరియా పారదర్శకంగా పంపిణీ చేసేందుకే...
# 'ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్'

వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి స్పష్టీకరణ





**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతులకు యూరియా సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, యూరియా పక్కదారి పట్టకుండా పూర్తిగా పారదర్శకంగా పంపిణీ చేసేందుకే 'ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్'ను ప్రవేశపెడుతున్నామని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి స్పష్టం చేశారు. వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి సహా ఇతర పంటలతో పాటు భూమి వివరాల ఆధారంగా యూరియా సరఫరా జరుగుతుందన్నారు. రైతులు తమ 'ఐడి' నంబర్ ద్వారా యూరియాను పొందవచ్చని, ఈ విషయంలో రైతులను డీలర్లు ఇబ్బందులకు గురి చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని గోపి హెచ్చరించారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. యూరియా కొనుగోలుకు ఈ పాస్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. యాప్‌లో రైతులు తమ ఆధార్, పాస్‌బుక్ నంబర్లను, కౌలు రైతులు, పార్ట్‌బి పరిధిలో ఉన్న రైతులు తమ ఫోన్ నంబర్, ఆదార్ కార్డు నంబర్‌ను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ విధానం ద్వారా రైతులకు ఉపయోగమే తప్ప , నష్టం జరగబోదని వివరించారు. యాప్‌లో తమ భూమి వివరాలు లేని రైతులు వెంటనే ఎఇఒల వద్దకు వెళ్లి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఐసి రూపొందించిన ఈ యాప్‌ను పూర్తిగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తామన్నారు. ఒక ఎకరం ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఒకే విడతలో యూరియాను సరఫరా చేస్తామని, రెండు ఎకరాల నుంచి 20 ఎకరాలపైన ఉన్న వారికి మూడు విడతల్లో యూరియాను సరఫరా చేస్తామన్నారు. మొత్తం యూరియాను ఒక నెల రోజుల వ్యవధిలో, ప్రతి 15 రోజులకు ఒకసారి అందిస్తామన్నారు. రైతులు బుకింగ్ చేసిన ఐడి 24 గంటలు మాత్రమే పనిచేస్తుందని, ఆ గడువు ముగిసన తర్వాత మరోసారి బుకింగ్ చేయాలని సూచించారు. రైతులకు ఏమైనా అనుమానాలు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని, అవసరమైతే మహిళా స్వయం సహాయక సంఘాల సహాయం కూడా తీసుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల ఐ.డిని నమోదు చేస్తుందని,ఇప్పటి వరకు రాష్ట్రంలో 50 శాతం ప్రక్రియ ముగిసిందని వివరించారు. త్వరలోనే 480 బయో రిసర్చ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.


### కేంద్రాల వికేంద్రీకరణ

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 వేల యూరియా పంపిణీ కేంద్రాలు ఉన్నాయని, ఇందులో 30 శాతం కేంద్రాలు ప్రభుత్వ ఆధ్వర్యంలో, మిగిలినవి ప్రైవేట్ డీలర్ల ఆధ్వర్యంలో కొనసాగుతాయని బి.గోపి వివరించారు. అవసరమైతే వాటి సంఖ్యను మరింత పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని, యూరియా పంపిణీని ఒకే చోట కాకుండా వికేంద్రీకరణ చేస్తామని, ఇందుకు అదనపు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ యాప్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా,తమ సమీప డీలర్ల వద్ద యూరియా నిల్వలు ఎంత వరకు ఉన్నాయో తెలుసుకోవచ్చని వివరించారు. యాప్ బుకింగ్ ద్వారానే డీలర్లు యూరియా అమ్మకాలు చేపట్టాలని, వారి వద్ద ఉన్న స్టాక్‌ను డీలర్లు ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో (అక్టోబర్ నుంచి మార్చి వరకు) కేంద్రం నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా,ఇప్పటి వరకు 4.5 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చాయని,ప్రస్తుతం 2.6 లక్షల యూరియాఅందుబాటులో ఉన్నదని గోపి వివరించారు.

## 18న ఒడిశా రాష్ట్రంలో సింగరేణి మెగాపవర్ ప్రాజెక్టులకు ఒప్పందం

2,400 మెగావాట్ల థర్మల్ ప్లాంట్‌లు, 2,500 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌ల ఏర్పాటుకు ఒడిశా రాష్ట్ర ఐపిఐసిఓఎల్‌తో ఒప్పందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒడిశా రాష్ట్రంలో సింగరేణి సంస్థ 4,900 మెగా వాట్ల సామర్థ్యం గల థర్మల్, గ్రీన్ ఎనర్జీ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆ రాష్ట్ర అనుబంధ సంస్థ అయిన ఇండస్ట్రియల్ ప్రమోషన్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఒడిశా లిమిటెడ్‌తో ఈనెల 18న రెండు ప్రాథమిక ఒప్పందాలను కుదుర్చుకోనుందని సింగరేణి సంస్థ చైర్మన్, ఎండి ఎన్.బలరామ్ వెల్లడించారు. సింగరేణి సంస్థ ఒడిశా రాష్ట్రంలో ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాక్‌కు అనుబంధంగా 2,400 మెగావాట్ల (3X800) సామర్థ్యం గల అల్ట్రా సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని దీనికి సంబంధించి ఐపిఐసిఓఎల్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నదని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నైనీ బొగ్గు బ్లాక్ నుండి ఉత్పత్తి అవుతున్న బొగ్గును క్యాప్టివ్ థర్మల్ ప్లాంట్‌కు వినియోగించాలన్న నిబంధన ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని, దీని వల్ల ఒడిశా రాష్ట్రంతో పాటు సింగరేణి సంస్థకి కూడా ఎంతో మేలు జరగనుందని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా సింగరేణి సంస్థ పెద్ద ఎత్తున గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు ప్రణాళికలు వేస్తోందని, దీనిలో భాగంగా ఒడిశా రాష్ట్రంలో 1,000 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ లు, 500 మెగా వాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, 500 మెగా వాట్ల పవన విద్యుత్తు ప్లాంట్‌లు, మరో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, దీనిపై కూడా ఐపిఐసిఓఎల్‌తో ఈనెల 18వ తేదీన ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకోనున్నామని తెలియజేశారు. ఒడిశా రాష్ట్ర ప్రయోజనాలు, విద్యుత్ అవసరాల రీత్యా సింగరేణి సంస్థతో కలిసి తాము నడవడానికి సంసిద్ధంగా ఉన్నట్లు అందుకు ఈ రెండు ఒప్పందాలు దోహదం చేయనున్నాయని ఒడిశా రాష్ట్ర ఇండస్ట్రియల్ ప్రమోషన్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఒడిశా లిమిటెడ్ ప్రతినిధులు తెలియజేశారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బెంగాల్‌లో స్పోర్ట్స్ మినిస్టర్ రాజీనామా

**కోల్‌కతా :** అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ పర్యటన సందర్భంగా గత ఆదివారం పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా లోని సాల్ట్ లేక్ స్టేడియంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఆ ఉద్రిక్తతలకు బాధ్యత వహిస్తూ బెంగాల్ స్పోర్ట్స్ మినిస్టర్ అరూప్ బిశ్వాస్ తన పదవికి రాజానామా చేయగా.. ఆ రాజీనామాకు సిఎం మమత బెనర్జీ ఆమోద ముద్ర వేశారు. సాల్ట్ లేక్ స్టేడియానికి వచ్చిన మెస్సీని చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో ఎగబడ్డారు. అయితే సరైన ఏర్పాట్లు లేకపోవడంతో వారిని లోపలికి పంపడంలో ఆలస్యం జరిగింది. మెస్సీ కార్యక్రమం ముగించుకుని వెళ్లేసరికి ఇంకా సగం మంది స్టేడియం బయటే ఉన్నారు. దాంతో తమ దగ్గర డబ్బులు వసూలు చేసి స్టేడియంలోపలికి ఎందుకు అనుమతించలేదని అభిమానులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈవెంట్ నిర్వాహకుల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. స్టేడియంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటన రాజకీయంగా కూడా తీవ్ర దుమారం రేపింది. మెస్సీ పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయించడంలో బెంగాల్ ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్షాలు మండిపడ్డాయి.

### లోక్‌సభలో విపక్షాల తీవ్ర నిరసనల మధ్య...

## బీమాలో 100 శాతం ఎఫ్‌డిఐ బిల్లు

- ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ :** బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ)ను 100శాతానికి పెంచే బిల్లును లోక్‌సభలో మంగళవారం ప్రతిపక్షాల నుండి తీవ్ర నిరసనల మధ్య ప్రవేశపెట్టారు. పార్లమెంట్ సభ్యులకు పంపిణీ చేయబడిన బిల్లు ప్రకారం 'సబ్ కా బీమాసబ్ కా రక్షా' (బీమా చట్టాల సవరణ) చట్టం ,2025, పార్లమెంట్ సభ్యులకు పంపిణీ చేయబడిన బిల్లు ప్రకారం, బీమా చట్టం, 1938, జీవిత బీమా కార్పొరేషన్ చట్టం, 1956, బీమా నియంత్రణ, అభివృద్ధి అథారిటీ చట్టం, 1999 లను సవరించడానికి ప్రయత్నిస్తుంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడుతూ సామాన్య ప్రజల బీమా ఎల్లప్పుడు ప్రధాన మంత్రి నరేంద్రమోదీనేనని, కొవిడ్ మహమ్మారి సమయంలో కూడా కేంద్ర ప్రభుత్వం సమాజంలోని అట్టడుగు వర్గాలకు బీమాను ఏర్పాటుచేసిందన్నారు. ప్రతిపక్ష సభ్యుల అభ్యంతరాలు చర్చలో భాగం కావచ్చని, ప్రతిపాదిత చట్టంపై చర్చ సందర్భంగా వారి అన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని నిర్మలా సీతారామన్ చెప్పారు. ఆర్‌ఎస్‌పి సభ్యుడు ఎన్.కె.ప్రేమ్‌చంద్రన్ మాట్లాడుతూ బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. బిల్లు నామకరణానికి దానితో సంబంధం లేదని పేర్కొన్నారు. బీమారంగంలో 100శాతం ఎఫ్‌డిఐని అనుమతించాలనే ప్రతిపాదనను కూడా ఆయన వ్యతిరేకించారు. ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) సభ్యులు టి.సుమతి మాట్లాడుతూ ఈ రంగంలో 100శాతం ఎఫ్‌డిఐని ఆమె గట్టిగా వ్యతిరేకించారు. టిఎంసి సభ్యుడు సౌగతా రాయ్ మాట్లాడుతూ ఈ బిల్లు పేరు పాలకుల, సంకీర్ణ ప్రభుత్వ విధానాలను ప్రతిబింబిస్తుందని , అలాంటి పేర్లు పార్లమెంట్‌లో బిల్లు కాకూడదని, 100శాతం ఎఫ్‌డిఐని అనుమతించడం బీమా రంగంలో తిరోగమన చర్య అని ఆయన ఆక్షేపించారు. ముసాయిదా బిల్లు ప్రకారం ఈ సవరణ బీమా రంగంలో పెట్టుబడి పరిమితిన 74శాతం నుంచి 100శాతానికి పెంచుతుంది. ఈ బిల్లు ఈ రంగంలో ఎఫ్‌డిఐని పెంచాలని ప్రతిపాదించినప్పటికీ ఉన్నతాధికారులలో ఒకరు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లేదా సిఇఒ అయ్యి ఉండాలి. ఆయన తప్పనిసరిగా భారతీయ పౌరుడై ఉండాలి. ఇది బీమా కంపెనీతో నాన్‌ఇన్సూరెన్స్ కంపెనీ విలీనం కావడానికి కూడా మార్గం సుగమం చేసింది.ఈ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టడానికి శుక్రవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.ఈ బిల్లు బీమా రంగం వృద్ధిని, అభివృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యాలు, కారణాల ప్రకటన ప్రకారం పాలసీకి మెరుగైన రక్షణను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది. పాలసీదారుల ప్రయోజనాలను కాపాడేందుకు పాలసీదారుల విద్య, రక్షణ నిధిని ఏర్పాటు చేయడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఇది బీమా కంపెనీలు, మధ్యవర్తులు, ఇతర వాటాదారులకు వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరుస్తుంది. ట్రాన్స్‌పరెన్సీ నియంత్రణను తీసుకువస్తుంది. సంస్థలపై నియంత్రణ పర్యవేక్షణను పెంచుతుంది. చైర్‌పర్సన్ పూర్తికాల సభ్యుల పదవీ కాలానికి సంబంధించి, బిల్లు ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని లేదా 65సంవత్సరాల వయస్సు నిండినప్పుడు ఏది ముందు అయితే అది అందిస్తుంది. ప్రస్తుతం పూర్తి సమయం సభ్యునిగా పని చేసేవారికి గరిష్ఠ వయోపరిమితి 62 సంవత్సరాలు, అదే సమయంలో చైర్మన్‌కు 65సంవత్సరాలు విధించబడింది. ఈ ఏడాది బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త తర ం ఆర్థిక రంగం సంస్కరణల బీమా విభాగంలో ప్రస్తుతం ఉన్న ఎఫ్‌డిఐ పరిమితిని 74శాతం నుంచి 100శాతానికి పెంచుతూ ప్రతిపాదించారు. కాగా ఈ నేపథ్యంలో బీమా రంగం ఎఫ్‌డిఐల ద్వారారూ.82,000 కోట్లను ఆకర్షించింది. ఎల్‌ఐసి చట్టంలోని సవరణలు శాఖ విస్తరణ, పునర్ నిర్మాణం వంటి కార్యాచరణ నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని తీసుకునే అధికారాన్ని ప్రతిపాదిస్తాయి.

### ప్రతిపక్షాల అభ్యంతరాల మధ్య లోక్‌సభలో

## 'విబి-జి రామ్ జి'

- ముక్తకంఠంతో వ్యతిరేకించిన విపక్ష సభ్యులు
- బిల్లును లోతుగా పరిశీలించేందుకు పార్లమెంటరీ కమిటీకి పంపాలని పట్టు
- పథకం పేరులో మహాత్మాగాంధీ పేరు తొలగించడంపై తీవ్ర అభ్యంతరం



**న్యూఢిల్లీ :** గత 20 ఏళ్ల నాటి 'ఎంజి నరేగా' చట్టాన్ని రద్దు చేస్తూ దీని స్థానంలో ప్రతి ఏడాది 125 రోజుల పాటు గ్రామీణ ఉపాధికి హామీనిచ్చే కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన బిల్లును మంగళవారం కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అయితే ఈ పథకం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (విబి–జి రామ్ జి) బిల్లు, 2025ను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సభలో ప్రవేశపెట్టారు. ప్రభుత్వం మహాత్మా గాంధీని విశ్వసించడమే కాకుండా, ఆయన సూత్రాలను కూడా పాటిస్తుందని అన్నారు. మోదీ ప్రభుత్వం గత ప్రభుత్వాల కంటే గ్రామీణాభివృద్ధికి ఎక్కువ చేసిందని పేర్కొన్నారు. కాగా, ప్రతిపక్ష సభ్యులు బిల్లు ప్రవేశపెట్టే సమయంలోనే ప్రతిపాదిత చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మరింత లోతుగా పరిశీలన కోసం బిల్లును పార్లమెంటరీ కమిటీకి పంపాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రియాంక గాంధీతో సహా ఎంపిలు, మహాత్మా గాంధీ పేరును తొలగించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బిల్లు ప్రవేశపెట్టే దశలో దానిని వ్యతిరేకిస్తూ డిఎంకెకు చెందిన టిఆర్ బాలు మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామాల్లో నివసించి, అక్కడి పేదల సంక్షేమం కోసం పనిచేశారన్నారు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ గొప్ప బిల్లు (ఎంజి నరేగా)ను తీసుకువచ్చారని, ఇది నిరుపేదలకు 100 రోజుల ఉపాధిని పొందడానికి సహాయపడిందని ఆయన అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జాతిపితను అవమానిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రియాంక గాంధీ వాద్రా ముసాయిదా చట్టంపై తన తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ, ఎంజి నరేగా ఒక విప్లవాత్మక చట్టమని, అది ఆమోదం పొందినప్పుడు సభలోని సభ్యులందరూ దానికి మద్దతు ఇచ్చారని అన్నారు. దీని కింద, నిరుపేదలకు 100 రోజుల ఉపాధి లభిస్తుందని, కొత్త (ప్రస్తుత) బిల్లు పేదల ఉపాధి హక్కులను బలహీనపరుస్తోందని, ఇది రాజ్యాంగానికి విరుద్ధమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంజి నరేగా చట్టం కింద చేపట్టే పనులకు అవసరమైన నిధులలో 90 శాతాన్ని కేంద్రం అందిస్తుందని పాత చట్టంలో పేర్కొన్నారన్నారు. ఇప్పటి కొత్త చట్టంలో 60 శాతానికి తగ్గించారని, ఇది రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక స్థితిని, ముఖ్యంగా జిఎస్‌టి పరిహారం కోసం ఎదురుచూస్తున్న వారిపై ప్రభావం చూపుతుందని ఆమె ఎత్తి చూపారు. ఈ బిల్లులో పేర్కొనబడినట్లు ఈ పథకంపై కేంద్రం నియంత్రణ పెరుగుతుంది, కానీ దాని బాధ్యత తగ్గుతుందన్నారు. కొంతమంది అధికార పార్టీ ఎంపిల వ్యాఖ్యలకు ప్రతిస్పందిస్తూ, మహాత్మాగాంధీ తన కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి కాదని, దేశంలోని ప్రతి కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి అని ఆమె అన్నారు. బిల్లును పార్లమెంటరీ ప్యానెల్‌కు పంపాలని ఆమె ప్రతిపాదించారు. మరో కాంగ్రెస్ సభ్యుడు శశి థరూర్ 'విబి– జి రామ్ జి' బిల్లును వ్యతిరేకిస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 1971లో వచ్చిన బాలీవుడ్ పాట 'దేఖో ఓ దీవానో (తుమ్) యే కామ్ నా కరో, రామ్ కా నామ్ బద్నామ్ నా కరో (రాముడి పేరును కించపరచవద్దు)' అని గుర్తుచేసుకున్నారు. బిల్లు కేవలం పరిపాలనాపరమైన మార్పు కాదని, ఈ కీలకమైన కార్యక్రమ స్ఫూర్తి, తాత్విక పునాదిపై దాడి అని థరూర్ ఉద్ఘాటించారు. మరో వైపు ప్రతిపక్ష సభ్యులు మహాత్మా గాంధీ ఫొటోలు పట్టుకుని సభ వెల్‌లోకి వచ్చి నిరసిస్తూ జాతిపిత పేరును తొలగించడంపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. కొత్త బిల్లు కాపీల ప్రకారం.. నైపుణ్యం లేని మాన్యువల్ పనిని చేపట్టడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ప్రతి గ్రామీణ కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధమైన హామీని అందిస్తుంది.'విబి– జి రామ్ జి' చట్టం ప్రారంభమైన తేదీ నుండి ఆరు నెలల్లోపు, రాష్ట్రాలు కొత్త చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఒక పథకాన్ని రూపొందించాలి.

### వాతావరణ మార్పులతో

## మహిళలపై తీవ్ర పనిభారం

- గ్రామీణ ప్రాంతాల్లో వారి దుర్బలత్వం మరీ ఎక్కువ
- లోక్‌సభలో ప్రభుత్వ లిఖితపూర్వక సమాధానం



**న్యూఢిల్లీ :** వాతావరణ మార్పులు మహిళల పని భారాన్ని పెంచుతున్నాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వారి దుర్బలత్వాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయని ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. సభ్యులు అడిగిన ప్రశ్నకు పర్యావరణ మంత్రిత్వ శాఖ లిఖితపూర్వక సమాధానమిచ్చింది. 2023లో ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థకు సమర్పించిన భారత మూడవ జాతీయ నివేదికలో వాతావరణ తీవ్రతలు, మార్పులు మహిళల పనిభారాన్ని పెంచుతున్నాయని పేర్కొందని తెలిపింది. అస్తవ్యస్తమైన వర్షపాతం పునరావృతమవడం, తీవ్రమైన వాతావరణ ఘటనల సంభావ్యత పెరగడం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల నష్టం జరగవచ్చని అది పేర్కొంది. పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ మాట్లాడుతూ, మహిళలు పంట నష్టాలకు గురవుతున్నారని, ఇవి తరచుగా వారికి ఆహారం, ఆదాయానికి ఏకైక వనరుగా ఉంటాయన్నారు. వరి సాగు, పత్తి, తేయాకు తోటలు, చేపల పెంపకం వంటి సాంప్రదాయకంగా గ్రామీణ మహిళలతో ముడిపడి ఉన్న రంగాలను వాతావరణ వైవిధ్యం సాధారణంగా ప్రభావితం చేస్తుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం గణాంకాల ప్రకార భారతదేశంలోని మొత్తం మహిళా శ్రామికశక్తిలో దాదాపు 65 శాతం మంది వ్యవసాయ రంగంలో నిమగ్నమై ఉన్నారు. ఇది వాతావరణ మార్పులకు అత్యంత సున్నితమైన రంగాలలో ఒకటిగా ఉంది. దేశంలో సాగుదారులలో సుమారు 30 శాతం మంది, వ్యవసాయ కూలీలలో దాదాపు 43 శాతం మంది మహిళలే ఉన్నారని మంత్రి చెప్పారు. వాతావరణ మార్పుల వల్ల మహిళలకు కలిగే ప్రమాదాన్ని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తగ్గించే అనేక పథకాలు, కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపింది. వీటిలో వాతావరణ మార్పులు, మానవ ఆరోగ్యంపై జాతీయ కార్యక్రమం, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, జననీ శిశు సురక్షా కార్యక్రమం, జాతీయ ఆరోగ్య మిషన్ కింద మాతా శిశు ట్రాకింగ్ సిస్టమ్ ఉన్నాయి. ఈ పథకాలు వాతావరణ సంబంధిత ప్రమాదాలకు మహిళల గురికావడాన్ని, సున్నితత్వాన్ని తగ్గిస్తూనే, వారి అనుకూల సామర్థ్యాలను పెంచుతాయని ప్రభుత్వం తెలిపింది.

### మహిళా ఫ్రంట్‌లైన్ కార్మికులకు

## కేంద్ర సహకారం రెట్టింపు చేయండి


- రాజ్యసభలో సోనియాగాంధీ డిమాండ్
- ఐసిడిఎస్ 3 లక్షల ఖాళీ భర్తీ చేయాలని విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ మంగళవారం రాజ్యసభలో మహిళా ఫ్రంట్‌లైన్ వర్కర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందుల అంశాన్ని లేవనెతుత్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వారి వేతనాలకు కేంద్రం సహకారాన్ని రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ దాదాపు 3 లక్షల ఖాళీలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. జీరో అవర్ సందర్భంగా ఈ అంశాన్ని లేవనెత్తుతూ ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు , హెల్పర్లు, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు ప్రజా సేవలకు కీలక సహకారం అందించినప్పటికీ వారిపై అధిక భారం ఉందని, అయినా తక్కువ వేతనాలు ఉన్నాయన్నారు. 'దేశవ్యాప్తంగా, ఆశా వర్కర్లు రోగనిరోధకత, సమీకరణ, తల్లి ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం చేపడతారు. అయినప్పటికీ, వారు తక్కువ గౌరవ వేతనం, పరిమిత సామాజిక భద్రతతో స్వచ్ఛంద సేవకులుగా కొనసాగుతున్నారు' అని ఆమె అన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం నెలకు రూ. 4,500, రూ. 2,250 చొప్పున అతి తక్కువ గౌరవ వేతనం చెల్లిస్తుందని సోనియా చెప్పారు. ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసిడిఎస్)లో వివిధ స్థాయిలలో దాదాపు 3 లక్షల ఖాళీలు ఉన్నాయని, దీని వ్లల లక్షలాది మంది పిల్లలు, తల్లులు అవసరమైన సేవలు పొందకుండా పోతున్నారని ఆమె ఎత్తి చూపారు. '2011 నుండి నవీకరించబడిన జనాభా లెక్కల గణాంకాలు లేకపోవడం వల్ల ఈ పోస్టులు భర్తీ చేయబడినప్పటికీ జనాభా ప్రమాణాలకు లోబడి ఉంటాయి' అని రాజ్యసభ ఎంపి అన్నారు. రాష్ట్రాలతో కలిసి పనిచేయడం ద్వారా అన్ని ఖాళీలను భర్తీ చేయాలని, కార్మికులకు సకాలంలో వేతనం చెల్లించాలని, ఈ ఫ్రంట్‌లైన్ కార్మికుల వేతనానికి కేంద్రం సహకారాన్ని రెట్టింపు చేయాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రభుత్వాన్ని కోరారు. 2,500 కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో అదనంగా ఆశా కార్యకర్తను నియమించాలని, ఇప్పటికే ఉన్న పోషకాహారం, ఆరోగ్య కార్యక్రమాలతో పాటు బాల్య విద్యను ప్రారంభించడానికి అంగన్‌వాడీ కార్యకర్తల సంఖ్యను రెట్టింపు చేయాలని కూడా ఆమె కోరారు. 'ఈ శ్రామిక శక్తిని బలోపేతం చేయడం, విస్తరించడం, మద్దతు ఇవ్వడం భారతదేశ భవిష్యత్తులో పెట్టుబడి అని బల్లుగుద్ది మరీ చెప్పాలనుకుంటున్నానన్నారు.

## సాయుధ బలగాల్లో 438 ఆత్మహత్య ఘటనలు

- సహచరులను కాల్చివేసిన కేసులు ఏడు
- లోక్‌సభకు ప్రభుత్వం వెల్లడి



**న్యూఢిల్లీ :** సాయుధ బలగాల్లో కొంత మంది సిబ్బంది ఆత్మహత్యలకు, ఇతరులతో ఘర్షణలకు దిగి కాల్పులకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో గత మూడు సంవత్సరాలలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సిఎపిఎఫ్), అసోం రైఫిల్స్, జాతీయ భద్రతా దళం (ఎన్ఎస్‌జి) సిబ్బందిలో మొత్తం 438 మంది ఆత్మహత్య చేసుకున్నారు. మరో ఏడు తోటి సిబ్బందిని చంపిన ఘటనలు నమోదయ్యాయని ప్రభుత్వం మంగళవారం పార్లమెంటుకు తెలియజేసింది. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ గణాంకాలను సభకు అందించారు. ఆత్మహత్యల కేసులు 2023లో 157 జరగగా, 2025లో 133కి తగ్గాయి. అయితే 2023లో రెండు, 2024లో ఒకటి, 2025లో నాలుగు తోటి సిబ్బందిని చంపిన ఘటనలు నమోదయ్యాయి. దళాల వారీగా డేటా ప్రకారం, ఈ మూడేళ్ల కాలంలో అత్యధిక ఆత్మహత్యలు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌లో (159) నమోదయ్యాయి. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (120), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (60) ఉన్నాయి. రాజీనామాల విషయానికొస్తే, 2014–2025 మధ్య సిఎపిఎఫ్, అసోం రైఫిల్స్ నుండి మొత్తం 23,360 మంది సిబ్బంది సర్వీస్ నుండి రాజీనామా చేశారని మంత్రి తెలిపారు. ఈ కాలంలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్)లో 7,493 రాజీనామాలు, ఆ తర్వాత సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్)లో 7,456, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)లో 4,137 రాజీనామాలు రికార్డు అయ్యాయి. 2025లో ఇప్పటివరకు 3,077 రాజీనామాలు జరిగాయని, వీటిలో బిఎస్ఎఫ్‌లో అత్యధికంగా 1,157 రాజీనామాలు నమోదయ్యాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సేవా పరిస్థితులపై ప్రశ్నలకు సమాధానమిస్తూ సిఎపిఎఫ్ సిబ్బంది సాధారణంగా ఎనిమిది గంటల షిఫ్టులలో పనిచేస్తారని, అయితే కార్యాచరణ అవసరాలను బట్టి డ్యూటీ గంటలు మారుతాయని, బెటాలియన్ నిర్మాణాలలో విశ్రాంతి, సెలవు, శిక్షణ కోసం నిబంధనలు పొందుపరిచారని మంత్రి అన్నారు. క్షేత్రస్థాయిలో మోహరించిన సిఎపిఎఫ్ సిబ్బందికి ఏటా 60 రోజుల ఆర్జిత సెలవు, 15 రోజుల సాధారణ సెలవుతో సహా 75 రోజుల సెలవును ప్రభుత్వం కల్పించిందని, వారు సాధ్యమైనంత వరకు అనుమతించదగిన సెలవులను పొందేలా చూడటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. సిఎపిఎఫ్, కాంపోజిట్, యూనిట్ ఆసుపత్రులు, ప్రత్యేక మానసిక సేవల ద్వారా సిబ్బందికి మానసిక ఆరోగ్య సహాయాన్ని అందిస్తున్నామని, మానసిక శ్రేయస్సును ప్రోత్సహించడానికి దళాలు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు, ఒత్తిడి నిర్వహణ వర్క్‌షాప్‌లు, యోగా, ధ్యాన సెషన్‌లను నిర్వహిస్తాయని రాయ్ అన్నారు.

### బిబిసిపై 10 బిలియన్ డాలర్లకు

## ట్రంప్ దావా

- ప్రపంచవ్యాప్తంగా పరువు తీశారంటూ ఆక్రోశం

**వాషింగ్టన్:**చేసిన తప్పుకు బిబిసి (బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్) వార్తాసంస్థ క్షమాపణలను తిరస్కరించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆ సంస్థపై 10 బిలియన్ డాలర్ల మేరకు పరువునష్టం దావా వేశారు. ఈ మేరకు 33 పేజీలతో ఫ్లోరిడా కోర్టులో ఈ దావా వేశారు. బిబిసి ఉద్దేశపూర్వకంగానే తన ప్రసంగ పాఠాన్ని ఎడిట్ చేసి ప్రసారం చేసిందని ఆయన విమర్శించారు. తన ప్రతిష్ఠకు అంతర్జాతీయంగా భంగం వాటిల్లిందని, ప్రపంచదేశాలకు తప్పుడు సందేశం వెళ్ళిందని ఆయన ఆ దావాలో పేర్కొన్నారు. బిబిసి ప్రసారంచేసిన, ప్రచురించిన కథనం మోసపూరితంగా, అన్యాయంగా, తప్పుతోవ పట్టించేదిగా, ఉద్రిక్తతలకు ఆజ్యం పోసేదిగా, తన ప్రతిష్ఠకు భంగం కలిగించేదిగా ఉందని ఆయన పేర్కొన్నారు. అసోసియేటెడ్ ప్రెస్ చేసిన వ్యాఖ్యలకు బిబిసి యాజమాన్యం వెంటనే స్పందించలేదని ట్రంప్ ఆరోపించారు. తాను చెప్పిన విషయానికి అంతర్జాతీయస్థాయిలో తప్పుడు అర్థం వెళ్ళిందన్నారు. ఐతే బిబిసి స్పందిస్తూ, తమను తాము రక్షించుకుంటామని ప్రకటించింది. జో బైడెన్ 2020 ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత 2021 జనవరిలో ఆయన విజయాన్ని ధృవీకరించి ఒక అధికారికపత్రం జారీ చేసేందుకు కాంగ్రెస్ సమావేశం క్యాపిటల్ హిల్‌లో జరిగింది. ఈ సమావేశ సమయంలో ట్రంప్ అభిమానులు, అనుచరులు, రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలు వందలమంది ఆ భవనంపై దాడి చేశారు. ఈ దాడికి ముందుగా ట్రంప్ జనవరి ఆరో తేదీన ప్రసంగంలో, కార్యకర్తలు అభిమానులు శాంతియుత పద్ధతులలో నిరసన ప్రదర్శన జరపాలని కోరారు. కానీ బిబిసి వార్తాసంస్థ ఆయన సందేశంలోని ఈ భాగాన్ని మాత్రం తొలగించి మిగతా ప్రకటనను యథాతథంగా ప్రచురించింది. ట్రంప్ దీనిని తీవ్రంగా తప్పుపట్టారు. ట్రంప్ రెండో విడత ఎన్నికల్లో పోటీ చేస్తున్న తరుణంలో బిబిసి మరోసారి పాత విషయాలను గుర్తు చేస్తూ "ట్రంప్‌కు రెండో అవకాశం?" అనే టైటిల్‌తో కరంట్ ఎఫైర్స్ ప్రచురించే ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్ "పనోరమ" ద్వారా ఒక గంటసేపు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రసారం చేసినప్పుడు క్యాపిటల్ హిల్‌పై దాడికి ముందు ఇచ్చిన సందేశంలోని కీలక భాగాన్ని తొలగించింది. ఈ విధమైన ప్రచారం 2024లో జరిగిన ఎన్నికల్లో జోక్యం చేసుకుని, ఎన్నికలను తనకు వ్యతిరేకంగా ప్రభావితం చేసే చర్యగా ట్రంప్ మండిపడ్డారు.

### ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటు బిల్లును

## పార్లమెంటరీ సంయుక్త కమిటీకి నివేదించిన లోక్‌సభ

- ప్రవేశపెట్టిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్
- మూజువాణి ఓటు ద్వారా సభ ఆమోదం

**న్యూఢిల్లీ :** ఉన్నత విద్యాసంస్థలను నియంత్రించడానికి 13మంది సభ్యుల సంస్థను ఏర్పాటు చేసే బిల్లును ఒక పార్లమెంట్ సంయుక్త కమిటీకి నివేదించాలని లోక్‌సభ మంగళవారం తీర్మానించింది. ఈ ప్రతిపాదనను కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సభలో ప్రవేశపెట్టారు. దానిని సభలో మూజువాణి ఓటు ద్వారా ఆమోదించారు. సోమవారం నాడు ఈ బిల్లును సభలో ప్రవేశపెడుతూ, ప్రభుత్వం వీక్షిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్ బిల్లును ఉభయ సభలకు పంపాలని కోరుతోంది. మంగళవారం నాటి తీర్మానం ప్రకారం లోక్‌సభలో 21మంది సభ్యులు, రాజ్యసభలో 10మంది సభ్యులతో కూడిన జాయింట్ కమిటీ 2026 బడ్జెట్ సమావేశాల చివరి రోజునాటికి తన నివేదికను సమర్పించనుంది. బడ్జెట్ సమావేశాలు సాధారణంగా జనవరి 31న ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించనున్నారు. దీని మొదటి భాగం ఫిబ్రవరి 10న నెల రోజుల విరామం కోసం ముగుస్తుంది. బిల్లు ప్రకారం...సమన్వయం లేని నియంత్రణ ఆమోద ప్రోటోకాల్స్‌ను కలిగి ఉన్న అనేక నియంత్రణ సంస్థల కారణంగా ఉన్నత విద్యాసంస్థలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లు ప్రస్తుతం తొలగిపోతాయి. భారత రాష్ట్రపతి నియమించిన ఒక చైర్‌పర్సన్ నేతృత్వంలోని విద్యా కమిషన్ దాని పరిధిలోని అన్ని కేంద్ర విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, విద్యా మంత్రిత్వ శాఖ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో పనిచేసే జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థలైన ఐఐటిలు, ఎన్ఐటిలు, ఐఐఎస్‌సి, ఐఐఎస్ఇఆర్'లు ఐఐఎంఎస్, ఐఐఐటీ'స్ తదితర సంస్థలను కవర్ చేస్తుంది.

## అదుపులో డిజిటల్ మోసాల ముఠా



**న్యూఢిల్లీ:** సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్టుపై ఎంత అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రజలు సైబర్ మోసాల బారిన పడుతూనే ఉన్నారు. ఉన్న విద్యావంతులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సైతం వీరిన బారిన పడి కోట్లాది రూపాయలు పోగొట్టుకుంటున్నారు. తాజాగా ఉన్నతాధికారుల వలె నటించి బాధితులను రూ.50 కోట్లకు పైగా మోసం చేసిన అంతర్జాతీయ డిజిటల్ మోసాల ముఠాను అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సహా 10 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, ఒడిశా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, హర్యానా ఆగ్నేయ ఢిల్లీలో ప్రారంభమైన దర్యాప్తులో భాగంగా ఏడు రాష్ట్రాలలో దాడుల్లో ఈ అరెస్టులు జరిగాయని వారు తెలిపారు. నిందితులలో ఒకరు దుబాయ్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ముంబయి విమానాశ్రయంలో అరెస్టు చేసినట్లు ఒక అధికారి తెలిపారు. ఈ ముఠా డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ను నిర్వహించిందని, పోలీసు అధికారుల వలె నటించి వీడియో కాల్స్ ద్వారా బాధితులను బెదిరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. కర్ణాటక పోలీసులమని నటిస్తూ మోసగాళ్ల నుండి బెదిరింపు వీడియో కాల్స్ అందుకున్న తర్వాత రూ.99,888 మోసపోయామని షహీన్ బాగ్ నివాసి డిసెంబర్ 7న దాఖలు చేసిన ఫిర్యాదుతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. దీంపై దర్యాప్తు ప్రారంభించారు. అరెస్టయిన నిందితులు మ్యూల్ బ్యాంక్ ఖాతాలు, అక్రమ సిమ్ యాక్టివేషన్, బహుళ పరికరాలను ఉపయోగించి సోషల్ మీడియా ప్రామాణీకరణతో కూడిన అంతర్రాష్ట్ర, క్రాస్‌బోర్డర్ నెట్‌వర్క్‌లో భాగమని దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. 'జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో నిందితులపై నమోదైన కనీసం 66 ఫిర్యాదులకు రూ. 50 కోట్లకు పైగా సంబంధం ఉందని ఆర్థిక విశ్లేషణ, సాంకేతిక నిఘా చూపించింది' అని అధికారి తెలిపారు. సిండికేట్‌లోని ఇద్దరు సభ్యులు ఇప్పటికీ పరారీలో ఉన్నారు. అరెస్టయిన నిందితులు మ్యూల్ ఖాతాల సేకరణ, డెబిట్ కార్డులను నిర్వహించడం, అక్రమ సిమ్ యాక్టివేషన్, నేరం ద్వారా వచ్చిన ఆదాయాన్ని దారి మళ్లించడం వంటి విభిన్న పాత్రలు పోషించారని పోలీసులు తెలిపారు.

### గోవా నైట్‌క్లబ్ ఫైర్ యాక్సిడెంట్ కేసు

## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో లూథ్రా బ్రదర్స్ అరెస్ట్

**న్యూఢిల్లీ :** గోవా నైట్‌క్లబ్ అగ్నిప్రమాదం కేసులో నిందితులుగా ఉన్న లూథ్రా బ్రదర్స్‌ను గోవా పోలీసులు అరెస్ట్ చేశారు. థాయ్‌లాండ్ నుంచి ఢిల్లీకి చేరుకున్న వారిని ఎయిర్‌పోర్టులోనే పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 6న నైట్‌క్లబ్‌లో ప్రమాదం జరగగానే ఆ క్లబ్ సహ యజమానులైన గౌరవ్, సౌరభ్ లూథ్రా థాయ్‌లాండ్‌కు పారిపోయారు. ఇంటర్‌పోల్ బ్లూ కార్నర్ నోటీస్ ఇష్యూ చేయడంతో థాయ్‌లాండ్ పోలీసులు ఈ నెల 11న పుకెట్‌లో ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం భారత అధికారుల అభ్యర్థన మేరకు మంగళవారం ఉదయం వారిని భారత్‌కు పంపించారు. ఇండిగో విమానంలో వచ్చిన ఇద్దరు నిందితులు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో దిగగానే గోవా పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. శిక్షార్హమైన మారణహోమం, నిర్లక్ష్యం ఆరోపణలతో మరికాసేపట్లో పోలీసులు ఆ ఇద్దరినీ ఢిల్లీ కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. ఆ తర్వాత ట్రాన్సిట్ రిమాండ్‌కు సంబంధించిన ప్రక్రియను పూర్తిచేసి విచారణ నిమిత్తం గోవాకు తీసుకెళ్లనున్నారు. బుధవారం గోవాలోని కోర్టులో వారిని హాజరుపరిచే అవకాశం ఉంది. కాగా ఈ నెల 6న గోవాలోని అర్పోరా ఏరియాలోగల 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్‌లో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు.



ప్రజాపక్షం
బుధవారం, 17 డిసెంబరు

# అధికారాలు కేంద్రీకృతం

నరేంద్ర మోదీ ప్రభుత్వం సంస్కరణల వేగవంతం నిమిత్తం అధికారాల కేంద్రీకృతం దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. మంగళవారంనాడు అది "మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం" రద్దు చేస్తూ ప్రవేశపెట్టిన "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్(గ్రామీణ)" (విబి–జి రామ్ జి) బిల్లు గ్రామీణ ఉపాధి కల్పనలో సర్వాధికారాలను కేంద్రం చేతిలోకి తీసుకుంటూ రాష్ట్రాల స్వేచ్ఛను హరిస్తున్నది. ఉన్నత విద్య రెగ్యులేటరీ వ్యవస్థను పూర్తిగా పునర్నిర్వచించే "వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (విబిఎస్‌ఎ)" బిల్లును సోమవారం ప్రవేశపెట్టింది. అది యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ), నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఇ) వర్తిస్తే నాలుగింటి స్థానంలో ఒకే రెగ్యులేటర్ కిందకు తెస్తూ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటును తలపెట్టింది. అన్ని కేంద్ర యూనివర్సిటీలు, వాటికిందగల కాలేజీలు, విద్యా మంత్రిత్వశాఖ పరిపాలనా పరిధి కిందగల జాతీయ ప్రాముఖ్యత గల సంస్థలన్నీ ఈ కమిషన్ కిందకు వస్తాయి. ప్రస్తుతం యుజిసి కిందలేని ఐఐటిలు, ఐఐఎంలు, ఎన్ఐటిలు, ఐఐఎస్‌సిలు, ఐఐఎస్ఇఆర్‌లు, ట్రిపుల్ ఐటిలు కూడా ఈ కమిషన్ కిందకు వస్తాయి. మూడు, అణు విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి విదేశీ, స్వదేశీ ప్రైవేటురంగం ప్రవేశానికి ప్రోత్సాహం కలుగజేసేందుకు ఉద్దేశించిన "సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (ఎస్‌హెచ్‌ఎఎన్‌టిఐ–శాంతి) బిల్లు, 2025ను కూడా సోమవారమే ప్రభుత్వ లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అణుశక్తి ప్రభుత్వరంగంలోనే ఉండాలని ఆదేశించిన "అటామిక్ ఎనర్జీ యాక్ట్, 1962ను, "సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డామేజ్ (సిఎల్ఎన్‌డి) చట్టం, 2010ను రద్దు చేసి వాటి స్థానంలో ఈ కొత్త బిల్లు తెస్తారు.

యుపిఎ ప్రభుత్వం జాడను, మహాత్మాగాంధీ పేరును చెరిపివేసేందుకే మోదీ ప్రభుత్వం 2005లో ఆ ప్రభుత్వం తెచ్చిన చరిత్రాత్మక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (2009లో దానికి ముందు మహాత్మాగాంధీ పేరు చేర్చారు) రద్దు చేసింది. దానిపేరును "పూజ్య బాపు ఉపాధి హామీ చట్టం"గా మార్చుతారని ముందురోజు వచ్చిన వార్తలు తప్పు అని తేలింది. రామనామ స్మరణ చేయించే విధంగా 'విబి–జి రామ్ జి' పేరు పెట్టారు. అంతా పేరులోనే ఉందని స్పష్టం చేశారు. అంతవరకు అయితే సరిపెట్టుకోవచ్చు – కానీ ఆ పథకాన్ని పూర్తిగా కేంద్రం అధీనంలోకి తీసుకున్నారు. 100రోజుల పనిదినాలను 125 రోజులకు పెంచి ఉద్దరిస్తున్నట్లు చెప్పుకోవచ్చు గాని ఏ రాష్ట్రంలో ఎక్కడ ఏ పనులు చేపట్టాలో కూడా కేంద్రమే నిర్ణయిస్తుంది. ఒక్కొక్క రాష్ట్రానికి బడ్జెట్ కేంద్రం కేటాయిస్తుంది. ఆ పరిధిలో పనులు చేయాలి. నరేగా చట్టం పేదలకు ఉపాధి హక్కు కల్పించింది. శారీరక శ్రమ చేయటానికి ముందుకు వచ్చిన పేదవాడికి పని చూపాలి. ఇకపై అవసరాన్ని బట్టి పని కల్పన ఉండదు. కొన్ని రకాల పనులకే దాన్ని పరిమితం చేసింది. నరేగా కింద శ్రామికుల వేతనాలు పూర్తిగా, సామగ్రి వ్యయంలో 75 శాతం నిపుణ, పాక్షిక నిపుణ కార్మికుల వేతనాల్లో 75శాతం, కేంద్రం చెల్లిస్తున్నది. ఇకపై (మొత్తం వ్యయంలో) రాష్ట్రప్రభుత్వం 40శాతం భరించాలి. 90:10గా ఉన్న వ్యయం 60:40గా ఉంటుంది. అభివృద్ధి, సంక్షేమ పనులకు నిధులకు అలమటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని భరించగలవా? ఒక్క సుగుణం ఏమంటే వ్యవసాయ తరుణాల్లో కూలీల కొరత తీర్చేందుకై ఆ మాసాల్లో ఉపాధి పనులు పూర్తిగా నిలుపు చేస్తారు. ఉపాధి హామీ పథకాన్ని యుపిఎ ప్రభుత్వ వైఫల్యానికి పెద్ద నిదర్శనంగా నిందించిన మోదీ గ్రామీణ కష్టజీవుల ఉపాధి హక్కును హరిస్తున్నారు.

విద్యను, ముఖ్యంగా ఉన్నత విద్యను తమ గుప్పెట్లో ఉంచుకోవటం ఆర్ఎస్ఎస్–బిజెపి లకు మహా ప్రీతి. తమ హిందుత్వ భావజాలంతో చరిత్రను వక్రీకరించేందుకు అది సాధనం. ఎన్‌సిఇఆర్‌టి ఇప్పటికే అనేక పాఠ్యపుస్తకాలను హిందుత్వ కోణంలో తిరగరాసింది. ఉన్నత విద్య రెగ్యులేటర్‌గా యుజిసిఉన్నప్పుడు స్వయం ప్రతిపత్తి ఉన్నత విద్యాసంస్థల్లో ప్రభుత్వ జోక్యానికి అడ్డుగా ఉండేది. అందువలన ఒకే ఉన్నత విద్యాకమిషన్ దాని కింద మూడు ఉపకమిషన్లను తలపెట్టారు. హిందుత్వ వాదుల్ని నిరాటంకంగా రెగ్యులేటర్లుగా నియమించవచ్చు. ఇది ఉన్నత విద్యాసంస్థల ఎదుగుదలకు అవశ్యకమైన స్వయంప్రతిపత్తిని, స్వేచ్ఛను హరిస్తుంది.

అణువిద్యుత్ సంస్థాపిత సామర్థ్యాన్ని ప్రస్తుత 8.8 గిగావాట్ల నుంచి 2047 నాటికి 100 గిగావాట్లకుపైగా పెంపుచేయటం లక్ష్యం. దీన్ని ప్రైవేటురంగానికి తెరుస్తున్నారు. ఆ ప్రయోజనంతోనే 2008లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం అమెరికాతో సివిల్ అణుశక్తి ఒప్పందం కుదుర్చుకుంది. అయితే దురదృష్టవశాత్తు రియాక్టర్లలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే జరిగే మానవ ప్రాణ, పర్యావరణ నష్టానికి ఆ రియాక్టర్ల సరఫరాదారు పరిహారం చెల్లించాలని సివిల్ లయబిలిటీ బిల్లు తేగా అమెరికా తదితర అణువిద్యుత్ దేశాల కంపెనీలు దాన్ని వ్యతిరేకించినందున అది ఆచరణకు నోచుకోలేదు. మోదీ ప్రభుత్వం తెచ్చిన "శాంతి" బిల్లు పరిహారం విషయంలో సడలింపులిచ్చి దాన్ని అమలు లోకి తేనుంది. నియంత్రణలన్నీ ప్రభుత్వం చేతిలోనే ఉంటాయని చెబుతున్నప్పటికీ ఆ బహుళ జాతి కంపెనీలు ఎంత శక్తిమంతమైనవో భోపాల్ యూనియన్ కార్బైడ్ గ్యాస్ లీక్ ప్రమాదం పాఠం చెప్తుంది. గుణపాఠం నేర్చుకోకపోతే ప్రమాదం.

# నాస్తికత్వం – మేధావుల లక్షణమంటున్న పరిశోధనలు



డాక్టర్ దేవరాజు మహారాజు

నిజానికీ అబద్ధానికీ తేడా తెలుసుకోలేని వారు, సరైనదేదో సరికానిదేదో తెలుసుకోలేరు. వాళ్ళు స్వతహాగా ఆలోచించే శక్తిని కోల్పోయారన్నమాట! దేశంలో ప్రజల్ని ఆవిధంగా తయారు చేసి, తమ ఇష్టానుసారంగా పరిపాలన కొనసాగించవచ్చని ప్రస్తుత ఆరెస్సెస్ – బిజెపి ప్రభుత్వం అనుకొంటోంది. పరిశీలనకు, విశ్లేషణకు అతికొద్దిమంది మాత్రమే పూనుకుంటారు. జనబాహుళ్యం వాడుకలో ఉన్న అబద్ధాలను నమ్మి దేవుళ్ళ చుట్టూ తిరుగుతున్నారు. ఒక విషయం గమనించండి. దేవుళ్ళ చిత్ర పటాలు, ప్రతిమలు, శిల్పాలు దుకాణంలో ఉన్నంత వరకు వాటికి శక్తులేవీ ఉండవు. కానీ, వాటిని దేవాలయాల్లో, ఇండ్లలో ప్రతిష్ఠించుకోగానే వాటికి ఏవో శక్తులు ఉన్నట్లు భావిస్తుంటారు. దేవతా విగ్రహాల, చిత్రపటాల శక్తులు ఎప్పుడైనా, ఎక్కడైనా నిరూపించబడ్డాయా?

"మనుషుల్ని చంపి, మతాన్ని రక్షించడం కంటే – మతాన్ని చంపి మనుషుల్ని రక్షించడమే మేలు" అని అన్నాడు బుద్ధుడు. ఆ మాటను ఇప్పటి జనం గుర్తుంచుకోవడంలేదు. "హంనె ఘర్ కి సలామతీ కెలియే ఖుదా కొ ఘర్ సె నికాల్ రఖాహై" – అన్నాడొక ఆధునిక ఉరుదూ కవి. (ఇంటి క్షేమం కోసం మేం, దేవుణ్ణి ఇంట్లోంచి బయటికి పంపించాం! – అని అర్థం)

ఎవరో ఒక శిల్పి చెక్కిన శిల్పానికి శక్తి ఉంటుందా? ఎవరో ఒక చిత్రకారుడు గీసిన చిత్రానికి శక్తి ఉంటుందా? అని ప్రజలు ప్రశ్నించకుండా ఇవి ఇప్పటివి కావు, అనాది కాలంవి లేక అతి ప్రాచీనమైనవి, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ – అని మూఢ విశ్వాసం సడలిపోకుండా చేస్తుంటారు. రాగల తరాల వారు కూడా ఆ విశ్వాసాన్ని కొనసాగిస్తూ ఉండాలని, అదే మన సనాతన సంప్రదాయం, ఆచారం – అని చెపుతూ ఉంటారు. పైగా పాటించపోతే కీడు కలుగుతుందని భయపెడతారు. అధిక సంఖ్యాకులు ఈ విషయం లోతుగా ఆలోచించరు. 'ఏదో పెద్దలు చెప్పింది పాటిస్తే సరిపోతుంది కదా' – అని అనుకుంటారు. 'ఎందుకు మన మెదడు పాడుచేసుకోవడం'? – అని అనుకుంటారు. కానీ, అలా అనుకోవడం వల్లే వారు తమ మెదళ్ళు పాడు చేసుకుంటున్నారన్న సత్యాన్ని గ్రహించలేకపోతున్నారు. ఎవడి మెదడు వాడు ఉపయోగించుకోకుండా, మరొకరి మెదడు చెప్పినట్టు చేయడం తెలివిగల పనా? ఆ మరొకడి మెదడు బూజుపట్టి ఉంటే – అదే బూజును నువ్వు కొనసాగిస్తున్నట్లే కదా?

అందుకే చూడండి! పూజలు, ఆచారాలు, సంప్రదాయాలు, ప్రార్థనా స్థలాల సందర్శనాలు–అన్నీ'ఫార్మాలిటీ'గా మారిపోయ్యాయి. ఎవరికీ దేని మీదా భక్తీ శ్రద్ధా ఉండడం లేదు. అవి ఉన్నట్టు ప్రదర్శించుకునే వారు కొందరుంటారు. వారైనా ఎందుకుంటారంటే వారి జీవితం ఆ పూజల మీద ఆధారపడి ఉంటుంది – గనక! షాపింగ్ మాల్ వెళ్ళామా? కావల్సింది కొనుక్కున్నామా? తిరిగి వచ్చామా? అన్నట్లు ఈ రోజుల్లో జనం గుడికి వెళ్ళామా? గంటకొట్టామా? దక్షిణ సమర్పించుకున్నామా? శఠగోపం పెట్టించుకున్నామా? తీర్థ ప్రసాదాలు తీసుకున్నామా? వెనక్కి తిరిగొచ్చామా? – అన్నట్లు ఉంటున్నారు. తప్పిస్తే, అలా ఎందుకు చేస్తున్నామని మనసు పెట్టి ఆలోచించడం లేదు. తాతల నుండి వస్తున్న ఆచారం కదా అని సర్దిచెప్పుకుంటూ ఉంటారు. తాతల నాటి జీవనవిధానానికీ, మారిన పరిస్థితుల్లో ఇప్పటి జీవన విధానానికి అసలు పోలికే లేదన్నది మాత్రం ఆలోచించరు. దీన్నే గొర్రెదాటు పోకడ–అంటారు.

ఈ విశ్వానికి ఏ సృష్టికర్తా లేదు. అది 13.77 బిలియన్ (పదమూడు వందల డెబ్బయి ఏడు కోట్ల) సంవత్సరాల క్రితం ఒక మహా విస్ఫోటనం (BIG BANG)తో దానికి అదే, ఆవిర్భవించింది! ఈ విశ్వ ఆవిర్భావ సిద్ధాంతాన్ని ప్రపంచ శాస్త్రవేత్తలంతా రుజువులతో బలపరిచారు. ఈ వాస్తవాన్ని విశ్వసించకుండా కల్పించుకున్న అతీత శక్తులకు దాసోహమనడం అవసరమా? నిజాన్ని అర్థం చేసుకుని, దాన్ని స్వీకరించే స్థాయి మనుషులకు ఎప్పుడొస్తుంది? భౌతికంగా పుట్టి, భౌతికంగా జీవించి, భౌతికంగానే తనవు చాలించే మనిషికి కల్పించుకున్న మతాలు, కృత్రిమంగా ఏర్పరుచుకున్న కులాలు ఇంకా అవసరమా? వాటికి అతీతంగా ఎదిగి సత్యాన్ని గుర్తించి మనుగడ సాగించనవసరం లేదా?

మేధస్సుకు–నాస్తికత్వానికీ మధ్య గల సంబంధం మీద కొందరు పరిశోధకులు దృష్టి సారించారు. విలువైన ఫలితాల్ని వెల్లడించారు. మేధావుల్లో ఎక్కువమంది నాస్తికులు కావడానికి అవకాశాలున్నాయని యునైటెడ్ కింగ్‌డమ్‌లో జరిగిన పరిశోధనలు చెపుతున్నాయి. మేధావుల్లో ప్రశ్నించే మనస్తత్వం ఉండడం వల్ల నాస్తికత్త–వ్యక్తిత్వం ఏర్పడుతుందని అంటున్నారు. బ్రిటన్‌లోని అల్‌స్టర్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రిచర్డ్ లిన్ (UNIVERSITY OF ULSTER:RICHARD LYNN(1930 –2023) U.K) అతని పరిశోధకుల బృందం ఈ అంశంపై పరిశోధనలు చేసింది. ఫలితాలను వారు 'ఇంటిలిజెన్స్' అనే ఇంటర్నేషనల్ రీసెర్చ్ జర్నల్‌లో ప్రచురించారు. మనిషి మెదడుకూ నాస్తికత్వానికీ గల సున్నితమైన బంధాన్ని పరిశోధకులు ఒడిసి పట్టుకున్నారు. ఈ పరిశోధకులు చెప్పింది ఏమిటంటే– మామూలు మనుషులతో పోలిస్తే మేధావుల్లో, ఆలోచనాపరుల్లో, పరిశోధకుల్లో 'ఐక్యూ' ఎక్కువగా ఉంటుంది. ఐక్యూ–ఎక్కువగా ఉన్న వారు ప్రశ్నలు ఎక్కువగా సంధిస్తారు.

> ఈ విశ్వానికి ఏ సృష్టికర్తా లేదు. అది 13.77 బిలియన్ (పదమూడు వందల డెబ్బయి ఏడు కోట్ల) సంవత్సరాల క్రితం ఒక మహా విస్ఫోటనం (BIG BANG)తో దానికి అదే, ఆవిర్భవించింది! ఈ విశ్వ ఆవిర్భావ సిద్ధాంతాన్ని ప్రపంచ శాస్త్రవేత్తలంతా రుజువులతో బలపరిచారు. ఈ వాస్తవాన్ని విశ్వసించకుండా కల్పించుకున్న అతీత శక్తులకు దాసోహమనడం అవసరమా?

ప్రశ్నించగల వారు విశ్వాసాలకు దూరంగా ఉంటారు. పైగా, అంధ విశ్వాసాల్ని తీవ్రంగా నిరసిస్తారు. రాయల్ సొసయిటీ నిర్వహించిన సర్వే ఫలితాలను ఆధారం చేసుకుని, ప్రొఫెసర్ రిచర్డ్ లిన్ పరిశోధకుల బృందం ఈ విశ్లేషణలు చేశారు. ప్రొఫెసర్ లిన్ తనకు తాను సైంటిఫిక్ రేసిస్ట్ (SCIENTIFIC RACIST) గా ప్రకటించుకున్నాడు. ఈ సర్వేలో 68.5 శాతం మంది ప్రజలు తాము ఆస్తికులమని చెప్పుకున్నారు. కానీ, అందులో దేవుణ్ణి గట్టిగా నమ్ముతున్న వారు కేవలం 3.3 శాతమే! ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న బాలబాలికలందరూ ఆస్థికులే. కానీ, వారు యవ్వన దశలోకి వచ్చాక – అంటే తెలివితేటలు కాస్త పెరిగాక దైవ భావనపై సందేహం వెలిబుచ్చుతూ ఉంటారు. ప్రగతి పథాన నడుస్తున్న 137 ప్రపంచ దేశాల్లో మత విశ్వాసం సన్నగిల్లుతున్నట్టు – వారు వారి అధ్యయనంలో తేల్చారు. ఆ దేశాలలోని సగటు మనుషుల్లో మేథోస్థాయి పెరగడమే ఇందుకు కారణమని, ప్రొఫెసర్ రిచర్డ్ లిన్ ప్రకటించాడు. ఈయన మరొక విషయం కూడా స్పష్టం చేశాడు – "సంస్కృతి, సంప్రదాయమనే – అంధ విశ్వాసాల్లో మునిగిపోయి, బయటి ప్రపంచాన్ని చూడలేక, నూతిలో కప్పల్లా జీవించే వారు కొందరుంటారనీ, వారిలో ప్రశ్నలుండవని కాదు గానీ, వారు వాటిని లోపలే అణచిపెట్టుకుని, తమను తాము మోసం చేసుకుంటూ – ప్రశాంతంగా బతుకుతున్నామని ఆత్మద్రోహం చేసుకుంటూ ఉంటారనీ..." అంటాడు.

అయితే ప్రొఫెసర్ లిన్ బృందం చేసిన పరిశోధనలను గోర్డాన్ లించ్ అనే మరో ప్రొఫెసర్ విమర్శించాడు. ఈయన లండన్ బర్క్‌బెన్ కళాశాలకు చెందినవాడు. ఆయన చెప్పేది ఏమంటే – ఇలాంటి పరిశోధనలకు సామాజిక, ఆర్థిక, చారిత్రక ప్రభావాల నెన్నింటినో పరిగణించాల్సి ఉంటుందనీ– ఆ పని ఈ ప్రొ.లిన్ పరిశోధక బృందం సరిగా చేయలేదని ఆరోపించాడు. ఈయన అంటున్నది కూడా ఆలోచించాల్సిన విషయమే. ఆ దిశలో కూడా పరిశోధనలు జరగాల్సి ఉంది. ఏది ఏమైనా, ఎవరి నేపథ్యం ఎలాంటిదైనా... దైవ విశ్వాసానికీ, ప్రశ్నించే తత్వానికీ సంబంధం ఉందన్న ప్రొ.రిచర్డ్ లిన్ బృందం పరిశోధనల్ని కొట్టి పారెయ్యలేం – ఎందుకంటే, వారు సాధించిన ఫలితాల్లో నిజం ఉంది. వారు చెప్పిన విషయాలు మనం మన నిత్య జీవితంలో – మన చుట్టూ ఉన్నవారిలో కూడా చూస్తున్నాం. బాల్యం, యవ్వనం, మధ్య వయసు, వృద్ధాప్యం – దశలలో అభిప్రాయాలు – ఆలోచనా విధానం మారుతూ ఉండడం మనం చూస్తూనే ఉన్నాం. ఆలోచన పెరిగి, వివేక వంతులవుతున్న కొద్దీ ప్రతి విషయాన్ని ప్రశ్నించి నిగ్గు తేల్చుకునే లక్షణం – పెరుగుతూ వస్తున్న విషయం, మన పరిశీలనల్లో మనకు కనిపిస్తున్నదే!

ఇంతదాకా సాధించిన విజయాలన్నీ మనిషి తన స్వశక్తితో సాధించుకున్నవేనన్నది ఎప్పటికప్పుడు గుర్తుచేసుకుంటూ ఉండాలి. అంధ విశ్వాసాల్ని అంతం చేసుకుంటూ, మనిషి తనను తాను స్థిరపరుచుకునే అవసరం ఇప్పుడు అత్యవసరంగా ఉంది. మనిషే మనిషి విలువను ఎప్పుడూ దిగజార్చుకోగూడదు. ఉబికి వస్తున్న ప్రశ్నల గొంతుల్ని తొక్కిపెట్టగూడదు. సమాజంలో జీవితాలు దుర్భరమైపోతుంటే, జనం గొంతెత్తలేని నిస్సహాయతలో మిగిలిపోగూడదు. శక్తిని కూడగట్టుకుని – మనిషి ఎప్పుడూ దేనికీ బలహీనుడు కాదు – అని నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. తప్పకుండా ఉంది.

మానవ జీవతాలన్నీ నదులైతే, మానవ వాదం – ఒక మహా సముద్రం!

సముద్రంలో ప్రవేశించడానికి ముందు నది భయంతో వణికిపోతుంది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటుంది. తను దాటి వచ్చిన పర్వతాలూ, మైదానాలు, అడవులూ, గ్రామాలు కనిపిస్తాయి. ముందుకు చూస్తే అనంతమైన సముద్రం కళ్ళముందుంటుంది. ఇంకొంచెం ముందుకు పోతే, ఇక ఇంతే – సముద్రంలో భాగమై పోవడమే. తప్పదు – వెనక్కి వెళ్ళే అవకాశం కూడా ఉండదు. నదులు తమను తాము త్యాగం చేసుకోవాల్సిందే ! కుల, మతాల, ప్రాంతీయ, జాతుల అస్థిత్వాన్ని కోల్పోవాల్సిందే! ఒక్కసారి మానవత్వపు సముద్రంలో కలిసిపోగానే భయం ఎగిరిపోతుంది. సంకోచాలన్నీ ఇగిరిపోతాయి. ఆచార వ్యవహారాలన్నీ కరిగిపోతాయ్! సమానత్వం ఒక వైజ్ఞానిక భావన! ఏ నది ఏ దిశ నుండి వచ్చి కలుస్తే మాత్రం ఏమిటి? హ్యూమన్ డిఎన్ఎ – అంతా ఒక్కటైనపుడూ? కంటికి కనిపించని డిఎన్ఎ – ఒక మహా సముద్రం. మానవ జాతి నదులన్నీ మానవత్వపు సంద్రంలో కలవక తప్పదు – సముద్రమంటే సత్యం ! సముద్రమంటే జ్ఞానం!!

మానవ జీవితాలన్నీ నదులైతే, మానవ వాదం ఒక మహాసముద్రం – ఇలా సింబాలిక్‌గా కాకుండా, నేరుగా సూటిగా చెప్పాడు ఉరుదూ కవి
జఫర్ ఆజాద్ "జబ్‌తక్ కరేగా యాద్ ఉస్ నా ఖుదాకొ
ఆఖిర్ కబ్‌తక్ దేఖేగా ఏ తస్‌వీరే
ఇంతెజార్‌మె ఏ జిందగీ బర్‌బాద్ మత్‌కర్
తోడ్‌దే సభీ ఉస్కే ఇష్క్‌కి జంజీరే–"

(ఇంకా ఎంతకాలం దైవ విశ్వాసపు జ్ఞాపకాల్లో బతుకు నాశనం చేసుకుంటావూ, అతనితో ఉన్న అన్ని బంధనాల్నీ తెంపేసుకో)

**(సుప్రసిద్ధ సాహితీవేత, జీవశాస్త్రవేత్త)**

# 'అండర్ గ్రౌండ్ అలవెన్స్' చెల్లింపుకు నో అంటున్న సింగరేణి!

సింగరేణిలో పారిశ్రామిక సంబంధాలు పరిఢవిల్లాలంటే పారిశ్రామిక శాంతి అవసరం.దానికి యాజమాన్యం వారి బాధ్యతనే ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే కార్మికులకు పని స్థలాల్లో రక్షణ,పని భారం,పని ముట్లు,పని వేళలు,విద్య,వైద్య,గృహ వసతి సౌకర్యాలు,వేతనాల పెరుగుదల,కార్మిక వ్యతిరేక విధానాలు ఇలా తల వెంట్రుకలన్ని సమస్యలు ఉంటాయి. సమస్యలను పరిష్కరించుకోవడానికి కార్మిక వర్గం అనేక పోరాటాలు చేసి 'బైపార్టీయేట్', త్రైపార్టీయేట్' 'మెమొరాండం ఆఫ్ సెటిల్ మెంట్స్' ఒప్పందాలుగా హక్కులను, చట్టాలుగా సాధించుకున్నారు. అట్టి చట్టాలు,ఒప్పందాలను యాజమాన్యం 'సంస్థాగత విధానాలుగా, సర్క్యులర్స్ పేర జారీచేసి, అమలు చేసి పారిశ్రామికశాంతికి కృషి చేయాలి.కాని యాజమాన్యం కుంపటి రాజేసినట్లుగా చట్టబద్ధమైన హక్కులను కాలరాయడానికి పూనుకుంటుంది. అందుకే సింగరేణి ఆరిపోని మంటగా మండుతుంది. అందుగురించే కార్మికులు హక్కుల రక్షణకై వేగుచుక్కలై పోరాటాలను కొనసాగిస్తున్నారు.

నేషనల్ కోల్ వేజు అగ్రిమెంట్ 11, అధ్యాయం 4,10 ప్రకారంగా బొగ్గు గనుల చట్టం 1952 మార్గదర్శకాలతో రూపొందించబడిన నియమాలు మరియు నిబంధనలలో నిర్వచించిన విధంగా అండర్ గ్రౌండ్ ఉద్యోగులకు అండర్ గ్రౌండ్ అలవెన్స్ ను చెల్లించాలి.సెక్షన్ 420 ప్రకారం పునరుద్ధరించిన మూల వేతనంపై 11.25 శాతం అండర్ గ్రౌండ్ భత్యాన్ని చెల్లించాలి.బొగ్గు గనుల

చట్టం 1952 ,సెక్షన్ 49 ప్రకారంగా నిబంధనలలో పేరొన్న విధంగా అండర్ గ్రౌండ్ ఉద్యోగుల హక్కులకు/భత్యాలకు/రాయితీలకు/వెసులుబాట్లకు ఇతర చట్టాలు, అవార్డులు, ఒప్పందాలు, సేవా ఒప్పందాల పేరుతోగాని, బూచితోగాని భంగం కలిగించరాదు. పొందుచున్న ,ఆచరణలో ఉన్న హక్కులను కాలరాయకూడదు. సెక్షన్ 522లోని ఉపవిభాగం(1) ప్రకారం క్యాలండర్ ఇయర్ లో అండర్ గ్రౌండ్ మైన్‌లో కనిష్టంగా 190 రోజులు విధులను నిర్వహించిన వారిని అండర్ గ్రౌండ్ ఉద్యోగులుగా,కార్మికులుగా పరిగణించాలి.

బొగ్గు బావుల్లో బొగ్గును పైకి తీయడానికి బొగ్గు బావుల మీద ముందస్తు పనులు చేయ వలసి ఉంటుంది.బావుల లోపటి పనులకు అనుగుణంగా అండర్ గ్రౌండ్ లో పని చేసే కార్మికులు ఒకటి రెండు రోజులు బావుల మీద ఉండి పని ముట్ల పరికరాలను,విభాగాలను తయారు చేసుకోవలసి ఉంటుంది.అంటే బొగ్గు ఉత్పత్తి పనులన్నీ ఉపరితల పనులతోనే సక్కబెట్టుకోవలసి ఉంటుంది.దానికి అండర్ గ్రౌండ్ లో పని చేసే కార్మికులకు సంస్థాగత అవసరాల గురించి బావుల మీద పని చేసిన రోజులకు కూడా మూల వేతనంపై 11.25 శాతం అండర్ గ్రౌండ్ అలవెన్స్ చెల్లింపు జరుగుతుంది.కాని ఈ మధ్య కాలంలో యాజమాన్యం అండర్ గ్రౌండ్ కార్మికులకు బావుల మీద చేసిన పనులకు అండర్ గ్రౌండ్ అలవెన్స్ కు ఎగనామం పెడుతుంది.ఇది 'ఎన్ సిడబ్ల్యుఎ' 11 (నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్), బొగ్గు గనుల చట్టం 1952 ప్రకారం కార్మిక వ్యతిరేకం అవుతుంది.అలాగే సంస్థాగత సర్క్యులర్ 'ఆర్ఇఎఫ్ ఎన్ఓ.సిఆర్ పి/పిఇఆర్/ఐఆర్/5/540/1942, తేది 06/10/2008 కి విరుద్ధం అవుతుంది.అండర్ గ్రౌండ్ లో పని చేసే కార్మికులు పరిపాలన అవసరాల వలన బావుల మీద (ఉపరితల విధులు)పనిచేసిన రోజులకు కూడా అండర్ గ్రౌండ్ అలవెన్స్ చెల్లించాలి.

లెక్కలు చూస్తేనే బొక్కలు దొరుకుతాయి. అద్దం చూస్తేనే అందం తెలుస్తుంది. నిజమే.కాని సింగరేణి సంస్థలో ఆడిట్ మరియు విజిలెన్స్ విభాగాలు కార్మికుల మీద మాత్రమే విచారణలు జరిపి చర్యలు తీసుకోవాలని పురమాయించుతాయి. అధికారికమైన అవినీతి, దుబారా, వైయక్తిక పాలన నిర్ణయాలపై మాత్రం పల్లెత్తు మాట పలుకరు.కనీస చర్యలకు ఉపక్రమించరు. అంతర్జాతీయ క్రీడాకారుడు మెస్సీ ఆడిన ఫుట్ బాల్ మ్యాచ్ కు సింగరేణి సంస్థ స్పాన్సర్‌షిప్ వహించి రూ.10 కోట్లు వెచ్చించినప్పుడు సింగరేణి పట్టించుకోదు.బొగ్గు,స్క్రాప్,డీజిల్ దొంగతనాలకు సంబంధించిన దాదాపు 74 కేసులను మెగా లోక్ అదాలత్'వంకతో 2017 ఫిబ్రవరి 11న రాజీ చేసుకున్న కారణాలు వెల్లడి కావు.కొత్తగూడెం, రుద్రంపూర్ 'కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ '(సిహెచ్ పి) నుండి 2021 జనవరి 2న ఎక్కువ నాణ్యత కలిగిన బొగ్గును అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను సెక్యూరిటీ గార్డ్ పట్టుకున్న సంఘటనలపై జరిపిన విచారణ నిజాలను దాట వేశారు.

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ లో వారానికి' 5' డీజిల్ ట్యాంకర్లు 20 వేల లీటర్ల సామర్థ్యంతో సరఫరా చేసే ఒప్పందానికి బదులుగా'2' ట్యాంకర్లు మాత్రమే సరఫరా చేసి మిగతా '3'ట్యాంకర్లు రెండు సంవత్సరాల కాలం దారి మళ్లించి దాదాపు '300'కోట్లు అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చినవి.'25' మందిపై ఛార్జ్ షీట్లు దాఖలైనవి.2020 మార్చిలో 'రాష్ట్ర విజిలెన్స్ ఎన్ పోర్స్ మెంట్' విభాగం దర్యాప్తు చేసి ఇచ్చిన నివేదికపై ఇప్పటి వరకు నిజానిజాలను వెల్లడించలేదు.ఇలా సింగరేణిలో అధికార అవినీతి, దుబారాలకు ఒక న్యాయం,కార్మికులకు ఒక న్యాయం అమలు కావడం వలన పోరాటాలు కొనసాగుచున్నవి.సింగరేణి యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకొని అండర్ గ్రౌండ్ కార్మికులతో సంస్థాగత అవసరాల గురించి ఉపరితలంపై పనులు చేస్తున్న వారికి కూడా అండర్ గ్రౌండ్ అలవెన్స్ ను చెల్లించాలని కోరుతున్నారు.

**మేరుగు రాజయ్య**
9441440791.

# పెన్షనర్ల ఆవేదనపట్ల తగని ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య అనుసంధాన కర్తలుగా మూడునాలుగు దశాబ్దాల పాటు అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు పదవీ విరమణ అనంతరం పొందే పెన్షన్ అనేది దానం కాదు చట్టబద్ధ హక్కు. వారి చెమట, శ్రమ, అనుభవం దేశ నిర్మాణానికి పునాది. ఇలాంటి వృద్ధ ఉద్యోగుల కోసం ప్రతి సంవత్సరం డిసెంబర్ 17న జాతీయ పెన్షనర్స్ డే జరుపుకుంటారు. ఇది కేవలం ఒక ఉత్సవం కాదు, వారికి గౌరవం, కృతజ్ఞత చాటి చెప్పే రోజు. ఈ సందేశాన్ని గుర్తు చేసుకుంటున్న వేళ, తెలంగాణలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న పరిస్థితులు మాత్రం హృదయ విదారకంగా ఉన్నాయి. 2024 మార్చి నుంచి ఇప్పటివరకు సుమారు 16వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చట్టబద్ధంగా ఇవ్వాల్సిన రిటైర్మెంట్ బకాయిలు.. గ్రాట్యుటీ, కమ్యూటేషన్, జిపిఎఫ్, టీఎస్జీఎల్ఐ, సరెండర్ లీవ్, లీవ్ ఎన్కాష్మెంట్.. ఇవన్నీ ఒక్క రూపాయి కూడా విడుదల కాకపోవడం ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. జీవితాంతం క్రమశిక్షణతో సేవ చేసిన ఉద్యోగులకు రిటైర్మెంట్ రోజునే ఇవ్వాల్సిన మొత్తాన్ని ఎటూ తేల్చకుండా నెలల తరబడి నిలిపి వేయడం అమానవీయం కాదా?

ఈ మొత్తాలు గృహం నిర్మించుకోవడానికి, వైద్య చికిత్సకు, అప్పుల చెల్లింపులకు ఉపయోగపడతాయని ఆశించిన వృద్ధులు నేడు అప్పుల దెబ్బ కు, ఈఎంఐల ఒత్తిడిలో, అనారోగ్యంతో, మానసిక వేదనతో కుమిలిపోతున్నారు. వృద్ధాప్యంలో ఇలాంటి అవమానకర పరిస్థితి ఎవరికి రాకూడదు. ఆవేదనలో ఒత్తిడికి గురైన కారణంగా ఇప్పటివరకు సుమారు 28 మంది పెన్షనర్లు మరణించడం ఈ సమస్య యొక్క భయంకర తీవ్రతను చూపుతుంది. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం మరణాల కంటే భయంకరమైన విషయం. ఉద్యోగి సంఘాలు మౌనం వహించడాన్ని పెన్షనర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. సేవలో ఉన్నప్పుడు ఉద్యోగుల కోసం పోరాడిన సంఘా లు, నేడు అదే పెన్షనర్ల సమస్యలపై నోరు విప్పకపోవడం ఘోర అవమానం. వారి డిమాండ్లు అధికారిక జాబితాల్లో కూడా లేకపోవడం పెన్షనర్లలో తీవ్ర వేదన కలిగిస్తోంది.

ఈ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా 2024 మార్చి తర్వాత పదవీ విరమణ చేసిన వృద్ధ పెన్షనర్లు జిల్లాల వారీగా ఐక్యమై 'రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తెలంగాణ (2024–25)' రూపంలో రాష్ట్రస్థాయిలో బకాయిల సాధన సమితిని ఏర్పా టు చేశారు. వైద్య సమస్యలతో, వయస్సుతో బాధపడుతున్నా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎమ్మెల్యేలు, మంత్రులు, సిఎంఒల వరకు వినతి పత్రాలు సమర్పించారు. వాగ్దానాలకే పరిమితమై, అమలు మాత్రం కనిపించకపోవడం నిరాశ కలిగిస్తోంది. నవంబర్ 17న, ఇందిరా పార్క్ ధర్నాచౌక్‌లో వేలాదిమంది పెన్షనర్లు పాల్గొన్న చారిత్రక ధర్నా వృద్ధుల బాధను కళ్లకు కట్టింది. ఎంఎల్సీ కోదండరామ్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అమానవీయ చర్యగా పేర్కొంటూ ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అయితే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం పెన్షనర్ల మనోభావాలను దెబ్బతీసింది.

సామాజికవేత్త బక్క జడ్సన్, కాగ్ నివేదికలు, ఇతర ఆధారాలతో రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్, రాష్ట్రపతికి వినతిపత్రాలు ఇచ్చినందుకు అరెస్టు అవడం... ఇది సమస్య పరిష్కార ఉద్దేశం కన్నా ఉద్యమాన్ని అణచి వేయాలనే సంకేతం ఇచ్చింది. కొన్ని గంటల తర్వాత విడుదలైనప్పటి కీ, ఈ వ్యవహారం పెన్షనర్లలో తీవ్ర అసంతృప్తి కలిగించింది.

**పెన్షనర్స్ డే:** సేవను గౌరవించే రోజు.. డిసెంబర్ 17 నాడు మనం పెన్షనర్లకు కృతజ్ఞత తెలియజేసే వేళ తెలంగాణలో వేలాదిమంది పెన్షనర్లు తమ హక్కులకోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఉండటం ఎంత దురదృష్టకరం? పెన్షన్ భిక్ష కాదు హక్కు. దేశ నిర్మాణానికి సేవ చేసిన పెద్దలను తల్లిదండ్రుల్లా గౌరవించి వారికి రావాల్సిన బకాయిలను వెంటనే అందించడమే నిజమైన మానవీయ పాలనకు నిదర్శనం.

ప్రజాప్రతినిధులకు తమ వేతనాలు, అలవెన్సులు నిలిపివేస్తే? ఒకరోజు కూడా తట్టుకోవటం కష్టం. అయితే వేలాదిమంది వృద్ధుల రిటైర్మెంట్ బకాయిలను 'ఆర్థిక లోటు' పేరుతో నిలిపివేయడం ఎంతవరకు న్యాయం? ప్రజాస్వామ్యంలో చట్టబద్ధంగా ఇవ్వాల్సిన బకాయిలను ఇవ్వకపోవడం వల్ల పెన్షనర్ల మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. జాతీయ పెన్షనర్స్ డే సందేశాన్ని గౌరవించాలంటే రిటైర్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. ప్రభుత్వం మాటలు కాదు? కార్యాచరణ చూపాలి. వృద్ధ ఉద్యోగుల చెమటతో నడిచిన ఈ రాష్ట్రం, వారి వృద్ధాప్యంలో మాత్రం నిట్టూర్పులతో ఉండేలా చేయకూడదు.

**మేకిరి దామోదర్,**
9573666650.

# చిరస్మరణీయుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య

డిసెంబర్ 17 భోగరాజు పట్టాభి సీతారామయ్య వర్ధంతి. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు,ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య పార్లమెంటు సభ్యుడిగా,మధ్యప్రదేశ్ గవర్నర్ గా పనిచేశాడు. రాష్ట్రం బయట పనిచేసిననూ తెలుగు భాషపై మమకారం కోల్పోలేదు. తను స్థాపించిన ఆర్థిక సంస్థలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరగాలని సూచించాడు. తెలుగు భాషకు, తెలుగు జాతికి ఎన్నో చిరస్మరణీయ సేవలను అందించాడు.

పశ్చిమ గోదావరి జిల్లా గుండుకొలను గ్రామంలో 1880 నవంబర్ 24 న ఆరువేల నియోగి బ్రాహ్మణుల ఇంటిలో పట్టాభి జన్మించా . ఇతని తండ్రి భోగరాజు వెంకట సుబ్రహ్మణ్యం పంతులు గుండుగొలను గ్రామ కరణంగా పనిచేసేవాడు. సీతారామయ్యకు ఒక అన్న ఆరుగురు అక్కచెల్లెళ్ళు ఉన్నారు. ఇతని నాలుగవయేటనే తండ్రి మరణించడంతో కుటుంబభారం తల్లి గంగమ్మ మీద పడింది. పిల్లల విద్యాభ్యాసం కొరకు ఆమె తన కుటుంబాన్ని ఏలూరుకు తరలించింది. ఇతడు తన ప్రాథమిక విద్యను ఏలూరు లోని మిషన్ హైస్కూలు లో చదివాడు. అక్కడ మెట్రిక్యులేషను పూర్తి అయిన తరువాత బందరులోని నోబుల్ కాలేజీలో ఎఫ్.ఎ. పరీక్ష ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు. అక్కడ రఘుపతి వెంకటరత్నం నాయుడుకు ఇతడు ప్రియశిష్యుడు. ఉన్నత విద్యకై మద్రాసు వెళ్ళి మద్రాసు క్రైస్తవ కళాశాల నుండి బి.ఎ. డిగ్రీ 1900లో పొందాడు. ఆ తరువాత ఇతడు మద్రాసులోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎం.బి.సి.ఎం. డిగ్రీ 1905లో సాధించి డాక్టరు కావాలనే తన ఆశయాన్ని నెరవేర్చుకున్నాడు. పిఠాపురం మహారాజావారి కోరికను కాదని బందరులో డాక్టరుగా జీవితాన్ని ఆరంభించాడు పట్టాభి. బందరు జీవితం పట్టాభిని బాగా తీర్చిదిద్దింది.



చదువు పూర్తైన తర్వాత మచిలీపట్నంలో డాక్టరుగా ప్రాక్టీసు పెట్టాడు కానీ లాభదాయకమైన సంపాదనను వదులుకొని గాంధీజీ చే ప్రభావితుడై బ్రిటిషు వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నాడు. కాంగ్రెస్ పార్టీలో పట్టాభి గాంధీజీకి అతి సన్నిహితంగా ఉండేవాడు. 1939లో భారత జాతీయ కాంగ్రెసు పార్టీ అధ్యక్ష పదవికి అతివాద అభ్యర్థి అయిన సుభాష్ చంద్రబోస్‌కు వ్యతిరేకంగా, మహాత్మా గాంధీ అభిమతానికి దగ్గరైన వాడిగా పట్టాభిని పోటీలో నిలబెట్టారు. అయితే నేతాజీ పెరుగుతున్న ప్రాబల్యం,ఈయన ఓటమికి కారణమయ్యింది. ఆ తరువాత మళ్ళీ 1948లో జరిగిన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలలో పురుషోత్తమ దాస్ టాండన్ పై గెలిచి స్వతంత్ర భారత తొలి కాంగ్రెస్ అధ్యక్షుడిగా అవతరించాడు.

1942లో క్విట్ ఇండియా ఉద్యమ ప్రారంభములో కాంగ్రెసు పార్టీ కార్యాచరణ వర్గంలో పనిచేస్తూ ఉండగా మొత్తం కార్యాచరణ వర్గ సహితంగా పట్టాభిని అరెస్టు చేసి మూడేళ్లపాటు అహ్మద్ నగర్ కోటలో బయటి వ్యక్తులెవ్వరితో సంబంధాలు లేకుండా బంధించి చిత్రహింసల పాలు చేశారు. బందీగా ఉన్న ఈ సమయంలో పట్టాభి తన దినచర్యను గూర్చి విస్తారమైన డైరీ నిర్వహించాడు. దీనినే ఆ తదనంతరం ఫెదర్స్ అండ్ స్టోన్స్ (ఈకలు, రాళ్ళు) గా ప్రచురించారు. తెలుగు ప్రజలకు ఒక ప్రత్యేక రాష్ట్రం ఉండాలని దాని కొరకు పట్టాభి ఎంతగానో కృషిచేశాడు. పట్టాభి చొరవతోనే ఆంధ్ర రాష్ట్రోద్యమానికి అంకురార్పణ 1908లో బందరులో జరిగింది. బందరు సమావేశంలో తెలుగు జిల్లాల ప్రముఖులందరూ సమావేశమై ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం గురించి చర్చించారు. 1913లో బాపట్ల లో తొలి ఆంధ్రమహాసభ జరిగింది. పట్టాభి కృషి వల్లనే 1920 లో కాంగ్రెసు పార్టీ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు సూచనప్రాయంగా ఆమోదించింది. పట్టాభి సీతారామయ్య ఎన్నో ఆర్థిక సంస్థలను స్థాపించాడు. ఆంధ్రా బ్యాంకు (1923లో స్థాపన), ఆంధ్రా ఇన్సూరెన్స్ కంపెనీ, భారత లక్ష్మీ బ్యాంకు, కృష్ణా కో ఆపరేటివ్ బ్యాంకు మొదలగునవి స్థాపించాడు. పట్టాభి రచించిన గ్రంథాలలో కాంగ్రెసు చరిత్ర అన్నింటికంటే ప్రధానమైనది. సుమారు 1600పుటల కాంగ్రెసు చరిత్రను 2 మాసాలలో పూర్తిచేశాడు. గ్రంథకర్తగా ఆయన సుప్రసిద్ధ కాంగ్రెస్ చరిత్రతో పాటుగా పంజాబు వధలు, ఖద్దరు, స్వరాజ్యము, భారత జాతీయ విద్య, మన నేత పరిశ్రమ వంటి పుస్తకాలను కూడా రచించాడు. విలియం టారెన్స్ వ్రాసిన ఎంపైర్ ఆఫ్ ఏషియా అనే గ్రంథాన్ని తెలుగు భాషాంతరీకరణ చేశాడు. తెలుగు ప్రజలకు ఎంతగానో తోడ్పాటు అందించిన పట్టాభి 1959, డిసెంబర్ 17న కన్నుమూశారు. వీరి గౌరవార్థం భారత ప్రభుత్వం 1997న ఒక ప్రత్యేక తపాల బిళ్ళను విడుదల చేసారు.

**సుధాకర్ ఏవి,** 9000674747

## చక్రీపురం పేరునే కొనసాగించాలని వినతి




**ప్రజాపక్షం/చర్లపల్లి:** జిహెచ్‌ఎంసి పునర్విభజనలో భాగంగా చక్రీపురంను 16వ డివిజన్‌గా ప్రకటించిన పేరునే యథావిధంగా కొనసాగించాలని జిహెచ్‌ఎంసి ఎల్‌బి నగర్ జోనల్ ఆఫీసర్‌కు చక్రీపురం డివిజన్‌ను కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు వినతి పత్రం సమర్పించారు. చక్రీపురం పేరుపై కొందరు అభ్యంతరాలు తెలపడం జరుగుతుందని పేరును ఎలాంటి పరిస్థితిలో మార్చవద్దని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పాండు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి అశోక్, గౌరవ అధ్యక్షులు మొగిలి రాఘవరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి పైపులు ఏర్పాటు చేయరూ!




**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గౌతంనగర్ డివిజన్ అన్నపూర్ణ సొసైటీలో నాలుగు అడుగుల నూతన మంచినీటి పైపులు ఏర్పాటు చేయటంతో పాటు సాయిపురి కాలనీలో నూతన డ్రైనేజి పైపులైన్ ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ మేకల సునితా రాముయాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం జలమండలి ప్రధాన కార్యాలయానికి వెళ్ళిన ఆమె ఎండి అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.



## సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తరలించ వద్దు : ఎమ్మెల్యే బండారి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఉప్పల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని బోడుప్పల్‌కి తరలించవద్దంటూ స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన బిఆర్ఎస్ నేతలు సాయి జెన్ శేఖర్, బన్నాల ప్రవీణ్‌లతో కల్సి మంగళవారం సచివాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కల్సి వినతిపత్రం సమర్పించారు. ఉప్పల్ ప్రాంతంలో ప్రస్తుతం కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీప ప్రాంత వాసులకు అనుకూలంగా ఉందని, ఈ కార్యాలయాన్ని దూరంలో ఉన్న బోడుప్పల్‌కు తరలించటం వల్ల రిజిస్ట్రేషన్ తదితర శాఖా పనులకోసం రాకపోకలు చేసే వారికి వృథా వ్యయప్రయాసలకు గురవుతారన్నారు. అదే విధంగా కాప్రా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి నూతన సొంత భవనం ఏర్పాటు చేయాలన్నారు.

## గ్రామ ప్రజలకు అండగా ఉంటా

### సర్పంచ్ మేకల సంతోష్ రెడ్డి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నూతన గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అత్తాపూర్ గ్రామ సర్పంచ్‌గా మేకల సంతోష్ రెడ్డి నూతనంగా ఎన్నికయ్యారు. గ్రామ ప్రజల ఆశీర్వాదంతో ఈ బాధ్యత తనకు దక్కిందని ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి నాకు ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్తాపూర్ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యమన్నారు. తాగునీరు, రోడ్లు, అండర్ డ్రైనేజీ, వీధి దీపాలు మెరుగుపరచడమే కాకుండా గ్రామ మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. గ్రామ పాలనలో పారదర్శకత, ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. గ్రామ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడతానని మహిళ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తానని అన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూస్తాను అన్నారు. గ్రామ పెద్దల సలహా సహకారంతో అత్తాపూర్ గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దడమే నా ధ్యేయం అని అన్నారు.

## సెయింట్ మేరీస్ విద్యార్థుల అద్భుత ప్రతిభ



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కరాటేతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం మానసిక బలాన్ని పెంపొందిస్తుందని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సేయింట్ మేరిస్ హైస్కూల్ డైరక్టర్ నీరజ అన్నారు. సైలెన్ షోటోకాన్ స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో తూంకుంట మున్సిపాలిటి దేవరయాంజాల్‌లో సెయింట్ మేరిస్ విద్యార్థులు 5వ అంతార్జాతీయ హుయాన్ చుంగ్ ఇండియా జాతీయ స్థాయి కుంగ్ ఫూ కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ 2025–26 కాటా ఈవెంట్‌లో పాల్గొన్న యశ్వంత్ స్వర్ణ పథకం, సృజన స్వర్ణ పతకం, అనుశ్రీ కాంస్య పథకాలను సాదించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరక్టర్ నీరజ, కరస్పాండెంట్ మైకేల్ విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్తులో జాతీయ అంతార్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల క్రమశిక్షణ, అంకితభావం, కఠోర శ్రమతో విజయాలు సాధ్యమయ్యాయని చెప్పారు. అనంతరం కోచ్ లైన మోహన్, హరిప్రసాద్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కాసాని కృష్ణ ముదిరాజ్ సేవలు చిరస్మరణీయం : వీరేశ్

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** స్వర్గీయ కాసాని కృష్ణ ముదిరాజ్ ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి, మల్లంపేట్, ప్రగతి నగర్, నిజాంపేట్ తదితర ప్రాంతాలలో మాజీ ఎంపిటిసి స్వర్గీయ కాసాని కృష్ణ ముదిరాజ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాసాని వీరేశ్ ముదిరాజ్ కాసాని కృష్ణ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికులకు పళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరేశ్ మాట్లాడుతూ బాచుపల్లి, నిజాంపేట్, మల్లంపేట్ గ్రామ ఎంపిటిసిగా స్వర్గీయ కాసాని కృష్ణ ప్రజలకు ఎన్నో సేవలను అందించారని గుర్తుచేశారు. నిరుపేద ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి ఆయన నిరంతరం పాటుపడ్డారని, ఆయన చూపిన బాటలో తామందరం పయనిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షుడు కొలను కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కాసాని సుధాకర్ ముదిరాజ్, మాజీ ఎంపిటిసి నందిగామ సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

## బస్సు సర్వీస్ పునరుద్ధరించండి

### హకింపేట డిఎంకు గ్రామస్థుల వినతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని పోతారం గ్రామానికి ఆర్‌టిసి బస్సును నడుపాలని గ్రామస్థులు హకింపేట డిపో మేనేజర్ సరితాదేవికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా పోతారం గ్రామానికి ఆర్‌టిసి బస్సు రాకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పోతారం అనంతారం గ్రామాల మధ్య రోడ్డులో పడిన గుంతలను పూడ్చివేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించామని చెప్పారు.

### షాహి మహిళా కార్మికుల సమ్మె...

# తొలి సంయుక్త భేటీ విఫలం

* అర్థాంతరంగా వెళ్లిపోయిన సంస్థ జిఎం
* సమస్యలు పరిష్కరించాల్సిందే: విఎస్. బోస్





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నాచారం షాహి గార్మెంట్ సంస్థ మహిళా కార్మికులు వేతనాల సమస్యల విషయంలో గత 9 రోజులుగా కొనసాగుతున్న సమ్మె నేపథ్యంలో కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ శ్యాంసుందర్ రెడ్డి మంగళవారం నిర్వహించిన కార్మికులు, యాజమాన్యాల సంయుక్త సమావేశం విఫలమవటంతో బుధవారానికి వాయిదా వేసారు. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని కార్మిక సంక్షేమ భవన్‌లో జాయింట్ కమిషనర్ ఎదుట సంస్థ జిఎం మురళి, 25 మంది మహిళా కార్మికులతో పాటు ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, ఏఐటియుసి, సిఐటియుసి, ఐఎన్టీయుసి, ఐఎఫ్టీయు,టియుసిఐ రాష్ట్ర నేతలు విఎస్ బోస్, బాల్‌రాజు, చుక్క రాములు, భాస్కర్, విజయకుమార్, కె.ధర్మేంద్ర, గణేష్,శ్రీనివాస ప్రదీప్, రవిలు పాల్గొన్నారు. సమస్యల పరిష్కారం విషయంలో మాట్లాడాలని జాయింట్ కమిషనర్ సమావేశంలోచెప్పినప్పటికి సరైన జవాబివ్వకుండా అర్థాంతరంగా వెళ్లిపోయారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన జాయింట్ కమిషనర్ బుధవారం మధ్యాహ్నం మరోసారి నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని నోటీసుపంపా రు.

అనంతరం మహిళా కార్మికులు ట్రేడ్ యూనియన్ నేతలు మీడియాతో మాట్లాడుతూ సంస్థలో పనిచేసే కార్మికులకు వివక్ష లేకుండా కార్మిక నిబంధనల మేరకు వేతనాలు చెల్లించాలని, సెలవులు, ఉద్యోగ భద్రత,ప్రతి రోజు విరామ సమయం, వేతనాల కోత, బోనస్‌ల చెల్లింపు, కక్ష సాధింపు చర్యలు మానుకోవటం లాంటి సమస్యలు పరిష్కారం కావాలని డిమాండ్ చేసారు. సంస్థలో వేలాది సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్న దృష్ట్యా అక్కడే క్యాంటిన్ , మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు.

## చర్చిలకు రూ.15 లక్షల నిధులు

### శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** క్రీస్తు ప్రవచన మార్గంలో ప్రేమను పెంచుతూ భారత రాజ్యాంగంలోని లౌకిక తత్వాన్ని పెంపొందించుదామని రాష్ట్ర శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు.మేడ్చల్‌లో జేవియర్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున మేడ్చల్ జిల్లాలో 50 చర్చిలకు ఒక్కో దానికి రూ. 30వేల చొప్పున రూ.15 లక్షలు నిధులు మంజూరు చేసారన్నారు. ఈ సందర్భంగా 2000 మందికి క్రైస్తవులకు సామూహిక విందు ఇచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వం క్రైస్తవులకు, మైనరిటీలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ అవకాశం కల్పించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమానికి తాము అన్ని వేళలా సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింలు యాదవ్, మాజీ చైర్మన్ సత్యనారాయణ, ఆర్టీవో సభ్యులు జైపాల్ రెడ్డి, హజ్ కమిటి సభ్యులు ముజీబ్, మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పోచంపల్లి ఆల్వాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీని



## రాష్ట్రపతి శీతాకాల విడిది ఏర్పాట్లలో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదికి ఈ నెల 17న రానున్న దృష్ట్యా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. మంగళవారం జిల్లా పరిధిలోని హకీంపేట ఎయిర్‌పోర్టును సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. 17న సాయంత్రం 4.25 గంటలకు ఎయిర్‌పోర్టుకు హకీంపేట రాష్ట్రపతి చేరుకొన్న నేపథ్యంలో అక్కడ చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలు, ఇతర అంశాలపై చర్చించారు. ఎయిర్‌పోర్టు ఏర్పాట్లను కీసర ఆర్డీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, ఆయన నేపథ్యంలో సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తుంటారని, ఎయిర్‌పోర్టులో, రాష్ట్రపతి రాకపోకలు చేసే మార్గంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి మంచి మొక్కలు, ప్లాంటేషన్ చేస్తారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రపతికి స్వాగతం పలికేందుకు విచ్చేసే రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు సీటింగ్, ఆతిథ్యం అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని, తూంకుంట మున్సిపల్ కమిషనర్ అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వైద్య అధికారులు, సిబ్బంది, మందులు, మందుల కిట్స్ అందుబాటులో ఉంచాల ని, జిల్లా రోడ్లు భవనాల శాఖాధికారులు గుంతలు పూడ్చి అవసరమైన రోడ్డు మరమ్మత్తు పనులు చేయాలని, విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. కలెక్టర్ పర్యటనలో కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, శామీర్‌పేట ఎంఆర్ఓ సంయుక్త, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాసమూర్తి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి శ్రీధర్, తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## రెండవ సారీ ఉపసర్పంచ్‌గా రాజు

**ప్రజాపక్షం/కోట్‌పల్లి:** కోట్‌పల్లి మండల పరిధిలోని బీరెల్లి గ్రామ సర్పంచు యువకుడు మంచి పేరు ఉండటంతో గ్రామస్తులు మోముల సుధాకర్ ను 175ఓట్ల మెజార్టీలో గెలిపించారు. తలారీ రాజు న్యాయవాది యువకుడు గ్రామంలో మంచి పేరు ఉండటంతో గ్రామస్తులు రెండవసారీ ఉపసర్పంచుగా అవకాశం కల్పించారు. గ్రామా సర్పంచు ఉపసర్పంచు యువకులు కావడంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తారని భావిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాకు అవకాశం కల్పించిన గ్రామాస్తులకు,యువకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాల కోసం నిరంతరం అందుబాటులో ఉండి సమస్యలను మా దృష్టికి వచ్చిన వాటిని పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

## వినాయకనగర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు

### కార్పొరేటర్ కాస్యం రాజ్యలక్ష్మి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** డివిజన్‌లోని పలు ప్రాంతా ల అభివృద్ధి పనుల కోసం రూ.357 లక్షల బడ్జెట్ కేటాయించటం జరిగిందని, ఈ పనులకు గాను చేపట్టిన టెండర్ల ప్రక్రియ పూర్తయి త్వరలో పనులు ప్రారంభమవుతాయని వినాయకనగర్ కార్పొరేటర్ కాస్యం రాజ్యలక్ష్మి తెలిపారు. గురువారం కార్పొరేటర్ మాట్లాడుతూ కొత్తగా చేపట్టనున్న అభివృద్ధి పనులను వివరించారు.

రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం పక్కన ఉన్న లైన్‌లో వినాయకనగర్ యుసిహెచ్‌సి, అర్బన్ ప్రైమరి సెంటర్ భవన నిర్మాణాలకు గాను రెవెన్యూ విభాగం కేటాయించిన 500చదరపు గజాల స్థలంలో కేంద్ర ప్రభుత్వం 15 ఆర్థిక సంఘం కింద రూ.143 లక్షల తో నిర్మాణం జరుగనుందని, దీనికోసం టెండర్ ప్రక్రియ సైతం పూర్తయిందని చెప్పారు. వినాయకనగర్ ఎస్సీ బస్తీలో కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణం కోసం ఎంపి నిధుల నుండి రూ.15 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఎంపి నిధుల నుండి డివిజన్ అభివృద్ధి పనుల నిమిత్తం మంజూరైన రూ.2 కోట్లకు సంబంధించిన ప్రతిపాదలు జిహెచ్‌ఎంసి జోనల్ కార్యాలయానికి పంపించడం జరిగిందన్నారు. డిఎవి పబ్లిక్ స్కూల్ వైపు చంద్రగిరి కాలనీ రోడ్డు పనుల ను ఇప్పటికే రూ. 47 లక్షలతో, వినాయక్‌నగర్ రోడ్ నంబర్ 10, 11 పనులు రూ.32లక్షలతో పూర్తయ్యాయన్నారు. దీన్‌దయాళ్‌నగర్ వాటర్ పైపు పనులు రూ.130 లక్షలతో, రేణుకనగర్ బాక్స్ డ్రైవ్ పనులు రూ.200లక్షలతో, జెకె కాలనీలో 900 ఎంఎం డయా ఆర్‌సిసి పైపులైన్ పనులు రూ.20లక్షలతో పూర్తి కావస్తున్నాయన్నారు. సూర్యనగర్‌లో స్మార్క వాటర్ డ్రైన్ కోసం కమిషనర్ ఆమోదించారని కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తెలిపారు.



## సమస్యలపై కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/జవహర్‌నగర్:**మేడ్చల్ నియోజకవర్గంలోని జవహర్ నగర్ సర్కిల్ లో ఉన్న సమస్యల పరిష్కారంకోసం మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనూ చౌదరిని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. జవహర్ నగర్ మినీ భారతదేశంగా పిలువబడుతుందని ఇక్కడ సుమారు 200 కాలనీల్లో విస్తరించిన జవహర్‌నగర్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు గత 30 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్నారు. అయితే పాత ఇండ్ల స్థానంలో నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడానికి లేదా పాత ఇంటి స్థానంలో పక్కా ఇంటి నిర్మాణం చేపట్టడానికి కూడా అనుమతులు మంజూరు చేయాడం లేదు. గత ప్రభుత్వాలు ఇచ్చిన 58, 59 జిఒ ద్వారా వచ్చిన పట్టాలు ఇప్పుడు నూతనంగా ఇండ్లు కట్టుకోవడానికి అనుమతులు ఇవ్వకపోవడంతో ఏం చేయాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదే విధంగా ఇంకా మిగిలిన ఖాళీ స్థలాల అంశం న్యాయస్థానంలో ఉండడంతో అక్కడ చేపట్టాల్సిన నిర్మాణాలు పెండింగ్‌లో ఉండడంతో ఖాళీ స్థలాలను కొందరు ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేయాలని చూస్తున్నారని కావున దానికి సంబంధించిన పరిష్కారం తక్షణమే చూపి భూములు కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## డిఆర్‌సి కేంద్రాల పరిశీలన

**ప్రజాపక్షం/పరిగి :** వికారాబాద్ జిల్లాలోని పరిగి నియోజకవర్గంలోని ఐదు మండలల్లో మూడవ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా జల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా డీఆర్‌సి కేంద్రలను సందర్శించి ఎన్నికల ఏర్పాట్లను క్షణంగా పరిశీలించారు. కుల్కచర్ల ,దోమ , పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీఆర్‌సి కేంద్రాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎన్నికల అదికారులు పోలిసులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఎటువంటి పొరపాట్లుకు తవు లేకుంఆ పటిష్టమైన భద్రత మధ్య ఎన్నికలు జరిగేలా చర్యాలు తీసుకోవలని సూచించారు. ఎన్నికల సమాగ్రిపై ప్రత్యేక నిఘ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ,సిఐ ,ఎస్‌ఐలు పాల్గోన్నారు.

## జవహర్ నగర్‌లో ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** గ్రేటర్ హైదరాబాద్ జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని చెన్నపురంలో అయ్యప్ప మాలధారులు కన్నె స్వామి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో నరేష్ గురుస్వామి మంత్రోచ్చారణతో మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, అనంతరం అభిషేకం అష్టోత్తర పూజలు, అయ్యప్ప సంకీర్తనల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. చెన్నపురం ప్రజలు ఎంతో ఆనందంగా అయ్యప్ప సంకీర్తనలను ఆలపించారు. మహా పడిపూజకు బిఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిజెపి పార్టీ నేతలు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని, అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందుకున్నారు.

## జనాభా, ప్రాంతాల ప్రాతిపదికన ఏర్పాటు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:**జిహెచ్‌ఎంసిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డివిజన్లను జనాభా, ప్రాంతాల ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని మౌలాలి డివిజన్ పూలపల్లి భరత్ భూషణ్ యాదవ్, పెద్ది సాయిబాబు తదితరులు మంగళవారం జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కొత్త డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు 25 నుండి 30 వేల జనాభా ఉంటుందగా మౌలాలి డివిజన్‌లో 56 వేలు జనాభా ఉందన్నారు. అన్ని డివిజన్లు సమంగా అభివృద్ధి చెందేందుకు సరైన విధంగా డివిజన్ల ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన నాయకులు రమేష్ గౌడ్, మోహన్ యాదవ్, ఆనంద్, ఫణీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు సర్పంచ్‌లు న్యాయవాదులు



**ప్రజాపక్షం/వికారాబాద్:** మండల పరిధిలోని 21గ్రామ పంచాయతీల సర్పంచులలో ముగ్గురు న్యాయవాదులు బరిలో నిలిచి గెలిపొందారు. వికారాబాద్ మండల పరిధిలోని పీరంపల్లి సర్పంచ్‌గా గెలుపొందిన బావనోల్ల గురువారెడ్డి వృత్తిరీత్యా సీనియర్ న్యాయవాదిగా మంచి పేరుంది. ఎర్రవల్లి గ్రామ సర్పంచ్‌గా గెలుపొందిన రబ్బానీ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. పాతూర్ గ్రామ సర్పంచుగా గెలుపొందిన డి.సంపత్‌రెడ్డి సైతం న్యాయవాది గా ప్రాక్టీస్ చేస్తున్నారు. వీరిలో రబ్బానీ గురువరెడ్డి వద్ద జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టిస్ చేస్తున్నారు. ఈసారి వారి గ్రామాల్లో అవకాశం రావడంతో మంచి మెజార్టీతో గెలుపొందారు. తమకు ఈ సారి సేవ చేసేందుకు అవకాశం కల్పించినందుకు అన్ని విధాలా ప్రజలకు అందుబాటులో ఉంటు గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తమను గెలిపించిన గ్రామస్తులకు స్నేహితులకు ధన్యవాదాలు తెలిపారు.




## ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన అమెరికా విద్యార్థుల బృందం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపాలిటి లక్ష్మాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలను అమెరికా విద్యార్థుల అంతర్జాతీయ బృందం, విద్య మరియు పరిశోధనా మండలి సంయుక్తంగా కలిసి మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా విధానం, ఉపాధ్యాయులతో విద్యార్థుల సాన్నిహిత్యం, గ్రామస్థుల సహకారం తదితర అంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్యపై అమెరికా బృందం హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయకుమారి, ఎంఇఒ భాగ్యమణి, ప్రధానోపాధ్యాయురాలు స్వప్నరెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు, వేణు, ఎస్‌జిటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణ చెక్ లిస్ట్ చూసుకోవాలి

**ప్రజాపక్షం/పరిగి :** సజావుగా ఎన్నికల నిర్వహణ చెక్‌లిస్ట్ చూసుకోవాలని, జిల్లా సాదరణ ఎన్నికల అధికారి షేక్ యాస్మిన్ బాష అన్నారు. మూడవ విడుత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా సాధారణ ఎన్నికల అధికారి యాస్మిన్ బాష తెలిపారు. మంగళవారం పరిగి మండల పరిషత్ కార్యాలయంలో నందు ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించారు. ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. అన్నిటిని చెక్ చేసుకోవాలని సూచించారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనం కల్పించాలని ఆదేశించారు.

## 20న సర్పంచులు, వార్డు సభ్యులు తొలి సమావేశం

శంకర్‌పల్లి ఎంపిడిఒ వెంకయ్యగౌడ్



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** శంకర్‌పల్లి మండలంలోని గ్రామాలలో ఈనెల 20వ తేదీన గ్రామ పంచాయతీ కార్యాలయాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులకు తొలి సమావేశం నిర్వహించేలాచర్యలు తీసుకోవాలని శంకర్ పల్లి మండల ప్రజా పరిషత్ అధికారి వెంకయ్య గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో గ్రామపంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో తొలి సమావేశం నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.

## కాలనీల్లో చెత్త సమస్య రానియొద్దు

కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** పారిశుధ్య కార్మికులు కాలనీల్లో చెత్త సమస్య రాకుండా పరిష్కరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీలో మార్నింగ్ వాక్‌లో భాగంగా పర్యటించి కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ లక్ష్మయ్య, కాలనీ వాసులు మల్లిఖార్జున్, రంజిత్, నాయకులు జోషి, వంశీయాదవ్, టింకు, పవన్ పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి

ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/షాబాద్:** గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామ పంచాయతి సర్పంచ్‌గా గెలుపొందిన పర్వేద నర్సింలు, ఉప సర్పంచ్ శివకుమార్ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచ్ నర్సింలు, వార్డు సభ్యులను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నూతనంగా గెలుపొందిన సర్పంచుల ద్వారా ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ప్రభుత్వంపై నమ్మకంతో గ్రామంలో పని చేసే నాయకులకు పట్టం కట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భుపతి రాజు, సుదర్శన్, మాజీ ఎంపిపి కూర వెంకటయ్య, గ్రామస్తులు శేఖర్, పాపిరెడ్డి, రాజేందర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కేశంపేట:** ఆధ్యాత్మికత కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కేశంపేట మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులో ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం అభివృద్ధికి ప్రతిఒక్కరు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వీరేష్, తాండ్ర విశాల, సురేష్‌రెడ్డి, బీస కవిత కరుణాకర్ రెడ్డి, భాస్కర్ నాయక్, సువర్ణ నర్సమ్మ, నాగేష్, హైమావతి జగదీష్, రాణి, ఉపసర్పంచ్ రమేష్ నాయక్‌తోపాటు గిరి యాదవ్ పాల్గొన్నారు.

## సమస్యలు గుర్తించి పరిష్కారం దిశగా పనులు చేపట్టాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులను ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి సన్మానించారు. మంగళవారం నందిగామ మండలం మొదళ్ళగూడ గ్రామంలో ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామసర్పంచ్‌గా ఎన్నికైన బుగ్గ క్రిష్ణ, ఉప సర్పంచ్ లక్ష్మీ రాము, కడియాలకుంట సర్పంచ్ మూడావత్ రాజునాయక్ చౌహాన్, ఉప సర్పంచ్ తౌసింగ్, వార్డు సభ్యులు మమతా శ్రీనివాస్, నిహారిక మహేష్, బెరుమాలి రమేష్, కొత్తపేట చందు, డిజె ప్రవీణ్, కుమ్మరి మహేష్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నూతన సర్పంచులు వార్డుల వారీగా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం దిశగా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రాధాకృష్ణ, అనుమారి రాజు, కడియాలకుంట వార్డు సభ్యులు రవీందర్ నాయక్, థౌసింగ్, గోపి, నీలాజ్యోతి, దేవి ప్రియాంక, మాజీ ఎంపిటిసి శంకర్ నాయక్, చందులాల్, నేనావత్ శంకర్ నాయక్‌లు పాల్గొన్నారు.

## మండల పరిషత్ ఎన్నికల్లో పోటీ

జనసేన పార్టీ నాయకులు రాజునాయక్, అష్రఫ్



**ప్రజాపక్షం/కొందుర్గు:** వచ్చే మండల పరిషత్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేసేందుకు సిద్ధమవుతుందని పార్టీ నాయకులు జర్పుల రాజునాయక్, ఎండి అష్రఫ్‌లు అన్నారు. మంగళవారం జనసేన పార్టీ కార్యకర్తలకు సభ్యత్వ నమోదు ఐడి కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జర్పుల రాజునాయక్, ఎండి అష్రఫ్‌లు మాట్లాడుతూ జనసేన పార్టీని పల్లెల్లో బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో నేతలు దాసరి శ్రీను, రామకృష్ణ, కొర్ర శంకర్ నాయక్, యాదగిరి, సామ శివ, శ్రీకృష్ణలు పాల్గొన్నారు.

## మధుయాష్కీగౌడ్ కలిసిన ప్రేమ్‌నాథ్



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** టిపిసిసి ప్రచార కమిటీ ఛైర్మన్, ఎల్‌బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మధుయాష్కీగౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ కౌన్సిలర్ కందికంటి ప్రేమ్‌నాద్‌గౌడ్, కందికంటి పండరినాథ్‌గౌడ్, స్థానిక నాయకులతో కలిసి మధుయాష్కీకి శాలువాతో ఘనంగా సన్మానించి భారీ కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనహృదయ నేత, పేదల పెన్నిధి మధుయాష్కీగౌడ్ అని అన్నారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని భగవంతుణ్ణి కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో మెట్ టీమ్‌ల సేవలు అభినందనీయం

హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈ ఏడాది వర్షాకాలంలో చేపట్టిన పనులు ఎంతో సంతృప్తినిచ్చాయని, హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్ అభినందనలు అందుకున్న మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ (మెట్), స్టాటిక్ టీమ్‌ల కాంట్రాక్టర్లు ఆనందం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పటికీ, నగరంలో ఎక్కడా వరదలు లేకపోవడం, కాలనీలు నీట మునగకపోవడంలో తమ పని తీరు కీలకమని వారు తెలిపారు. ఈ మేరకు కాంట్రాక్టర్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని కలిసి, సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ కూడా మెట్ కాంట్రాక్టర్లను ప్రశంసించారు. ఒప్పందం ప్రకారం కల్వర్టులు, క్యాచ్‌పిట్లలో పూడిక తీయడమే కాకుండా, హైడ్రాతో కలసి నాలాలను కూడా క్లియర్ చేయడం వల్లే వరద సాఫీగా సాగిందని ఆయన అభినందించారు.

### అడుగడుగునా హైడ్రా సహకారం

కాంట్రాక్టర్ల ఎంపిక నుంచి 150 రోజుల పాటు పని చేసిన్ని రోజులు హైడ్రా తమకు ఎంతో సహకరించిందని కాంట్రాక్టర్లు తెలిపారు. 30 సర్కిళ్లకు వేర్వేరు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం వల్ల ఎందరికో ఉపాధి లభించింది. ఒక్కో టీమ్‌లో ఐదుగురు చొప్పున ఒక్కో డివిజన్‌లో 3 బృందాలు పని చేయగా, మొత్తం 150 మెట్ టీమ్‌లు (2250 మంది), 1200ల మంది స్టాటిక్ (వరద నిలిచే ప్రాంతంలో పని చేసే సిబ్బంది) టీమ్ సభ్యులు ఈ పనుల్లో పాల్గొన్నారు. మొదటి వర్షంతోనే సమస్య ఉత్పన్నమయ్యే ప్రాంతాలను హైడ్రా అంచనా వేసి, పరిష్కారం సూచించి, మెట్ బృందాలను ఆ దిశగా వినియోగించుకుంది. భారీ వర్షాలు పడుతున్నప్పుడు హైడ్రా కమిషనర్ కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించడం, హైడ్రా సిబ్బంది వెన్నంటే ఉండి సహకారం అందించిన తీరుతో మెరుగైన ఫలితాలు సాధించామని కాంట్రాక్టర్లు తెలిపారు.

### 'కష్టమనిపించలేదు'

హైడ్రా అధికారులు, డిఆర్‌ఎఫ్ బృందాలు, ఎస్‌ఎఫ్‌ఓలు ఇలా అన్ని స్థాయిల్లో పూర్తి సహకారం అందిందని కాంట్రాక్టర్లు తెలిపారు. కొత్త సంస్థతో మొదటిసారి పని చేస్తున్నప్పుడు ఎలా ఉంటుందో అని అనుకున్నప్పటికీ, ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా, కష్టమనిపించకుండా పని చేశామని వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కల్వర్టులు, క్యాచ్‌పిట్లలో పూడిక తీయడమే విధి అయినప్పటికీ, వరద సాఫీగా సాగడానికి నాలాల్లో పూడికను కూడా తొలగించాల్సి ఉందని హైడ్రా గుర్తించింది. ఆ మేరకు అమీర్‌పేటలో పూర్తిగా పూడికపోయిన 6 భూగర్భ పైపులను క్లియర్ చేయడం ద్వారా ఈ ఏడాది వరద ముంచెత్తకుండా నివారించారు. కృష్ణానగర్‌లో పెద్దయెత్తున పూడిక తీయడంతో రహదారులు వరద ముంపు నుంచి తప్పించుకున్నాయి. ఈపనితీరుకు యెల్లారెడ్డిగూడ, అంబేడ్కర్ నగర్ నివాసితులు హైడ్రాకు అభినందనలు తెలపగా, అందులో తాము భాగస్వామ్యం అయినందుకు సంతృప్తిగా ఉందని కాంట్రాక్టర్లు చెప్పారు. నగర వ్యాప్తంగా టోలీచౌక్ వద్ద, పాతబస్తీలో, ఎల్.బి.నగర్ వంటి ప్రాంతాలలో హైడ్రాతో కలసి సేవలందించడం కొత్త అనుభూతిని ఇచ్చిందని మెట్ కాంట్రాక్టర్లు తెలిపారు.

## డివిజన్‌ల విభజన అశాస్త్రీయం



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** రానున్న గ్రేటర్ హైద్రబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అశాస్త్రీయ పద్దతిలో డివిజన్ల విభజన చేసిందని బిజెపి ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ బి.బి.ఆర్.వేణు ఆరోపించారు. అయినప్పటికీ మేయర్ పీఠం బిజెపికి దక్కుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆర్‌కెపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిబిఆర్ వేణు మాట్లాడుతూ గత జిహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బిజెపి 48 మంది కార్పోరేటర్లతో ఘన విజయం సాధించిందని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజారిటీతో బిజేపీ విజయం సాధించి భాగ్యనగరంపై కాషాయ జెండా ఎగరవేస్తామని అన్నారు. అశాస్త్రియంగా డివిజన్లు విభజన చేసి ఎన్నికల్లో లబ్ది పొందాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నాలను జిహెచ్‌ఎంసీ ఎన్నికల్లో అవమానభారం తప్పదని హెచ్చరించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ప్రకటించిన బిసి డిక్లరేషన్‌లో 42 శాతం రిజర్వేషన్ హామీని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తే దాన్ని బిజెపి పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. రానున్న జిహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పార్టీ అవకాశం కల్పిస్తే తప్పనిసరిగా పోటీ చేసి బిజెపి జెండా ఎగరవేస్తానని అన్నారు. త్వరలో స్థానికంగా బిజెపి కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు.

# మార్చికల్లా 'మెట్రో' ఓవర్ ప్రక్రియ పూర్తి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రైల్‌ను ఎల్ అండ్ టి నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు ఆదేశించారు. మెట్రో రైల్ స్వాధీన ప్రక్రియపై ఉన్నత స్థాయి సమావేశంలో కమిటీ ఆఫ్ సెక్రటరీస్, ఎల్ అండ్ టి ప్రతినిధులతో కలిసి సమీక్ష నిర్వహించిన ప్రధాన కార్యదర్శి, ఇరుపక్షాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ బదిలీ ప్రక్రియ సజావుగా, వేగంగా సాగాలని స్పష్టం చేశారు. ఇప్పటికే అమలులో ఉన్న ఒప్పందాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, వచ్చే 100 రోజుల్లో ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ స్వాధీన ప్రక్రియను వేగవంతం చేసేందుకు లావాదేవీల సలహాదారుగా ఉన్న ఐడిబిఐ సంస్థ తమ నివేదికను అత్యంత త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే ఈ ప్రక్రియలో ఎల్ అండ్ టి పూర్తి సహకారం అందించాలని స్పష్టం చేశారు. మెట్రో స్వాధీన అనంతరం నిర్వహణ, ఆపరేషన్లకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్) మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ పట్టణ రవాణా సలహాదారు ఎన్‌విఎస్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఎల్ అండ్ టి మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ ఎం.డి. కెవిబి రెడ్డి, ఐడిబిఐ అధికారులు, హెచ్‌ఎంఆర్‌ఎల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డివిఎస్ రాజు, హెచ్‌ఎంఆర్‌ఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** మూడవ విడత ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తవివ్వకుండా ప్రకటిబందీగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా మంచాల మండలంకు సంబంధించి మంచాలలోని ధన్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆకస్మికంగా సందర్శించి, పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎలక్షన్ మెటీరియల్ పంపిణిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు.పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. అదేవిధంగా బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటిరియల్ క్షుణ్ణంగా పరిశీలించి, అన్ని సరిగా ఉన్నాయని నిర్ధారణ చేసుకొని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి బయలుదేరాలని సూచించారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని,త్రాగునీరు,లైటింగ్,పార్కింగ్ ప్రదేశాలు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బంది నిర్వహించే వారి విధులను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్‌డిఒ అనంత్‌రెడ్డి, సంబంధిత తహసీల్దార్లు, ఎంపిడిఓలు, అధికారులు పాల్గొన్నారు.

### పిఎంశ్రీ స్కీమ్ జాబితాలో ఆరుట్ల జడ్‌పిహెచ్‌ఎస్‌కి చోటు

2022–23 సంవత్సరంలో పిఎం శ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా) స్కీమ్ జాబితాలో చోటు పొందిన ఆరుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సి,నారాయణ రెడ్డి మంగళవారం సందర్శించారు. మంచాల మండలం ఆరుట్ల ఉన్నత పాఠశాలను మోడల్ స్కూల్‌గా ఎంపిక చేశారు. జిల్లా పరిషత్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ప్రీప్రైమరీ స్కూళ్లు అన్నీ ఒకే ప్రాంగణంలో ఉండటంతో ఈ స్కూల్‌ను మోడల్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. పాఠశాల ఆవరణలో ఇంటర్నల్ రోడ్లు, ప్రహరీగోడ, క్రీడ స్థలాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాల ఆవరణ లో చేపట్టిన పనులను, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ అనంత్‌రెడ్డి, ఎంపిడిఒ బాల శంకర్ పాల్గొన్నారు.

## 18 వరకు కుష్ఠ వ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమాలు

రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి లలితాదేవి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లా వ్యాప్తంగా కుష్ఠ వ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమాలు విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి డాక్టర్ కె లలితాదేవి అన్నారు. మంగళవారం జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జాతీయ కుష్ఠ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని జిల్లా స్థాయి అధికారులు, వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి డాక్టర్ లలితాదేవి మాట్లాడుతూ ఈనెల 18 నుండి 31వరకు కుష్ఠ వ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆశ కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి లేప్రసి వ్యాధి లక్షణాల కోసం పరీక్షలు చేస్తారని చెప్పారు. అనుమానం ఉన్నవారిని దగ్గర లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తారని తెలిపారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పాపారావు మాట్లాడుతూ వ్యాధి వ్యాప్తి చెందే విధానం, లక్షణాలు, చికిత్స గురించి అవగాహన కలిపించారు. జిల్లా పారా మెడికల్ అధికారి సులోచన మాట్లాడుతూ కుష్ఠ వ్యాధి గుర్తింపు ఉద్యమంలో ప్రతీ రోజు సర్వే చేసే విధానం, రిపోర్ట్ ల తయారు చేసే పద్ధతి వివరించారు. కార్యక్రమంలో జిల్లాలోని ప్రోగ్రాం అధికారులు, ఉప జిల్లా వైద్య,ఆరోగ్య అధికారులు, వైద్యాధికారులు లేప్రసి సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, పాల్గొన్నారు.





## చెరువులు, కుంటలు, వాటర్ షెడ్ పనుల వివరాలు ఇవ్వండి

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింములు



**ప్రజాపక్షం/కొత్తూరు:** కన్హా శాంతివనంలో నామరూపాలు లేకుండా పోయిన చెరువులు, కుంటలు, వాటర్ షెడ్ పనులకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింములు కోరారు. మంగళవారం షాద్‌నగర్ నీటి పారుదలశాఖ కార్యనిర్వహణాధికారికి సమాచార హక్కు చట్టం ప్రకారం ధరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి సమావేశంలో బక్కని నర్సింలు మాట్లాడుతూ నందిగామ మండలం చేగూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన కన్హాశాంతి వనంలో అనేక చెరువులు, కుంటలు, వాటర్ షెడ్ పనులు నామరూపాలు లేకుండా చేశారన్నారు. అప్పటి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో ప్రత్యేకంగా నీరుమీరు కార్యక్రమం ద్వానా వాటర్ షెడ్ పనులు చేశామన్నారు. చెక్ డ్యామ్‌లు, పాటు కాలువలను పునరుద్ధరించామని, జన్మభూమి కార్యక్రమం ద్వారా చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టి భూగర్భ జలాలను పెంచడం జరిగిందని గుర్తు చేశారు. ఈ పథకాల్లో అప్పటి ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు సైతం పాల్గొన్నారని, చెరువులు, కుంటలు, వాటర్ షెడ్‌లు కలిగిన గ్రామం చేగూరు అని అన్నారు. కానీ నేడు చెరువులు, కుంటల నామ రూపాలు లేకుండా పోయాయని వివరించారు. చేగూరు, కన్హాశాంతివనంలోని చెరువులు, కుంటల వివరాలు ఇవ్వడంతోపాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ అధికారులను కోరారు.

# పల్లెల్లో పార్టీకి పూర్వవైభవం తేవడమే లక్ష్యం





బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పల్లెల్లో పార్టీకి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కెటిఆర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని 65మంది బిఆర్‌ఎస్ సర్పంచులు కెటిఆర్‌కు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులను కెటిఆర్ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజయ్యయాదవ్ సారథ్యంలో పనిచేసి పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ రెండేళ్ళ పాలనపై ప్రజలు పూర్తి అసంతృప్తితో ఉన్నారన్నారు. బిఆర్‌ఎస్ పదేళ్ళ పాలనలో గ్రామీణ ప్రాంతాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. వచ్చే ఎంపిటిసి, జడ్పిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పి వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ ఎంపిపి రవీందర్ యాదవ్, బిఆర్‌ఎస్ నేతలు వి.నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, మిట్టునాయక్, ఎమ్మె సత్యనారాయణ పాల్గొన్నారు.

### సర్పంచ్ చందునాయక్‌కు అభినందించిన కెటిఆర్

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్ చందునాయక్‌ను బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ భవన్‌లో ఫరూఖ్‌నగర్ మండలం ఉప్పరిగడ్డ గ్రామ సర్పంచ్ చందునాయక్, ఉప సర్పంచ్ ఈర్ల శ్రీలత తిరుపతయ్యలను శాలువాలతో సత్కరించారు. శభాష్ చందునాయక్..భవిష్యత్ చాలా ఉంది..గ్రామాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరిస్తే ముందు మంచి అవకాశాలు వస్తాయి.. అంటూ అలింగనం చేసుకొని సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతన సర్పంచులు పని చేయాలని సూచించారు. ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో సైతం బిఆర్‌ఎస్‌దే పైచేయి ఉంటుందని ఆశిస్తున్నామని, రెండేళ్ళ కాలంలో కాంగ్రెస్‌పై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని భవిష్యత్‌కు బాటలు వేద్దామన్నారు.

# క్రీడ

# కామెరూన్ గ్రీన్‌కు రూ.25.20 కోట్లు

ఐపిఎల్ వేలంలో కొనుగోలు చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్




## అభిగ్యాన్ డబుల్ సెంచరీ

### మలేషియాపై టీమిండియా భారీ విజయం!



అండర్ –19 ఆసియా కప్‌లో భారత కుర్రాడు అభిగ్యాన్ కుందు (209) డబుల్ సెంచరీతో చెలరేగాడు. మంగళవారం మలేషియా బౌలర్లను ఊచకోత కోస్తూ 9 సిక్సర్లతో రెచ్చిపోయి జట్టుకు భారీ స్కోర్ అందించాడు. వేదాంత్ త్రివేది(90) మెరుపులు తోడవ్వడంతో నాలుగొందలు కొట్టిన యువ భారత్ అనంతరం ప్రత్యర్థిని 93కే ఆలౌట్ చేసి.. 315 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. హ్యాట్రిక్ విజయాలతో అయుష్ మాత్రే సేన గ్రూప్ ఏలో అగ్రస్థానంతో సూపర్ 8కు చేరువైంది. అండర్–19 ఆసియా కప్‌లో భారత జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. ఇప్పటికే యూఏఈ, పాకిస్థాన్‌ను చిత్తు చేసిన టీమిండియా మూడో మ్యాచ్‌లో మలేషియాను వణికించింది. దుబాయ్‌లోని సెవెన్స్ అకాడమీలో మంగళవారం కుర్రాళ్లు చితక్కొట్టగా 7 వికెట్ల నష్టానికి 408 పరుగులు చేసింది టీమిండియా. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(50) అర్ధ శతకంతో శుభారంభమివ్వగా.. కెప్టెన్ ఆయుష్ మాత్రే(14), విహాన్ మల్హోత్ర(7) లు విఫలమయ్యారు. 87 పరుగులకే మూడు వికెట్లు పడిన వేళ భారత్ రెండొందలకు పైగా చేస్తుందనిపించింది.



కానీ, మలేషియా బౌలర్లపై విరుచుకుపడిన అభిగ్యాన్ కుందు(209 125 బంతుల్లో 17 ఫోర్లు, 9 సిక్సర్లు) డబుల్ సెంచరీతో, వేదాంత్ త్రివేది(90) అర్ధ శతకంతో కదంతొక్కగా కొండంత స్కోర్ కొట్టిన యువ భారత్.. ఆ తర్వాత బౌలర్ల విజృంభణతో ప్రత్యర్థిని 93కే ఆలౌట్ చేసింది. పాకిస్థాన్‌పై మూడు వికెట్లతో చెరేగిన దీపేశ్ దేవేంద్రన్ 5 వికెట్లతో మలేషియా నడ్డి విరిచాడు. ఉద్ధవ్ మోహన్ రెండు వికెట్లతో రాణించాడు.

పంతొమ్మిదో సీజన్ కోసం అబుధాబీలో నిర్వహించిన ఐపిఎల్ మినీ వేలంలో యువక్రికెటర్లు కళ్లు చెదిరే ధర పలికారు. ఆరంభంలోనే కామెరూన్ గ్రీన్ (రూ.25.20 కోట్లు), మథీశ పథిరన(రూ. 18కోట్లు)లు రికార్డు ధరకు అమ్ముడవ్వగా.. ఆ తర్వాత భారత కుర్రాళ్ల ప్రభంజనం కొనసాగింది. దేశవాళీలో అత్యుత్తమ ప్రదర్శనతో ఫ్రాంచైజీలను ఫిదా చేసిన ప్రశాంత్ వీర్, కార్తిక్ శర్మ అత్యధిక ధర పలికిన అన్‌క్యాప్డ్ ప్లేయర్లుగా అవతరించారు. ఆఖర్లో లియాం లివింగ్‌స్టోన్‌ను రూ.13 కోట్లకు కొనేసింది ఆరెంజ్ ఆర్మీ. దాంతో.. అతడు టాప్5లో చోటు సంపాదించాడు. అంచనాలను తలకిందులు చేస్తూ అనామకులకు పట్టంకట్టిన ఐపిఎల్ వేలం ఆద్యంతం ఆసక్తి రేపింది. చేతినిండా డబ్బులతో కోల్‌కతా నైట్ రైడర్స్ స్టార్ ప్లేయర్లు కామెరూన్ గ్రీన్, మతీశ పథిరనలను పట్టేసింది. దాంతో.. ఆరంభ సీజన్ నుంచి కొనసాగిన విదేశీ క్రికెటర్ల హవా ఈసారి కనిపించింది. అయితే.. ఆ తర్వాత నుంచి భారత యువకెరటాలు భారీ ధరతో వైరలయ్యారు. నిండా పాతికేళ్లులేని కుర్రాళ్లు అందర్నీ ఆశ్చర్యపరుస్తూ అబుధాబీలో హాట్‌కేకుల్లా అమ్ముడయ్యారు. రూ.30 లక్షల కనీస ధరతో యాక్షన్‌కు వచ్చిన ప్రశాంత్ వీర్, కార్తిక్ శర్మలు ఏకంగా రూ.14.2 కోట్లు కొల్లగొట్టారు. మధ్యప్రదేశ్ పేసర్ మంగేశ్ యాదవ్ ఏకంగా రూ.5.2కోట్లకు అమ్ముడయ్యాడు.



### టాప్-5లో వీళ్లే

కామెరూన్ గ్రీన్ – రూ.25.20 కోట్లు, కోల్‌కతా నైట్ రైడర్స్

మథీశ పథిరన – రూ.18 కోట్లు, కోల్‌కతా నైట్ రైడర్స్

కార్తిక్ శర్మ – రూ.14.20 కోట్లు, చెన్నై సూపర్ కింగ్స్

ప్రశాంత్ వీర్ – రూ.14.20 కోట్లు, చెన్నై సూపర్ కింగ్స్

లియాం లివింగ్‌స్టోన్ – రూ.13 కోట్లు, సన్‌రైజర్స్ హైదరాబాద్

### వీళ్లను కొనలే..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేలంపై భారీ ఆశలు పెట్టుకున్న క్రికెటర్లకు ఊహించని షాకిచ్చాయి ఫ్రాంచైజీలు. గతంలో మ్యాచ్ విజేతలుగా పేరొందిన బెయిర్‌స్టో, డెవాన్ కాన్వే, రహ్మనుల్లా గుర్బాజ్ వంటి హిట్టర్లను కనీస ధరకు కూడా ఎవరూ కొనలేదు. తెలుగు కుర్రాడు శ్రీకర్ భరత్‌ను సైతం వదిలేశారు. ఇక భారత అన్‌క్యాప్డ్ ప్లేయర్లలో శివం మావి, మహిపాల్ లొమ్‌రోర్, అన్మోల్‌ప్రీత్ సింగ్.. తదితరులు వేలంలో అమ్ముడుపోలేదు.

**భారత క్రికెటర్లు :**

విజయ్ శంకర్, ఆకాశ్ దీప్, సిమర్జిత్ సింగ్, రాజ్ లింబానీ, తుషార్ రహేజా, రుచిత్ అహిర్, సన్వీర్ సింగ్, కమలేష్ నగర్‌కోటి, తనుష్ కొటియాన్, మహిపాల్ లోమ్‌రోర్, రాజ్ వర్ధన్ హంగ్రేకర్, ఈడెన్ టామ్, ఆర్య దేశాయ్, యశ్ ధుల్, అభినవ్ మనోహర్, అన్మోల్‌ప్రీత్ సింగ్, అభినవ్ తెజ్రన, అథర్వ తైడే, శివం మావి, కేఎస్ భరత్, దీపక్ హుడా, కుమార్ కార్తికేయ సింగ్, విఘ్నేష్ పుతూర్,

# ఫోకస్ మహిళ

## 'అంబులెన్స్'కు జన్మనిచ్చిన మానవత్వం!



ఒక మహిళ కారణంగానే, నేడు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రాణాలు కాపాడుతున్న 'అంబులెన్స్' వ్యవస్థ ఏర్పడిందనడం కొంత ఆశ్చర్యం కలిగించేదే అయినప్పటికీ, అక్షర సత్యం. వివరాల్లోకి వెళితే.. అది న్యూయార్క్ నగరం... 1869 సంవత్సరం... నగరం ఎప్పటి మాదిరిగానే రద్దీగా ఉంది. ఫిఫ్త్ అవెన్యూలో ఒక మహిళ జనాల మధ్య నుంచి పరుగులు మొదలుపెట్టింది. చేతి సంచిని ఛాతికి బిగించి పట్టుకున్న ఆమె పేరు మేరీ జాక్‌జెవ్‌స్కా. వయసు 43 సంవత్సరాలు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అచేతనంగా పడివున్న ఓ వ్యక్తి వద్దకు వచ్చింది. అప్పటి వరకూ అతని చుట్టూ జనం ఉన్నారు... చూస్తున్నారు... మాట్లాడుతున్నారు... కానీ, సాయం చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. గాయపడ్డ వ్యక్తి దగ్గరికి చేరుకున్న మేరీ మోకాళ్లపై కూర్చునింది. 'అందరూ పక్కకు జరగండి' అంది శాంతంగా.. కానీ ధైర్యంగా. అక్కడే ఉన్న ఒక పోలీస్ 'మేడం ఇది మీ పనికాదు' అంటూ నవ్వాడు. కానీ, ఆమె పట్టించుకోలేదు. గాయపడిన వ్యక్తి పల్స్ పరిశీలించింది. శ్వాస చూసింది. వాహనం సిద్ధం చేయించుకొని, బాధితుడ్ని ఆసుపత్రికి తీసుకొచ్చింది. ఈ ఘటన మేరీని ఆ రాత్రంతా నిద్రకు దూరం చేసింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి తక్షణ వైద్య సేవలు అందకపోతే, ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని గుర్తించింది. ఏం చేయాలా? అని ఆలోచించింది. వృత్తిరీత్యా వైద్యురాలు కావడంతో, ప్రాణం కాపాడేందుకు ప్రయత్నించడం తన ధర్మంగా నమ్మింది. అత్యవసర సమయాల్లో బాధితులను ఆసుపత్రులకు తీసుకెళ్లడానికి ఒక వాహనాన్ని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలనే ఆలోచన రావడంతో, తన మిత్రులతోపాటు, స్థానికులతోనూ పంచుకుంది. కొందరు ఆమెను ఎగతాళి చేశారు. మరికొందరు నిరాశపరిచారు. ఇంకొందరు సున్నితంగా హెచ్చరించారు. కానీ, ఒకరిద్దరుతప్ప ఎవరూ సహకరించడానికి ముందుకు రాలేదు. కానీ, ఆమె ఆశ కోల్పోలేదు. ఆలోచన మార్చుకోలేదు. ఒకసారి ఓ చిన్నారిని అత్యవరంగా ఆసుపత్రికి తరలించడం, చనిపోయాడనుకున్న అతను కోలుకోవడం స్థానికంగా చర్చకుదారితీసింది. తక్కువ సమయంలోనే ఆమె ప్రారంభించిన 'అత్యవసర వాహనం' ఆలోచన న్యూయార్క్ సిటీదాటి అమెరికాలోని ఇతర ప్రాంతాలకూ వ్యాపించింది. బోస్టన్ అధికారికంగా వాహన సర్వీసును మొదలుపెట్టడంతో యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. మేరీ నెలకొల్పిన వ్యవస్థే నేడు 'అంబులెన్స్'గా మారింది. మేరీ ఎవరో చాలా మందికి తెలియకపోవచ్చు... చరిత్ర మరచిపోయి ఉండవచ్చు... కానీ, ఆమె ఆలోచనల నుంచి పుట్టిన 'అత్యవసర వాహనం' ఆలోచన ఇప్పుడు అంబులెన్స్ రూపంలో కనిపిస్తునే ఉంది. రోగాలబారిన పడనివారు.. ఏదో ఒక సమయంలో ఆసుపత్రికి హడావుడిగా తీసుకెళ్లాల్సిన అవసరం ఏర్పడని వారు దాదాపు ఎవరూ ఉండరు. కాబట్టి, వైద్యుల కంటే... ఆసుపత్రుల కంటే... ప్రతి మనిషీ ముందుగా మేరీకి కృతజ్ఞతలు తెలుపుకోవాలి.

## మహిళల్లో కీళ్ల నొప్పులు..



మహిళలకు కీళ్ల నొప్పులు సాధారణంగా కనిపించే సమస్య. వయసు, హార్మోన్ల మార్పులు, జీవనశైలి వంటి అనేక కారణాల వల్ల ఇది వస్తుంది. సరైన అవగాహనతో, చిన్న జాగ్రత్తలు పాటిస్తే చాలావరకు తగ్గించుకోవచ్చు. కీళ్ల నొప్పులకు కారణాల్లో ముఖ్యమైనది హార్మోన్ల మార్పులు. పీరియడ్స్, గర్భధారణ, మెనోపాజ్ సమయంలో ఈస్ట్రోజన్ తగ్గడం వల్ల కీళ్లలో నొప్పులు, కండరాలు బిగుసుకుపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. అదే విధంగా కాల్షియం, విటమిన్ 'డి' లోపం వల్ల ఎముకలు బలహీనపడి, కీళ్ల నొప్పులు ఎపెరుగుతాయి. మరో కారణమైన ఆస్టియోపోరోసిస్ (ఎముకల సాంద్రత తగ్గడం) ముఖ్యంగా మెనోపాజ్ తర్వాత మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. రెండు రకాల ఆర్థ్రైటిస్ (సంధి వాపు), రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, ఆస్టియోఆర్థ్రైటిస్ వంటివి కీళ్ల నొప్పులకు కారణం. అధిక బరువు కారణంగా మోకాళ్లు, నడుముపై అదనపు ఒత్తిడి పడటం కూడా కీళ్ల నొప్పులకు కారణం. వ్యాయామం లేకపోవడం, సరైన రీతిలో కూర్చోకపోవడం కూడా కీళ్ల వ్యాధికి కారణాలే. మానసిక ఒత్తిడి, నిద్రలేమి కారణంగా శరీరంలో వాపు పెరిగి నొప్పులు రావచ్చు. నిపుణులైన వైద్యులను సంప్రదించి, చికిత్స పొందడం ఒక్కటే ఈ సమస్య నివారణకు మార్గం. అలాగే, కాల్షియం ఎక్కువగా ఉండే పాలు, పెరుగు, నువ్వులు, విటమిన్ 'డి' అధిక మోతాదులో ఉండే గుడ్లు, (ఉదయపు ఎండలో కూర్చోవడం వల్ల కూడా శరీరానికి 'డి' విటమిన్ లభిస్తుంది, ఓమెగా3 లభించే ఆవాలు నూనె, చేపలు వంటిని ఆహారంలో చేరుకుంటే కొంత ఉపశమనం ఉంటుంది. రోజుకు కనీసం 20 నుంచి 30 నిమిషాలు నడక, యోగ, స్ట్రెచింగ్ వంటి తేలికపాటి వ్యాయామం అవసరం. సమతుల్య ఆహారం, శారీరక చురుకుదనంతో బరువును నియంత్రించుకోవాలి. వేడినీటి స్నానం వల్ల కీళ్ల నొప్పి కొంత తగ్గుతుంది. కూర్చునే విధానాన్ని మార్చుకోవడం కొంత మెరుగైన ఫలితాన్ని ఇవ్వచ్చు. నొప్పి ఎక్కువ రోజులు కొనసాగితే డాక్టర్‌ను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. ఏదిఏమైనా, తరచూ వచ్చే కీళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయకండి. ఇవి శరీరం ఇస్తున్న హెచ్చరిక కావచ్చు. సరైన జీవనశైలి, ఆహారం, వ్యాయామంతో మహిళలు దీర్ఘకాలిక ఉపశమనం పొందవచ్చు. ఆరోగ్యమే నిజమైన సంపద!

## హైకోర్టు ఆర్డర్ అమలు చేయాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** సిసిఐ ఆదిలాబాద్ ఎంప్లాయూస్ హైకోర్టు ఆర్డర్‌ను అమలు చేయాలని ఆదిలాబాద్ ఎంపి గోడం నగేష్, ఎఐటీయూసి రాష్ట్ర కార్యదర్శి, సిసిఐ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.విలాస్ కోరారు. ఈ మేరకు సిసిఐ చైర్మన్ సంజయ్ భాంగ్రాను మంగళవారం న్యూఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్ ప్రకారం ఎంప్లాయిమెంట్ వివిఎస్ బెనిఫిట్స్, డ్యూస్ తొందరగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు చైర్మన్ సానుకూలంగా స్పందించి కోర్టు ఆర్డర్‌ను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వారి వెంట ఏ.నిరంజన్‌రావు ఉన్నారు.

## 'రిమ్స్' సమస్యలు పరిష్కరించాలి

### ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** రిమ్స్‌లో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం రిమ్స్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పీఎఫ్, ఈఎస్‌ఐ బకాయిలు వెంటనే జమ చేయాలని, పెండింగ్ వేతనం చెల్లించాలని, కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సీనియార్టి ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అనసూయ, ఉమాలక్ష్మి, గంగామణి, మోహన్, ప్రమోద్, రాణి పాల్గొన్నారు.

## ఐఆర్‌కు ఎన్‌ఎఫ్‌సి ఉద్యోగుల నిరసన



**ప్రజాపక్షం/చర్లపల్లి :** కేంద్రప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లకు మద్దతుగా ఎన్‌ఎఫ్‌సి ఉదోగ్యులు మేడ్చల్ జిల్లా చర్లపల్లిలో ఎన్‌ఎఫ్‌సిఇఇ, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ పిలుపు మేరకు ఎన్‌ఎఫ్‌ఐ డబ్యూయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి రతన్‌సింగ్, ప్రెసిడెంట్ దేవాకుమార్, కార్యవర్గసభ్యులు, ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. 8వ వేతన సంఘానికి సంబంధించిన టర్మ్ ఆఫ్ రిఫరెన్స్ సవరణ, ఓల్డ్ పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ, 50 శాతం డిఏ/డిఆర్‌ను బేసిక్‌ఫే/పెన్షన్‌లో విలీనం చేయడం, 20 శాతం ఇంటరిమ్ రిలీఫ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బోర్డ్ ఆఫ్ ఆర్బిట్రేషన్ అవార్డును వెంటనే అమలు చేయాలని యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్ల చట్టబద్ధమైన డిమాండ్లపై స్పందన లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ప్రమాదపుటంచుల్లో సింగరేణి.. పరిరక్షణకు ఐక్య పోరాటం

### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

ప్రజాపక్షం/శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ రోజురోజుకు ప్రమాదపు అంచుల్లోకి వెళుతోందని, బహుళజాతి సంస్థల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకునేందుకు కార్మికులు ఐక్యంగా పోరాడాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్మికులు పోరాడి ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకున్నారని, వారి స్ఫూర్తితో సింగరేణి పరిరక్షణకు పార్టీలకు, యూనియన్లకు అతీతంగా సిద్ధం కావాలని కోరారు. బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేట్ పరం చేస్తూ బహుళజాతి సంస్థలకు అప్పజెప్పే కుట్రలు చేస్తోందన్నారు. సింగరేణి బ్లాకులను దక్కించుకోవడానికి ఆదాని, మెగా, ఏఎంఆర్ సంస్థలు టెండర్ ఫారాలు తీసుకున్నాయని, ఆ సంస్థలు సింగరేణిలో అడుగుపెట్టకుండా అడ్డుకుంటామన్నారు. దేశంలో వేలంలో పెట్టిన 41 బొగ్గు బ్లాకుల్లో మణుగూరు ఓసి 2, జికె ఓసి 2 ఉన్నాయని తెలిపారు. జెన్ కో సంస్థ సింగరేణికి బకాయి పడ్డ 41 వేల కోట్ల రూపాయలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల కష్టార్జితాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సిఎస్‌ఆర్, డిఎంఎఫ్‌టి పేరిట దుర్వినియోగం చేస్తోందని, అధికారులకు పిఆర్ పే విడుదలకు పర్సెంటేజీలు అడుగుతున్నారని ఆరోపించారు. సమావేశంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, సహాయ కార్యదర్శి కొమురయ్య, రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, పిట్ కార్యదర్శులు నర్సింగారావు, అసంత్ రెడ్డి, పరుశురాం, విజయలక్ష్మి, సదానందం, సురేష్, శ్రీకాంత్, వీరేశం పాల్గొన్నారు.






## బొగ్గు తవ్వకాలు అడ్డుకుంటాం

**పెద్దపల్లి :** సింగరేణి లో యాజమాన్యం గుర్తించిన బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి ఇవ్వకుండా టెండర్ ప్రక్రియ ద్వారా ప్రైవేటు సంస్థలకు ఇస్తే బొగ్గు తవ్వకాలను అడ్డుకుంటామని, సింగరేణి పరిరక్షణ సమితి పేరుతో అన్ని కార్మికసంఘాలను, రాజకీయపార్టీలను, కోల్ బెల్ట్ శాసనసభ్యులతో కలిసి పోరాటాలు, ఉద్యమాలు చేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ సింగరేణి బొగ్గు బ్లాక్స్ ప్రైవేటుకు వెళితే సింగరేణి మనుగడ కుంటుపడుతుందని, కార్మికులు, అధికారులు భవిష్యత్తు అంధకారంలోకి వెళుతుందన్నారు. సింగరేణికి బొగ్గు గనులు దక్కాలంటే కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేయాలని ఆయన కోరారు. సింగరేణిలో ఉన్న అన్ని కార్మిక సంఘాలు సింగరేణి పరిరక్షణ సమితి పేరుతో ఉద్యమాలు చేయడంతోనే మనుగడ కొనసాగుతుందన్నారు. సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, గౌతం గోవర్ధన్, మందల రాంచంద్రారెడ్డి, సిర్ర మల్లికార్జున్, దాసరి శ్రీనివాస్, ఇజ్జగిరి రాజు, దాసరి అనిల్, ఆజీం పాషా, ఆకుల సురేష్, కీర్తి శేఖర్, దేవేందర్‌రెడ్డి, బొల్లి శ్రీనివాస్, దోరగండ్ల మల్లయ్య, తొడుపునూరి రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

## కార్పొరేట్‌లకు లాభం కోసమే వేలం

**భూపాలపల్లి :** కార్పోరేట్ల కోసమే కోల్ ఇండియా వ్యాప్తంగా 41బొగ్గు బ్లాకులను కేంద్రం ప్రభుత్వం వేలం వేస్తుందని, దానిని ఒప్పుకునేదే లేదని, మణుగూరు పికె ఒసి2 డిప్ సైట్‌ని వేలం వేస్తే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మరో పోరాటం తప్పదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని విమర్శించారు. పీకే ఓ సీ2ను సింగరేణి దక్కించుకోకుంటే మణుగూరులో సింగరేణి మనుగడకే ప్రమాదం పొంచి ఉందన్నారు. మణుగూరు పికె ఒసి 2 ఒసి బ్లాక్ లలో సుమారు 60 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని, 167 హెక్టార్లలో బొగ్గు ఉందని, కంపెనీకి ఆదాయాన్ని తెచ్చి దాన్ని ప్రైవేట్ కంపెనీలకు వేలం వేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మణుగూరు పీకే ఓసి2 ని వేలం వేయడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సింగరేణి పరిరక్షణ కమిటీగా ఏర్పడి అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో పెద్ద ఎత్తున ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, బ్రాంచ్ వైస్‌ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, నూకల చంద్రమౌళి, నల్లసత్తి కుమారస్వామి బాబురావు, వెంకటస్వామి పాల్గొన్నారు.




# ఐక్యత, స్నేహాన్ని పెంపొందించడమే ఇస్కఫ్ లక్ష్యం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హనుమకొండ :** సమాజంలో భిన్న సంస్కృతులు, అనేక భాషలు, ఆచార అలవాట్లు కలిగిన విభిన్న ప్రజల మధ్య ఐక్యత కొరకు భారతదేశంతో స్నేహ సంబంధాలు కలిగి ఉండే ప్రపంచ దేశాల మధ్య స్నేహ భావాన్ని పెంపొందించి మన సంస్కృతి పట్ల, విశ్వాసాల పట్ల సానుకూల వైఖరి కలిగి ఉంటూ స్నేహ భావంతో విశ్వ మానవ కళ్యాణం కొరకు ఇండియన్ కల్చరల్ కోఆపరేటివ్ సొసైటీ ఇస్కఫ్ పనిచేస్తుందని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం హనుమకొండలో ఇస్కఫ్ సభ్యత్వ చేర్పింపు కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చిరునవ్వు పలకరింపు, స్నేహ భావం ఆధునిక యుగంలో కొరబడుతుందన్నారు. ఇస్కఫ్ ఆర్గనైజేషన్ ద్వారా దేశాల మధ్య సంస్కృతుల మధ్య, భిన్న భాషలు మతాల మధ్య సామరస్యాన్ని, స్నేహాన్ని పెంపొందింప చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 19న హనుమకొండ జిల్లా ఇష్కఫ్ మహాసభను, జనవరి 18న హైదరాబాదులో జరుగు ఇష్కఫ్ రాష్ట్ర మహాసభను, జనవరి 30,31న చెన్నైలో జరుగు ఇండియన్ కల్చరల్ కోఆపరేటివ్ సొసైటీ మహాసభలను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇష్కఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేదునూరి రాజమౌళి, టియుడబ్ల్యుజె జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, ఇస్కఫ్ సమన్వయ కార్యదర్శి దొమ్మాటి ప్రవీణ్ కుమార్, నవ చైతన్య బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, నాయకులు ఉస్మాన్ పాషా, సూర్యం వెంకటేశ్వర్లు, నగరబోయిన కావేరి తదితరులు పాల్గొన్నారు.






# స్థానికం REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఎన్నికలకు సమగ్ర బందోబస్తు
ఎస్పీ డి.జానకి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్/జడ్చర్ల :** స్థానిక సంస్థ ఎన్నికలలో భాగంగా బుధవారం జరగనున్న గ్రామపంచాయితీ మూడో విడత ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం జడ్చర్ల మండల కేంద్రంలో బిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఎన్నికల బందోబస్తు విధులకు హాజరైన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ డి.జానకి సమగ్ర బ్రీఫింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో పాటించాల్సిన చేయవలసినవి చేయకూడనివి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా జరిగేలా జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా వ్యవహరిస్తోందని జిల్లా ఎస్పీ డి.జానకి స్పష్టం చేశారు.

## కాంగ్రెస్‌లోకి క్యూ కడుతున్న ఇండిపెండెంట్ సర్పంచ్‌లు
కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల నియోజకవర్గంలో ఇండిపెండెంట్ (స్వతంత్ర్య) అభ్యర్థులుగా బరిలో నిలబడి సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా గెలుపొందిన వారు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోకి క్యూ కడుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నాయకత్వంలోనే తమ గ్రామాలను అభివృద్ధి చేసుకుంటామని ముందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రాజాపూర్, నవాబుపేట, మిడ్జిల్ మండలాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీలోకి చేరగా అనిరుధ్ రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

## నూతన సర్పంచ్‌లకు సన్మానం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ నియోజకవర్గం, హన్వాడ, మండలానికి చెందిన అత్యకుంట తాండా గ్రామ సర్పంచ్ జర్పుల లక్ష్మణ్, టంకర గ్రామాల సర్పంచ్, మెండె లక్ష్మి అచ్చెన్నలు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా ఎన్నికైన సర్పంచులను శాలువాలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే పరమావధిగా తీసుకోని విద్య, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, ఆరోగ్య వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి, అత్యకుంట తాండా గ్రామ ఉప సర్పంచ్ కుమార్, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా మూడో విడత ఎన్నికలు
జిల్లా ఎస్పీ డా.వినీత్



**ప్రజాపక్షం/మక్తల్:** మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ డా.వినీత్ పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పనిచేస్తూ, ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించాలని పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. నారాయణపేట జిల్లాలోని మక్తల్, మాగనూరు, కృష్ణ, ఉట్కూర్, నర్వ మండలాల్లో జరిగే సర్పంచ్ ఎన్నికల విధుల నిమిత్తం మక్తల్ పట్టణ కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో హాజరైన పోలీసులకు జిల్లా ఎస్పీ డా.వినీత్ భద్రతాపరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవ విడత ఎన్నికల కోసం 800 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్, హూల్‌హాక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, రఘునాథ్, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి



నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో 3వవిడతలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మూడోవిడత ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయి సంసిద్ధంగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలిపారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో చివరి 3వవిడతలో గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ మూడోవిడత ఎన్నికల కోసం 3629 పివోలు, ఓపిఓలతోపాటు వివిధ రకాల బాధ్యతలతో 6వేలమందికి పైగా ఎన్నికల అధికారులు మూడోవిడత ఎన్నికల్లో వివిధహోదాల్లో విధుల్లో పాల్గొంటున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో చివరివిడత గ్రామపంచాయతీ ఎన్నికలలో 158 గ్రామపంచాయతీలు ఉండగా, అమ్రాబాద్ మండలంలో 5 గ్రామపంచాయతీలకు, చారకొండ మండలంలో ఒక గ్రామపంచాయతీకి మొత్తం 6 సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు దాఖలుకాలేదని, 18 గ్రామపంచాయతీలు సర్పంచులు ఏకగ్రీవమయ్యాయని, మిగిలిన 134 గ్రామపంచాయతీలకుగాను 414మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటిలో ఉన్నారన్నారు. 1364వార్డులకుగాను అమ్రాబాద్‌లో 40వార్డులకు, చారకొండలో 8వార్డులకు నామినేషన్లు దాఖలుకాలేదని, 252వార్డులు ఏకగ్రీవమయ్యాయని, ఎన్నికలు జరిగే 1064వార్డులకుగాను 2707 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారని, ఆయా అభ్యర్థులకు ఎన్నికలు జరగనున్నట్లు తెలియజేశారు.

**చివరిదశ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించండి**

అచ్చంపేట మండలకేంద్రంలోని బర్కతుల్ల ఫంక్షన్‌హాలులో మూడోవిడత ఎన్నికల సిబ్బందికి సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సందర్శించారు.

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లను సందర్శించిన కలెక్టర్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న మండలాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను మంగళవారం సందర్శించి పోలింగ్ సామాగ్రి పంపిణీని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి పర్యవేక్షించారు. జిల్లాలో మూడవ విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి బాలానగర్, జడ్చర్ల, అడ్డాకుల, భూత్పూర్, మూసాపేట్, మండలాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కలెక్టర్ సందర్శించారు. పోలింగ్ సామాగ్రి పంపిణీ విధానం, రవాణా ఏర్పాట్లు, తదితర అంశాలను ఆమె సమీక్షించారు. బాలానగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జడ్చర్ల మండల కేంద్రంలోని బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.జానకి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి టైటస్ పాల్ తదితరులు పాల్గొన్నారు. తదుపరి అడ్డాకుల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. భూత్పూర్, మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు. మూసాపేట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారులు ఎంపిడిఓ, తాహసీల్దార్లు, ఎంఈఓలు తదితరులు ఉన్నారు.



# సమర్థవంతంగా చివరి దశ ఎన్నికలు



**ప్రజాపక్షం/ఉట్కూర్/మక్తల్/నారాయణపేట్:** జిల్లాలో తొలి, రెండో విడత గ్రామ పంచాయితీ ఎన్నికల పోలింగ్‌ను విజయవంతంగా ముగించినట్లే చివరి విడత ఎన్నికల పోలింగ్‌ను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం మూడో విడత ఎన్నికల పోలింగ్ సందర్భంగా పోలింగ్‌కు అవసరమైన సామాగ్రిని పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసిన ఉట్కూరు, మక్తల్ డిస్ట్రిబ్యూషన్/రిసెప్షన్ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో తొలి, రెండో విడత ఎన్నికల పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగించడంలో అధికారులు, పోలింగ్ సిబ్బంది కృషి అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. అయితే చివరి దశలో ఎన్నికల పోలింగ్ జరిగే ఉట్కూరు, మక్తల్, మాగనూరు, కృష్ణా, నర్వ మండలాల పరిధిలో ఇటీవల జరిగిన రెండు విడతల పోలింగ్ బూత్‌ల కంటే ఎక్కువ ఉన్నాయని, పోలింగ్ సిబ్బంది కూడా ఎక్కువగానే ఉన్నారని, బుధవారం జరిగే పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలిపారు. జిల్లాలోని కృష్ణ, మాగనూర్, మక్తల్, నర్వ, ఉట్కూర్ మండలాలలో జరిగే సర్పంచు వార్డు మెంబర్లు ఎన్నికకు ప్రణాళికబద్ధంగా రూట్ మ్యాప్ తయారు చేసినట్లు తెలిపారు.

## ఎన్నికల పారదర్శకతకు పకడ్బందీ ఏర్పాట్లు
కలెక్టర్ ఆదర్శ్ సురభి



**ప్రజాపక్షం/పెబ్బేరు:** మూడవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులతో తరలివెళ్లిన పోలింగ్ సిబ్బంది, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించిన జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వనపర్తి జిల్లాలో గ్రామ పంచాయితీ ఎన్నికలు మూడవ విడత ఎన్నికలు నిర్వహించనున్న 5 మండలాల్లో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రజలు తమ అమూల్యమైన ఓటును తమకు నచ్చిన అభ్యర్థికి వేసుకోవాలని జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం పెబ్బేరు, చిన్నంబావి, వీపనగండ్ల, పానుగల్, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను పరిశీలించారు. మూడవ విడతలో పెబ్బేరు మండలంలో 17 సర్పంచి, 141 వార్డు మెంబర్లు, చిన్నంబావి మండలంలో 16 సర్పంచి, 139 వార్డు మెంబర్లు, వీపనగండ్ల మండలంలో 14 సర్పంచి, 124 వార్డు మెంబర్లు, శ్రీరంగాపూర్ మండలంలో 8 సర్పంచి, 77 వార్డు మెంబర్లు, పానుగల్ మండలంలో 26 సర్పంచి, 221 వార్డు మెంబర్లు వెరసి 81 గ్రామ సర్పంచి, 702 వార్డు మెంబర్లకు బుధవారం పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు మల్లయ్య బట్టు పెబ్బేరు మండలంలో, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్.భీమ్యా నాయక్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పర్యవేక్షించారు. తాహసీల్దార్లు, ఎంపీఓలు తదితరులు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సన్మానం

**ప్రజాపక్షం/మల్దకల్:** మల్దకల్ మేజర్ గ్రామ పంచాయితీ ఎన్నికలలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన ఉప్పరి చిట్టెమ్మ గోపాల్, మూడవ వార్డు నుండి గెలుపొందిన గడ్డమీద సత్త్యమ్మ ఆంజనేయులు ఉపసర్పంచుగా ఎంపిక కావడంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య శాలువాతో ఘనంగా సన్మానించారు. మల్దకల్ గ్రామాభివృద్ధికి సంపూర్ణ సహాయ సహకారాలు అందజేస్తామని సరిత తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్



**ప్రజాపక్షం/మక్తల్ :** పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి మున్సిపల్ సిబ్బంది విధులు నిర్వహించాలని ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ తెలిపారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్‌గా ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ విధులు స్వీకరించిన అనంతరం మంగళవారం ఉదయం మక్తల్ పట్టణం 10 వ వార్డు అంబేద్కర్ నగర్ ప్రాంతంలో పర్యటించి పారిశుధ్య పనులను ప్రత్యేక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాలువల శుభ్రపరిచే పనులు, చెత్త సేకరణ, రోడ్ల పరిశుభ్రత తదితర పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి పనులు మరింత వేగవంతంగా నాణ్యతతో నిర్వహించాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పారిశుధ్య నిర్వహణ కొనసాగించాలని సూచించారు. స్థానిక ప్రజలతో మాట్లాడిన ఆయన, పరిశుభ్రమైన పరిసరాల కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# మూడవవిడత ఎన్నికలకు పటిష్టమైన భద్రత
జిల్లా ఎస్పీ సునిత రెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి:** గ్రామ పంచాయితీ చివరి ఘట్టం మూడవ విడత ఎన్నికలు జిల్లాలో పూర్తిగా ప్రశాంతంగా, నిర్భయంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ అత్యంత పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సునితరెడ్డి తెలిపారు. మొదటి, రెండవ విడతల ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతం ముగియడంలో పోలీసు అధికారులు, సిబ్బంది ప్రదర్శించిన క్రమశిక్షణ, అప్రమత్తత ప్రశంసనీయమని పేర్కొన్నారు. అదేస్థాయిలో మూడవ విడతలో పెబ్బేరు, పానుగల్, వీపనగండ్ల, చిన్నంబావి, శ్రీరంగాపూర్, మండలాలలో మొత్తం 87 గ్రామ పంచాయితీలకుగాను 06 గ్రామ పంచాయితీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగిత మొత్తం 81 గ్రామ పంచాయితీలకు 1300 మంది పోలీసు అధికారులు సిబ్బందిచే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని ప్రతి ఒక్కరు బాధ్యతతో విధులు నిర్వహించి ఎన్నికల విజయానికి తోడ్పడాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతియుత ఎన్నికలు భద్రమైన ప్రజాస్వామ్యం లక్ష్యంగా పోలీసు సిబ్బంది రాత్రింబవళ్లు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, డీజేలు, బాణాసంచాకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు.

# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం మాట్లాడారు. రెండు విడతల సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి ఫలితాలు వచ్చాయని అన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఆదరించడంతో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలుపొందినట్లు తెలిపారు. మూడో విడత ఎన్నికల్లో కూడా గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా నిలిచి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎవరి జనాభా ఎంతనో వారికి అంతస్థాయిలో వాటా ఉండాలన్న రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే అమలు చేయలేదన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ మాట్లాడుతూ బీహార్లో ఆయూష్ సర్టిఫికెట్ల పంపిణీలో సీఎం నితిష్ కుమార్ ఓ ముస్లిం మహిళ హిజాబ్‌ను తీసివేయడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. నితీష్ కుమార్ చేసిన చర్యపై దేశంలోని ప్రజాస్వామికవాదులు, మేధావులు తీవ్రంగా ఖండించాలని కోరారు. సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, నాయకులు సీజే బెనహర్, అజ్మత్ అలీ, రాయులు యాదవ్, బాలస్వామి, కంచిమి లక్ష్మణ్, ప్రవీణ్ కుమార్, మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

## అభ్యర్థి ఇంటిముందు క్షుద్రపూజలు



**ప్రజాపక్షం/మక్తల్:** సర్పంచ్ ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు ఎంత దూరం అయినా వెళుతున్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు డబ్బు, మద్యం పంచడంతో పాటు తేడా వస్తే ప్రత్యర్థులపై దాడులకు సైతం పాల్పడుతున్నారు. ఇక తాజాగా నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాచ్ వార్ గ్రామంలో వింత ఘటన చోటు చేసుకుంది. ఎన్నికల్లో గెలిచేందుకు తమ ఇంటి ముందు క్షుద్రపూజలు చేశారని బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటమ్మ ఆరోపించారు. ఇంటి ముందు తెల్ల ఆవాలు, చనిపోయిన తరువాత మృతదేహాలపై చల్లే స్ప్రే, మొలకెత్తిన గింజలు, ఇసుక చల్లారని చెప్పారు. తమ ఇంటిముందే కాకుండా తమకు మద్దతు ఇస్తున్నవారి ఇంటి ముందు కూడా ఇలానే క్షుద్రపూజలు చేస్తున్నారని ఆరోపించారు. ఏమైనా ఉంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని కానీ ఇలాంటి పనులు చేయవద్దని అన్నారు. తమకు ఏమైనా జరిగితే తమపై పోటీ చేసిన అభ్యర్థిదే బాధ్యత అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక కాచువార్ గ్రామంలో సర్పంచ్ పదవికి బీసీ మహిళా రిజర్వేషన్ కేటాయించబడింది. అయితే బరిలో నిలిచిన మహిళ అభ్యర్థి మామనే ఈ పనిచేసినట్లు ఒప్పుకున్నాడు. తన కోడలు గెలుపు కోసమే ఇలా చేశానని గ్రామస్తుల ముందు చెప్పాడు. మరోవైపు ప్రత్యర్థి భర్త ఇప్పటికే తనకు గుండె నొప్పి వస్తుందంటూ అంబులెన్స్‌లో మక్తల్ ఆస్పత్రికి వెళ్లాడు. మెరుగైన వైద్యం కోసం అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన గ్రామంలో కలకలం రేపుతోంది. దీంతో ప్రచారం అభ్యర్థివైపు చూసేందుకు ప్రజలు భయపడుతున్నారు. బుధవారం ఇక్కడ ఎన్నికలు జరుగనుండడంతో ఎవరు గెలుస్తారు అన్నది ఆసక్తికరంగా మారింది.

## కుక్కలదాడిలో గొర్రెపిల్లలు మృతి



**ప్రజాపక్షం/వంగూర్ :** కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి చెందిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని జాజాలగ్రామంలో చోటు చేసుకుంది. గ్రామసర్పంచ్ కాశమ్మసైదులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొప్పునూరు చిన్న తమ వ్యవసాయ పొలంలో గొర్రెపిల్లలు మేస్తుండగా కుక్కలు దాడి చేయడంతో 8 గొర్రెపిల్లలు మృతి చెందాయని బాధితుడు తెలిపారు. గ్రామాలలో కుక్కల బెడద ఎక్కువ కావడంతో ఇలాంటి సంఘటనలు తరుచు జరుగుతున్నాయని గ్రామసర్పంచ్ పేర్కొన్నారు.

## ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటా




**ప్రజాపక్షం/వెల్దండ/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ గ్రామప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మట్టయాదమ్మ వెంకటయ్యగౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామప్రజలందరూ తనమీద నమ్మకంతో ఓట్లువేశారని, వారి నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లో వమ్ముచేయనని, బిఆర్ఎస్ బిజెపి మిత్రపక్షాల అభ్యర్థి కానుగుల కన్యాకుమారికి 1367 ఓట్లు పోలవగా, తనకు 2617 ఓట్లు నమోదయ్యాయని గుర్తుచేశారు. అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి మనప్రాంతవాసి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవడం, దీనికితోడు కల్వకుర్తి అభివృద్ధి ప్రదాత కసిరెడ్డినారాయణరెడ్డి సహకారంతో ప్రణాళికబద్ధంగా గ్రామ అభివృద్ధి చేస్తానని చెప్పారు. గ్రామంలో ఉన్న యువతీ యువకులకు నాణ్యమైన విద్యను, వైద్యం అందించేందుకు తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు.

## పోషక పదార్థాలపై అవగాహన

**ప్రజాపక్షం/మద్దూర్ :** మండల పరిధిలోని పోర్లకుంట తాండ గ్రామంలోని పాఠశాల దగ్గర మంగళవారం ఆహారంలో పోషకపదర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుస్థిర వ్యవసాయ సంస్థ రాష్ట్ర కొఆర్డినేటర్ ఉపేంద్ర, గ్రామ సర్పంచ్ దశరథ్ మాట్లడుతూ మనం తినేటటువంటి వివిధ రకాల ఆకుకూరలను కూరగాయలను ,పప్పు దినుసులను ,పండ్లను వాటి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. స్టాల్ ద్వారా ఏర్పాటు చేసి డాక్టర్ సలోమి క్లుప్తంగా వాటిలో ఉండేటటువంటి వివిధ రకాల పోషకాలు అవి మన శరీరానికి ఏ విధంగా ఉపయోగపడతాయి, ఒక్కోక్క కూరగాయను ఆకుకూరలను పండ్లను చూస్తు వివరించారు. మనము తినేటటువంటి ఆహారంలో అన్ని రకాల పోషకాలు ఉండాలి దీనివలన మన ఆయుష్షు పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సుస్థిర వ్యవసాయ సంస్థ సోషల్ మొబిలైజర్ వెంకటయ్య, రైతుదారుల ఉత్పత్తిదారుల చైర్మెన్ నాగరాజు, డైరెక్టర్ పూర్యనాయక్ ,దోరెప్ప గ్రామ ప్రజలు తదితరులు పాల్గోన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటిన బిఆర్ఎస్
మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల నియోజకవర్గం నవాబ్ పేట మండల కేంద్రంలో నూతనంగా విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లను మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో పోరాడి విజయం సాధించిన వారికి అభినందనలు తెలిపారు. ఓడిపోయిన వారు అధైర్య పడొద్దని రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో చేపట్టిన అభివృద్ధి పనులు మాత్రమే కనిపిస్తున్నాయని. కాంగ్రెస్ రెండేళ్లలో గ్రామాలకు చేసిందేమీ లేదన్నారు. ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో విజయం సాధించడం ప్రభుత్వం పాలన వైఫల్యానికి నిదర్శనమన్నారు. ముఖ్యంగా జడ్చర్ల నియోజకర్గంలో ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ సత్తా చాటిందన్నారు. మొదటి విడతలో అధికార పార్టీ కంటే ఎక్కువ స్థానాలు కైవసం చేసుకుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కి నిరంతరం కృషి చేయాలని నూతనంగా గెలిచిన సర్పంచ్‌లకు పిలుపునిచ్చారు.



# స్థానికం REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## వ్యాపారస్తులకు తప్పనిసరిగా లైసెన్స్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** బంగారం వ్యాపారం చేసే దుకాణదారులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని ఆల్ మార్క్ రిప్రజంటేటివ్ భారతీయ ప్రమాణాల బ్యూరో ప్రశాంతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంతటి విజయ్ ఫంక్షన్ హాల్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) హైదరాబాద్ శాఖ, సూర్యాపేట బులిటెన్ మర్చంట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఆల్‌మార్క్ బంగారు ఆభరణాల అమ్మకాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కేవలం వ్యాపార అంశాలకే కాకుండా వినియోగదారుల హక్కుల పరిరక్షణ, వ్యాపార పారదర్శకతపై అవగాహన కలిగి ఉండలన్నారు. ఈ సందర్భంగా స్క్రీన్‌పై వ్యాపారస్తులకు నిబంధనల వివరాలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ ఓగూరి వీరయ్య, సూర్యాపేట బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు అంతటి విజయ్, ప్రధాన కార్యదర్శి సింహాద్రి, కోశాధికారి బూర్ల మధుసూదన్ పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ పంచాయతీ ఎన్నికలలో బాధ్యతగా ఓటేయాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్/మేళ్లచెరువు:** ప్రతి ఒక్కరు పంచాయతీ ఎన్నికలలో బాధ్యతగా ఓటేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ కోరారు. మంగళవారం హుజూర్‌నగర్ మండలం వేపలసింగారంలో ఏర్పాటు చేసిన ఎకో ఫ్రెండ్లీ పోలింగ్ కేంద్రాలను, మేళ్లచెరువులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మూడో విడత పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సామాగ్రితో సిబ్బంది ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం జరిగిందని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. పోలింగ్ సమయంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగావిధులు నిర్వహించాలని, పటిష్ట బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. వేపలసింగారం గ్రామంలో 14వ వార్డు లలో 4396 మంది ఓటర్లు, అలాగే మేళ్లచెరువు గ్రామంలో 16 వార్డు లలో 10657 మంది ఓటర్లు ఉన్నారని, ఓటు వేసిన వారు ఓటు వేసేందుకు వచ్చిన వారికి అన్ని మౌళిక వసతులు కల్పించాలని, దివ్యాంగుల కోసం విల్ చైర్ ఏర్పాటు చేయాలని అదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీనివాసులు, ఎంపిడివో సుమంత్‌రెడ్డి, అస్గల్‌అలీ, తహసిల్దార్ కవిత, రాజేందర్‌రెడ్డి, ఎంపివో లావణ్య, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, ఫరిద్, ఆర్వోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దు

కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరిక

**ప్రజాపక్షం/నల్లగొండ:** గ్రామపంచాయతీ చివరి విడత ఎన్నికలను ఆషామాషీ గా తీసుకోవద్దని, ఎన్నికలు పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.మంగళవారం ఆమె మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న దేవరకొండ డివిజన్ పరిధిలోని గ్రామపంచాయతీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు,రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ దేవరకొండ ఆర్డిఓ, డిపిఓ,జెడ్ పి సీఈఓ లతో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించే విషయమై నిర్వహించారు. కొంత మంది ఆర్ఓ ల నిర్లక్ష్యం కారణంగా మొదటి, రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో అక్కడక్కడ ఇబ్బందులు తలెత్తాయని ఈ విడత అలాంటి సమస్యలు రాకుండా ఎన్నికలు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాల ఏర్పాటు, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటనలో ఆర్ ఓలు ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. పోలింగ్, కౌంటింగ్ నిర్వహణలో లోపాలు కనిపిస్తే సంబంధిత ఆర్ఓ,ఎంపీడీవోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ సందర్భంగా ఎక్కడ సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా రీ కౌంటింగ్ అవసరమైతే జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. రీకౌంటింగ్ నిర్వహించే బాధ్యత పూర్తిగా ఆర్ ఓ నిర్ణయం పైన ఆధారపడి ఉంటుందని అన్నారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఫలితాల ప్రకటనలో అనవసరంగా జాప్యం చేయవద్దని చెప్పారు.ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య ,జెడ్‌పిసిఈఓ శ్రీనివాసరావ్ లు ఉన్నారు.

## డాక్టర్ ఎ.యస్.రావు పరీక్షలో 'జయ' ప్రభంజనం




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలో కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ఐఐటి ఫౌండేషన్‌కు కొలమానంగా పరిగణించబడుతున్న డాక్టర్ ఎ.యస్.రావు వారు 9, 10 తరగతుల వారికి నిర్వహించిన 35వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ మొదటి లెవెల్‌లో జయ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్ తెలిపారు. తమ విద్యార్థులు 1, 1, 2, 6, 6, 8, 10, 10 ర్యాంకులు సాధించడంతో పాటు రెండు రాష్ట్రాలలో సెలెక్టయిన మొత్తం 248 మంది విద్యార్థులలో 110 మంది జయ స్కూల్ విద్యార్థులు ఉండడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మంగళవారం అర్హత సాధించిన విద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయులను డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతిలతో కలిసి అభినందించారు. తమ యొక్క అత్యుత్తమ ప్రోగామ్ ద్వారా తమ విద్యార్థులు భవిష్యత్తులో ప్రతిష్టాత్మక ఐఐటిలలో కూడా ప్రవేశాలు సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. తమపై విశ్వాసాన్ని ఉంచి అన్ని విధాల సహకరిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## తొౌట్ల మల్లమ్మది అసమాన త్యాగాల చరిత్ర

**ప్రజాపక్షం/నూతనకల్ :** నూతనకల్ ప్రాంతంలో తొౌట్ల మల్సూరు మల్లమ్మ దంపతులది అసమాన త్యాగాల చరిత అని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం నూతనకల్ మండలంలోని చిల్పకుంట్ల గ్రామంలో తొౌట్ల మల్లమ్మ ఇటీవల వయోభారంతో మరణించగా ఆమె కుమారుడు నూతనకల్ మండల సిపిఐ కార్యదర్శి తొౌట్ల ప్రభాకర్‌ను పరామర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో నాడు తెలంగాణ సాయుధ పోరాటం మొదలుకొని నేటి వరకు జరిగిన అన్ని ప్రజాఉద్యమాల్లో తొౌట్ల మల్సూరు మల్లమ్మ దంపతులది ప్రధాన పాత్ర అన్నారు. నేడు వారి కుమారుడు అన్ని ప్రజా ఉద్యమాల్లో ముందు ఉండడం పట్ల ఆయన అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లంల యాదగిరి, మండవ వెంకటేశ్వర్లు, మండల సిపిఐ కార్యదర్శి తొౌట్ల ప్రభాకర్, బిసి హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు గురుస్వామి ఉన్నారు.



# తప్పులు చేస్తే కఠిన చర్యలు

తప్పులు లేకుండా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచన

డిఆర్‌సి కేంద్రాన్ని సందర్శించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/దేవరకొండ:** ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పోలింగ్ సిబ్బందికి సూచించారు. మంగళవారం కలెక్టర్ దేవరకొండ లో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన డిఆర్సీ కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని, పోలింగ్ సిబ్బంది సకాలంలో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను చేరుకొని అవసరమైన ఏర్పాట్లు ముందే చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికలలో తప్పు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి పొరపాట్లు జరగకూడదని, ముఖ్యంగా పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ కంపార్ట్‌మెంట్ కిటికిలకు దూరంగా ఏర్పాటు చేయాలని, అలాగే సరైన విధంగా వెలుతురు ఉండేలా చూసుకోవాలని అన్నారు. పోలింగ్ బూత్ లో ముగ్గురు కంటే మించి ఓటర్లు ఉండకూడదని తెలిపారు. పోలింగ్ పూర్తి అయిన తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు తప్పనిసరిగా ఓట్ల లెక్కింపు ప్రారంభించాలని, లెక్కింపు పూర్తయిన తర్వాత ఎన్నికల ఫలితాలను వెంటనే ప్రకటించాలని అన్నారు. పోలైన బ్యాటెట్లతో పాటు, పోల్‌కానీ బ్యాలెట్లు సైతం పూర్తిగా కాపాడే బాధ్యత స్టేజ్2 ఆర్ఓలపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమె టెండర్ ఓట్ల ప్రాముఖ్యతను, టెండర్ ఓట్ల ప్రక్రియ విధానాన్ని తెలియజేశారు. పోలింగ్ కేంద్రం లే అవుట్ పరిశీలించిన తర్వాత అతిపెద్ద రెండవ గదిని కౌంటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఏజెంట్లకు కౌంటింగ్ టేంటింగ్ మధ్యలో బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా కౌంటింగ్ పూర్తి చేయాలని, కౌంటింగ్‌లో జాప్యం జరిగితే చీకటి పడి తప్పులు జరిగేందుకు అస్కారం ఉందని, అందువల్ల కౌంటింగ్‌కు సాధ్యమైనన్ని ఎక్కువ ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రహరీ లేకుంటే తాత్కాలిక కంచె వేసుకోవాలని, సాధ్యమైనంత త్వరగా ఎన్నికలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ పోలింగ్, కౌంటింగ్‌లపై సూచనలు చేశారు. దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డిపిఓ వెంకయ్య, జెడ్పిసిఈవో శ్రీనివాస్‌రావు ఇతర అధికారులు ఉన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ పోలింగ్ సిబ్బంది దగ్గరకు వెళ్ళి వారితో మాట్లాడడమే కాకుండా బ్యాలెట్ బాక్సులను ఓపెన్ చేయించారు. అంతకు ముందు ఆర్డీవో కార్యాలయంలో 17న జరగనున్న మూడవ విడత ఎన్నికలకు ఆయా మండలాలకు కేటాయించే జిల్లా అధికారులు, ప్రత్యేకఅధికారుల, ఎంపిఓల నియామకంపై చర్చించారు.

# మూడో విడత ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత



పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలు

9మండలాల్లోని 269 గ్రామ పంచాయితీలలో ఎన్నికలు

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు : జిల్లా ఎస్పి

**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లాలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.దేవరకొండ నందు సిబ్బందికి ఎన్నికల విధులపై బ్రీపింగ్ కార్యక్రమం లో మాట్లాడుతూ..రేపు 17వ తేదీన మూడో విడత దేవరకొండ డివిజన్ పరిధిలోని దేవరకొండ,చింతపల్లి,కొండమల్లేపల్లి, డిండి,చందంపేట,గుడిపల్లి, గుర్రంపోడు, నేరేడుకొమ్ము, పిఏ పల్లి మొత్తం 09 మండలాల్లోని 269 గ్రామ పంచాయితీలలో 2206 పోలింగ్ కేంద్రాలలో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఎన్నికలను ప్రశాంత వాతారణంలో నిర్వహించేదుకు ప్రతి మండలానికి సూమరు 200 చొప్పున 2000 మంది పోలీస్ సిబ్బందితో ప్రతి మండలానికి ఒక డియస్పి స్థాయి అధికారి పర్యవేక్షణలో రూట్ లుగా విభజించి ఎలాంటి సమస్యలు తలెత్తిన తక్షణమే అక్కడికి చేరుకునుని పరిష్కరించుటకు సీఐ,ఎస్.ఐ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్,స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేసి అన్ని రకాల భద్రత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్‌పి వివరించారు. ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని ఐదుగురు అంతకంటే ఎక్కువ గుమికూడరాదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు అన్ని శాఖలతో సమన్వయంతో పని చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పూర్తి పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ఏ వ్యక్తికి గాని,పార్టీకి గాని మ ద్దతు ఇచ్చినట్లు దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

# శాంతిభద్రతల పరిరక్షణే పోలీస్ లక్ష్యం

అంకితభావంతో విధులు నిర్వహించాలి

సూర్యాపేట జిల్లా ఎస్పి నర్సింహ



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా పోలీసులు పని చేస్తున్నారని సూర్యాపేట జిల్లా ఎస్పి కె.నర్సింహ అన్నారు. మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం గరిడేపల్లి మండల పరిధిలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి గరిడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని ఎస్‌పి సూచించారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడడంలో పోలీస్ సిబ్బంది పాత్ర కీలకమని ఎస్‌పి తెలిపారు. గరిడేపల్లి మండలంలో మొత్తం 10 రూట్లు, 26 గ్రామాల్లో 49 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో 5 సిఐలు, 9మంది ఎస్ఐలు, 160 మంది ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు, హోంగార్డులతో కలిపి మొత్తం 170 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలు గుమికూడవద్దని, పొనుగోడు, వెలిదండ,గడ్డిపల్లి, కుతుబ్షాపురం, గానుగబండ, గారకుంటతండా, కల్మల్‌చెర్వు, శీత్లాతండా, సోమ్లాతండా, లుంబతండా, రాయనిగూడెం, రంగాపురం, కీతవారిగూడెం గ్రామాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు, మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, గరిడేపల్లి ఎస్ఐ నరేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య మృతి

స్వగ్రామం మద్దిరాల మండలం ముకుందాపురంలో నేడు అంత్యక్రియలు

అమీర్‌పేట అపోలో ఆసుపత్రిలో భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించిన సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/సూర్యాపేట (మద్దిరాల) :** సిపిఐ సూర్యాపేట జిల్లా సమితి సభ్యులు, రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య (85) మంగళవారం హైదరాబాద్‌లోని అమీర్‌పేట అపోలో ఆసుపత్రిలో మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. నూతనకల్ మండల వైస్ ఎంపిపిగా, జడ్‌పిటిసిగా, ముకుందాపురం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై ప్రజలకు సుదీర్ఘకాలంపాటు సేవలందించారు. సిపిఎం తుంగతుర్తి డివిజన్ కార్యదర్శిగా కూడా ఆయన పనిచేశారు. గత ఐదేండ్ల క్రితం ఆ పార్టీని వీడిన ఆయన సిపిఐలో చేరారు. పార్టీ జిల్లా సమితి సభ్యునిగా, రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఆయన కొనసాగుతున్నారు. లక్ష్మయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

నేడు స్వగ్రామం ముకుందాపురంలో అంత్యక్రియలు...

**హాజరుకానున్న సిపిఐ నేతలు...** మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామంలో కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య అంత్యక్రియలు నేడు (బుధవారం) ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ అంత్యక్రియలకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతోపాటు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరుకానున్నట్లు చెప్పారు.

**అమీర్‌పేట్ అపోలో ఆసుపత్రిలో భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించిన సిపిఐ నేతలు..**

కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య మరణ వార్త తెలుసుకున్న సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ మునుగోడు ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్‌లు హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ అపోలో ఆసుపత్రికి వెళ్ళి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

**అస్తమించిన ఎర్ర సూరీడు**

**ప్రజాపక్షం/నూతనకల్ (మద్దిరాల) :** సూర్యాపేట జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాయకుడు లక్ష్మయ్య ఎర్ర సూర్యుడు లాంటి వాడని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామంలో ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి వారు మాట్లాడుతూ మూరగుండ్ల లక్ష్మయ్య ఎర్రజెండా భుజాన వేసుకొని తన యుక్త వయస్సు నుంచి చివరి శ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారమే ఏజెండగా జీవించారన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంత దొరల భూముల పంపిణీ కోసం ప్రస్తుతం కబ్జాలో ఉన్న చిన్నకారు, సన్నకారు రైతాంగానికి ప్రభుత్వ పట్టాలు ఇప్పించేందుకు అనేక భూ పోరాటాలు నిర్వహించిన ఘనచరిత్ర ఆయన సొంతం అన్నారు. తుంగతుర్తి జడ్‌పిటిసిగా, సిపిఐ జిల్లా నాయకుడిగా, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం ప్రజాజీవితంలో గడిపాడన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్, సిపిఐ తుంగతుర్తి నియోజక వర్గ ఇంచార్జి ఎల్లంల యాదగిరి, సిపిఐ జిల్లా కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, బిసి హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కె వెంకట్, రైతు సంఘం నాయకులు తప్పిరాల శ్రీకాంత్, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు గురుస్వామి ఉన్నారు.

**కామ్రేడ్ మూరగండ్ల లక్ష్మయ్య మృతి తీరనిలోటు**

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్రరైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు, సీనియర్ కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య మృతి తీరనిలోటు అని రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి గౌరవ అధ్యక్షులు కొప్పోజు సూర్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బోల్లు ప్రసాద్ , అధ్యక్షులు దొడ్డా వెంకటయ్యలు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో కామ్రేడ్ లక్ష్మయ్యకు ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్, మామిడి నర్సయ్య, జక్కుల రమేష్, త్రిపురాల శ్రీకాంత్, పాపిరెడ్డి పాల్గొన్నారు.





## హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి 'ఆర్ఆర్టీఎస్' అత్యవసరం

కేంద్రానికి భువనగిరి ఎంపి చామల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** హైదరాబాద్ మహానగరంతో పాటు చుట్టుపక్కల జిల్లాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్టీఎస్)ను తక్షణమే మంజూరు చేయాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని బలంగా కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన 'హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్' పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మగుంట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ఉన్నత స్థాయి సమీక్షలో, ఆర్ఆర్టీఎస్ ఎన్సిఆర్టిసి పాత్ర అనే అంశంపై రూపొందించిన నివేదిక సిఫార్సుల అమలుపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర మౌలిక వసతులపై తన వాణిని వినిపించారు. హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తోందని, కేవలం నగరాన్ని మాత్రమే కాకుండా దానికి ఆనుకుని ఉన్న సుమారు 8 జిల్లాలను కలుపుతూ రవాణా వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు.

'రాబోయే రెండు దశాబ్దాల్లో పెరిగే జనాభా అవసరాలను తీర్చడానికి, ట్రాఫిక్ కష్టాల నుంచి నగరాన్ని కాపాడటానికి ఆర్ఆర్‌టిఎస్ ఒక సంజీవనిలా పనిచేస్తుంది. దీనివల్ల హైదరాబాద్‌పై జనాభా ఒత్తిడి తగ్గి, భువనగిరి వంటి చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ జరుగుతుందని ఆయన వివరించారు.

**పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం ఎప్పుడు? :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి పంపిన మూడు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు అనుమతుల కోసం వేచి ఉన్నాయని ఎంపీ చామల కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర సమగ్ర వికాసానికి రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్, మెట్రో ఫేజ్2 ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మెట్రో విస్తరణ వల్ల నగరంలో ప్రజా రవాణాను మరింత విస్తరించడానికి పర్యావరణ హితమైన అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఈ ప్రాజెక్టుల విషయంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కమిటీని కోరారు.

## నేడు ఆఖరి పోరు

7 మండలాల పరిధిలో 124 గ్రామ పంచాయతీ సర్పంచ్, 1061 వార్డు స్థానాలకు పోలింగ్


ఓటు హక్కు వినియోగించుకోనున్న 19,2617మంది ఓటర్లు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పంచాయతీ ఎన్నికలు చివరి దశకు చేరుకున్నాయి. ఆఖరిపోరు ఎన్నికలు హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మొత్తం 7 మండలాల పరిధిలో నేడు జరగనున్నాయి. మొత్తం 146 గ్రామ పంచాయతీ సర్పంచులకు, 1318 వార్డులకు ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయగా ఇందులో ఇప్పటికే 22 సర్పంచ్ , 257 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. దీంతో 124 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు, 1061 వార్డు సభ్యుల ఎన్నికకు అధికారులు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ 7 మండలాల పరిధిలో మొత్తం 1,92,617 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకోనున్నారు. ఇందులో పురుషులు 93658,మహిళలు 98952, ఇతరులు 7 ఉన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. 1176 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని కేటాయించారు. పోలింగ్ సామాగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఉదయం 7 గంటల నుండి మద్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. మద్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రీయ మొదలు కానుంది. సాయంత్రం నాలుగు గంటల లోపే తొలి ఫలితం రానుంది. మేజర్ గ్రామ పంచాయతీలు ఎక్కువగా ఉండటంతో రాత్రి పోద్దుపోయేంత వరకు కౌంటింగ్ ప్రక్రీయ కొనసాగే అవకాశం ఉండటంతో ఫలితాలు మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్పి కె.నర్సింహలు ఎన్నికలు జరిగే ఆయా మండలాల్లోని గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్లను సందర్శించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 1500 మంది పోలీస్ సిబ్బందిని కేటాయించి బారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. నిఘా నేత్రాల మద్య ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

# రీల్

## 25న 'వృషభ' విడుదల



మోహన్ లాల్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం 'వృషభ'. తాజాగా ఈ చిత్రం నుంచి 'అప్పా..' అనే సాంగ్‌ను విడుదల చేశారు. తండ్రీ కొడుకుల మధ్య ఉండే పవిత్రమైన, గొప్ప అనుబంధాన్ని తెలియజేసే ఈ పాట సినిమా కథకు వెన్నెముక లాగా ఉంటుంది. సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తోన్న ఈ చిత్రంలోని ఈ పాటను హిందీ, కన్నడ, తెలుగులో విజయ్ ప్రకాష్.. మలయాళంలో మధు బాలకృష్ణన్ పాడగా, సాహిత్యాన్ని మలయాళంలో వినాయక్ శశికుమార్, తెలుగులో కళ్యాణ్ చక్రవర్తి త్రిపురనేని, హిందీలో కార్తీక్ ఖుష్, కన్నడలో నాగార్జున శర్మ అందించారు. ప్రతి రైటర్ తన పాటలో తమ సంస్కృతిని మిక్స్ చేసి ఎమోషనల్ టచ్ ఉండేలా చూసుకున్నారు. వృషభ మూవీలోని పాటలు టి సిరీస్ ద్వారా విడుదలవుతున్నాయి. ఈ సినిమా సంగీత ప్రయాణం ముందుగా అప్పా పాటతో మొదలైంది. డిసెంబర్ 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోన్న ఈ మూవీని నంద కిషోర్ తెరకెక్కిస్తున్నాడు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు నంద కిషోర్ మాట్లాడుతూ.. 'వృషభ' మ్యూజికల్ జర్నీఅప్పా పాటను స్టార్ట్ చేశాం. ఈ సినిమా ద్వారా తండ్రీ కొడుకుల మధ్య ఉండే బలమైన, భావోద్వేగా బంధం గురించి మేం చెప్పాలని అనుకున్నాం. దాన్ని ఈ పాట ద్వారా చూపించాం. ఈ సినిమాకు ఈ పాట గుండెలాంటిది. అలాగే ప్రేక్షకులకు కథేంటో కూడా ఈ పాటతో చూపించే ప్రయత్నం చేశాం. సామ్ సి.ఎస్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఇది ప్రారంభం మాత్రమే. సినిమా నుంచి మరిన్ని పాటలు విడుదలవుతాయి. సినిమా సోల్ ఏంటనేది రాబోయే పాటలతో ప్రేక్షకులకు మరింతగా అర్థమవుతుంది. సాధారణంగా కుటుంబం కోసం, పిల్లల కోసం తపన పడే తండ్రి గురించిన సినిమాలు చాలా తక్కువగానే వచ్చాయి. ఈ కథను మాత్రం తప్పకుండా చూడాల్సిందే' అన్నారు.



## 19న 'గుర్రం పాపిరెడ్డి' రిలీజ్

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా 'గుర్రం పాపిరెడ్డి'. ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. 'గుర్రం పాపిరెడ్డి' సినిమా ఈ నెల 19న వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. జడ్జి జి.వైద్యనాథన్ (బ్రహ్మానందం) తెలివితక్కువ వాళ్లతో వ్యవహరించడంలో అనుభవజ్ఞుడు. అలాంటి ఆయన దగ్గరకు ఓ విచిత్రమైన కేసు హియరింగ్‌కు వస్తుంది. నలుగురు ఫ్రెండ్స్ గుర్రం పాపిరెడ్డి (నరేష్ అగస్త్య), సౌధామిని (ఫరియా అబ్దుల్లా), మిలటరీ (రాజ్ కుమార్ కాసిరెడ్డి), చిలిపి (వంశీధర్ కోస్గి) కలిసి శ్రీశైలం అడవుల్లో సమాధి చేసిన ఓ శవాన్ని దొంగతనం చేసేందుకు వెళ్తారు. అక్కడికి మరికొందరు గ్రేవ్ రాబర్స్ కూడా పోటీకి వస్తారు. ఆ దొంగలతో ఈ ఫ్రెండ్స్ బ్యాచ్ ఇబ్బందులు ఎదుర్కొంటారు. శ్రీశైలం అడవుల్లో పాతిపెట్టిన ఆ శవం ఎవరిది, దాని కోసం హీరో గ్యాంగ్ తో పాటు మరి కొన్ని గ్యాంగ్స్ ఎందుకు వేట సాగిస్తున్నాయి. ఈ వేట కథను ఉగ్రాజు (యోగి బాబు) ఎలా మలుపుతిప్పాడు. 1927 నుంచి 1987 వరకు జీవించిన కలింగ పోతురాజు ఎవరు, శ్రీ మార్కండేయ రాజుతో ఈ కథకున్న లింకు ఏంటి అనే ఆసక్తికర అంశాలతో ట్రైలర్ ఆకట్టుకుంది.

## '45 ది మూవీ' ట్రైలర్



కరుణాడ చక్రవర్తి శివ రాజ్ కుమార్, రియల్ స్టార్ ఉపేంద్ర, రాజ్ బి శెట్టి వంటి స్టార్లతో అర్జున్ జన్య తెరకెక్కించిన చిత్రం '45 ది మూవీ'. ఈ చిత్రాన్ని సూరజ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద ఉమా రమేష్ రెడ్డి, ఎం రమేష్ రెడ్డి భారీ ఎత్తున నిర్మించారు. ఇప్పటి వరకు '45 ది మూవీ' నుంచి వచ్చిన పోస్టర్, గ్లింప్స్ అన్నీ కూడా ఆడియెన్స్లో భారీ అంచనాల్ని పెంచేశాయి. ఇక తాజాగా ఈ మూవీ నుంచి ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. అంతే కాకుండా కొత్త రిలీజ్ డేట్ని కూడా ప్రకటించారు. జనవరి 1న ఈ సినిమాను రిలీజ్ చేయబోతోన్నట్టుగా నిర్మాతలు తెలిపారు. ఇక '45 ది మూవీ' ట్రైలర్ చూస్తే మాత్రం కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లినట్టుగా కనిపిస్తోంది. కొత్త రకమైన ఆయుధాలు, బాణాలతో దాడి, బుల్లెట్ల వర్షం, కొత్తగా క్రియేట్ చేసిన ద్విచక్ర వాహనం ఇలా అన్నీ డిఫరెంట్‌గానే కనిపిస్తున్నాయి.

## 'జిన్' ట్రైలర్ ఆవిష్కరణ



సౌదలమ్మ ఫిల్మ్ ప్రొడక్షన్స్, బిల్వ స్టూడియోస్ బ్యానర్ల మీద నిఖిల్ ఎం.గౌడ నిర్మించిన చిత్రం 'జిన్'. ఈ మూవీకి చిన్మయ్ రామ్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో అమ్మిత్ రావ్, పర్వేజ్ సింబా, ప్రకాష్ తుమినాద్, రవి భట్, సంగీత ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ చిత్రం 19న గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజ్ కందుకూరి, వీరభద్రం చౌదరి, హీరో సోహెల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భూతనాల చెరువు నేపథ్యం ఏంటి? కాలేజ్‌లో దాగి వున్న మిస్టరీ ఏంటి? అనే ఆసక్తికర ప్రశ్నలు రేకెత్తించేలా ట్రైలర్ను కట్ చేశారు. నలుగురు యువకులు ప్రేతాత్మలకు చిక్కడం, ఆ కాలేజీ భవనం నుంచి బయటకు రాలేకపోవడం, మధ్యలో జిన్ రాక వంటి అంశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా ట్రైలర్‌ను చూపించారు.
ఈ సందర్భంగా నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ గుడ్ జిన్, బ్యాడ్ జిన్ అని జిన్లో రెండు రకాలుంటాయి. హారర్ చిత్రాలకు రిస్క్ ఫ్యాక్టర్ తక్కువగా ఉంటుందని నేను భావిస్తాను. కరెక్ట్గా భయపెడితే ఆడియెన్స్ హారర్ చిత్రాల్ని ఆదరిస్తారు. సినిమాకు భాషా సరిహద్దులుండవు. గుడ్ ఫిల్మ్, బ్యాడ్ ఫిల్మ్ అని మాత్రమే ఉంటాయి. 'జిన్' మూవీ పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను. ఈ మూవీని అందరూ చూడండి అని అన్నారు.

## 26న 'వానర'



అవినాష్ తిరువీధుల హీరోగా, దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'వానర'. ఈ చిత్రంలో సిమ్రాన్ చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. నందు ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. 'వానర' చిత్రాన్ని శంతను పత్తి సమర్పణలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ బ్యానర్ పై అవినాష్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్, వివేక్ సాగర్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కాబోతున్నాయి. మైథలాజికల్ రూరల్ డ్రామా కథతో తెరకెక్కిన 'వానర' సినిమా ఈ నెల 26న థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'అదరహో..' రిలీజ్ చేశారు. పాటను మంచి బీట్‌తో కంపోజ్ చేసిన మ్యూజిక్ డైరెక్టర్ వివేక్ సాగర్, భరద్వాజ్ గాలితో కలిసి లిరిక్స్ రాసి పాడారు.

## నేడు 'సహన సహన' లిరికల్ సాంగ్ రిలీజ్



రెబల్ స్టార్ ప్రభాస్, మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్ లో రూపొందుతున్న 'రాజా సాబ్' నుంచి సెకండ్ సింగిల్ 'సహన సహన..' ఫుల్ లిరికల్ సాంగ్‌ను నేడు సాయంత్రం 6.35 నిమిషాలకు రిలీజ్ చేయబోతున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. 'సహన సహన..' సాంగ్‌లో ప్రభాస్ కలర్ ఫుల్ ట్రెడిషనల్ కాస్ట్యూమ్స్‌తో ఆల్ట్రా స్టైలిష్ వైబ్ క్రియేట్ చేస్తున్నారు. ఈ సాంగ్‌ను మ్యూజిక్ సెన్సేషన్ తమన్ బెస్ట్ మెలొడీగా కంపోజ్ చేశారు. ప్రభాస్, నిధి అగర్వాల్‌లపై చిత్రీకరించిన 'సహన సహన..' పాటలో స్టన్నింగ్ లొకేషన్స్ హైలైట్‌గా నిలుస్తాయి. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న 'రాజా సాబ్' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో అన్ కాంప్రమైజ్డ్ గా నిర్మిస్తున్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.




## వంద మిలియన్ల వ్యూస్ దాటిన 'చికిరి చికిరి'

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మరోసారి స్టార్ పవర్‌తో అదరగొట్టారు. ఆయన అప్ కమింగ్ 'పెద్ది' చిత్రం నుంచి విడుదలైన ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' ఆన్‌లైన్‌లో సంచలనం సృష్టిస్తోంది. విడుదలైన కేవలం ఒక నెలలోనే, ఒక్క తెలుగు వెర్షన్ లోనే 100 మిలియన్ల వ్యూస్ను దాటగా, ఐదు భాషల్లో కలిపి మొత్తం 150 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సాధించింది. ఈ పాట ప్రజాదరణ రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ పాటలోని పవర్ ఫుల్ బీట్స్, ఆకట్టుకునే రిథమ్ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రామ్ చరణ్ అదిరిపోయే డ్యాన్స్ మూమెంట్స్, పవర్ ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. దర్శకుడు బుచ్చి బాబు సానా చూపించిన స్టైలిష్ విజువల్స్, ప్రతి ఫ్రేమ్‌లో కనిపించే గ్రాండియర్ ఈ పాటకు మరింత ప్లస్ అయ్యాయి. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. 'చికిరి చికిరి' సరికొత్త రికార్డులు సృష్టిస్తుండటంతో పెద్ది సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ త్వరలోనే ప్లాన్ చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు.

## ఈనెల 19,20 తేదీల్లో ఢిల్లీలో చింతన్ శిబిరం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఢిల్లీలో ఈ నెల 19,20 తేదీల్లో జరిగే జాతీయ చింతన్ శిబిరం–2025కు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కేంద్ర ప్రభుత్వం ఆహ్వానం పంపింది. ఈ ఆహ్వానంపై ఆయన స్పదిస్తూ కేంద్ర మంత్రి నితిన్‌గఢ్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ చింతన్ శిబిరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. రహదారి మౌలిక వసతుల అభివృద్ధి, భూసేకరణలో డిజిటలైజేషన్, స్మార్ట్ రోడ్లు, రోడ్డు భద్రత, నాణ్యత ప్రమాణాల పెంపు వంటి అంశాలపై జరగనున్న చర్చలు రాష్ట్రాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు కనెక్టివిటీ, హైవే అభివృద్ధి,రోడ్డు భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సన్నిహితంగా కలిసి పనిచేస్తామని మంత్రి స్పష్టం చేశారు. జాతీయ చింతన్ శిబిరంలో తెలంగాణ రాష్ట్రం చురుకైన పాత్ర పోషిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ అనుభవాలు, ఉత్తమ విధానాలను ఈ వేదికపై పంచుకుంటామని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో విజన్ 2047 తెలంగాణ రైసింగ్ నినాదంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తుందని, ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రాష్ట్ర రోడ్ పాలసీని ఆవిష్కరించామని గుర్తు చేశారు. 49వేల కి.మీ రోడ్ నెట్‌వర్క్ ఉన్న తెలంగాణలో ప్రతి రహదారి 4లేన్,6లేన్ రహదారులుగా మార్చే విజన్‌తో వెళ్తున్నామని లక్ష 15వేల కి.మీ రోడ్ నెట్‌వర్క్ లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, నేషనల్ హైవేలు పలు కారిడార్లు, మన్ననూరు శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, జాతీయ రహదారి 65 హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి 8లేన్ విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ నుండి సౌత్ ఇండియా రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు అమరావతి, చెన్నై, బెంగళూరు, మచిలీపట్నం పోర్టుతో పాటు నాగపూర్‌కు హైస్పీడ్ హైవే, బుల్లెట్ ట్రైన్ కారిడార్ల నిర్మాణ విజన్‌తో పనిచేస్తున్నామని, అందుకు కేంద్ర సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్చలు, సమన్వయం ద్వారా జటిలమైన సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. నితిన్ గడ్కరీ లేఖ ఫెడరల్ స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తుందని సంతోషం వ్యక్తం చేశారు.




## గోల్కొండ కోటలో విజయ్ దివస్ వేడుకలు

### పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాపక్షం/హైదరాబాద్: 54వ విజయ్ దివస్ సందర్భంగా వీర సైనికులను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్మరించుకున్నారు. విజయ్ దివస్‌ను పురస్కరించుకుని మంగళవారం చారిత్రక గోల్కొండ కోటలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. వారి దృఢ సంకల్పం, నిస్వార్థ సేవ దేశాన్ని రక్షించాయని, దేశ చరిత్రలో గర్వించదగిన క్షణాలను లిఖించారని చెప్పారు. ఈ విజయ్ దివస్ వారి పరాక్రమానికి వందనమర్పించేదిగా, వారి అసమాన స్ఫూర్తికి చిహ్నంగా నిలుస్తుందని తెలిపారు. సైనికుల వీరత్వం తరాల పాటు భారతీయులకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని చెప్పారు. 1971 యుద్ధంలో భారత సాయుధ దళాలు కేవలం 13 రోజుల్లోనే చారిత్రక విజయం సాధించాయని, 93 వేల మంది పాకిస్థాన్ సైనికులు లొంగిపోవడంతో బంగ్లాదేశ్ అవతరించిందని మంత్రి గుర్తు చేశారు. అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ దృఢమైన నాయకత్వమే ఈ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. అంతర్జాతీయ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ జాతీయ ప్రయోజనాల కోసం ఆమె ధైర్యంగా నిర్ణయాలు తీసుకున్నారని, సాయుధ దళాలపై సంపూర్ణ వి శ్వాసం ఉంచి వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చారని అన్నారు. ఫీల్డ్ మార్షల్ సామ్ మానెక్‌షా, అరుణ్ ఖేతర్పాల్, ఆల్బర్ట్ ఎ క్కా వంటి వీరుల త్యాగాలు దేశ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని చెప్పారు. లాంగేవాలా నుంచి తూర్పు యుద్ధరంగం వరకు ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ సమన్వయంతో, క్రమశిక్షణతో పోరాడిన తీరు దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ప్రస్తావించిన మంత్రి, భారత్ శాంతిని కోరుకుంటూనే జాతీయ భద్రతకు ముప్పు వస్తే గట్టిగా ప్రతిస్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చిందన్నారు. గోల్కొండ కోట వంటి చారిత్రక ప్రదేశంలో విజయ్ దివస్‌ను జరుపుకోవడం గర్వకారణమని, తెలంగాణ రాష్ట్రం ఎల్లప్పుడూ సాయుధ దళాల పక్షాన దృఢంగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు. యువతరం ఈ స్వేచ్ఛ వెనుక ఉన్న త్యాగాల విలువను తెలుసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టీఏఎస్ఏ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, బ్రిగేడియర్ రాహుల్, డిజిపి శివధర్ రెడ్డి, టిజిపిఎస్‌సి చైర్మన్ బుర్ర వెంకటేశం, ఎండీసీఆర్ఎల్ ఎండీ నర్సింహరెడ్డి, టీజీటీడీసీ ఎండీ క్రాంతి వల్లూరు, తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడులకు 'క్వాంటమ్ ఎఎంసి' మద్దతు

### హైదరాబాద్‌లో క్వాంటమ్ ఎఎంసి కార్యాలయం ఏర్పాటు




ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక మార్కెట్లలో ఒకటైన తెలంగాణలో మరిన్ని సేవలందించేందుకు క్వాంటమ్ ఎఎంసి నూతన కార్యాలయాన్ని హైదరాబాద్‌లో మంగళవారం ప్రారంభించింది. దేశంలో మారుతున్న పెట్టుబడిదారుల అవసరాలకు నాణ్యమైన, సులభంగా అందుబాటులో ఉండే విశ్వసనీయ పెట్టుబడి పరిష్కారాలను అందించాలన్నదే క్వాంటమ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ (క్వాంటమ్ ఎఎంసి) సంకల్పమని క్వాంటమ్ ఎఎంసి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిమంత్ శుక్లా ఈ సందర్భంగా ప్రకటించారు. నగరంలో పెట్టుబడి భాగస్వామ్యం గణనీయంగా పెరిగిన ఫలితంగా మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతుందన్నారు. దీంతో 2025 నవంబర్ నాటికి రాష్ట్రం నుంచి మ్యూచువల్ ఫండ్ సగటు ఆస్తుల నిర్వహణ విలువ (ఎఎయుఎం) సుమారు రూ.1.37 లక్షల కోట్లకు చేరిందన్నారు. క్వాంటమ్ అడ్వైజర్ ఎండి ఐ.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ హైదరాబాద్‌లోని పెట్టుబడిదారుల సముదాయానికి సరళమైన, పరిశోధన ఆధారిత, దీర్ఘకాలిక పెట్టుబడి అవకాశాలలో మద్దతు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## ఇడి చార్జిషీట్ నిరాకరణ

(మొదటి పేజీ తరువాయి)

ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అలాంటప్పుడు ఇడి ఛార్జ్‌షీట్ ఆధారంగా తీర్పు ఇవ్వడం తొందరపాటు చర్యే అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే ఈ కేసులో ఈడీ దర్యాప్తును కొనసాగించొచ్చని రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. మరోవైపు దీనిపై స్పందిస్తూ మోదీ ప్రభుత్వం అక్రమం పూర్తిగా బయటపడిందని కాంగ్రెస్ విమర్శించింది. ఈ కేసులో సోనియా, రాహుల్‌పై ఇడి చేపట్టిన చర్యలు పూర్తిగా చట్టవిరుద్ధం, దురుద్దేశమని కోర్టు గుర్తించినట్లు కాంగ్రెస్ ప్రతినిధి సుప్రియా శ్రీనేట్ ఓ ప్రకటనలో తెలిపారు. 'మోదీ ప్రభుత్వ దురుద్దేశం పూర్తిగా బయటపడింది. ఇడి కేసు అధికార పరిధికి చెందదని కోర్టు తీర్పు ఇచ్చింది. దీనికి ఎఫ్ఐఆర్ లేదు. అది లేకుండా ఎటువంటి కేసు లేదు. ప్రధాన ప్రతిపక్ష పార్టీపై గత దశాబ్దంలో మోదీ ప్రభుత్వం చేసిన ఈ రాజకీయ ప్రేరేపిత కుట్ర భారత ప్రజల ముందు బహిర్గతమైంది. బిజెపి ప్రచారంలో భాగమైన అన్ని నిరాధారమైన ఆరోపణలు. 'కాంగ్రెస్ నాయకత్వం ప్రతి భారతీయుడి హక్కుల కోసం పోరాడటానికి కట్టుబడి ఉంది. మేం నిజం కోసం పోరాడుతున్నాం. అందుకే ఎప్పటికీ బెదిరించలేరు' అని సుప్రియా పేర్కొన్నారు.

## నక్సల్స్ అరెస్ట్?

(మొదటి పేజీ తరువాయి)

డిజిపి కార్యాలయానికి తరలించారని ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఈ విషయమై పోలీసులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. మరోవైపు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్‌లో 34 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 26 మంది మావోయిస్టులపై మొత్తంగా రూ.84 లక్షలమేరకు నగదు బహుమతిని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. సాయుధ పోరాటానికి సమకాలీన సమాజంఅననుకూలంగా ఉన్నందువల్ల జనజీవన స్రవంతిలో ఉండాలని నిర్ణయించుకున్నారనే కథనాల పూర్వరంగంలో పోలీసుల ఎదుట మావోయిస్టుల లొంగుబాటు ప్రక్రియ కొనసాగుతోంది. తాజాగా బిజాపూర్‌లో సీనియర్ పోలీస్, సిఆర్‌పిఎఫ్ అధికారుల ఎదుట లొంగిపోయిన 34 మంది నక్సలైట్లలో ఏడుగురు మహిళలు కూడా ఉన్నారు.''పూనమార్గెం(పునరావాసం నుండి సామాజిక స్రవంతిలో సమీకృతమయ్యేవరకూ) పునరావాస చొరవ ప్రక్రియ'' కార్యక్రమం కింద వీరంతా లొంగిపోయారని బిజాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ జితేంద్ర యాదవ్ చెప్పారు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ– ఆంధ్రప్రదేశ్ ఒడిసా సరిహద్దు డివిజన్ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో ఈ మావోయిస్టు కార్యకర్తలు అందరూ చాలా క్రియాశీలంగా పనిచేసేవారని ఆయన చెప్పారు. మావోయిస్టు కార్యకర్తలు పాండ్ర పూనెం (45), రుక్నీ హెమ్లా (25), దేవ ఉయిక (22), రామ్‌లాల్ పాయం (27), మోతు పూనెం (21) ల ఆచూకీ చెప్పినవారికి తలకు రూ.8 లక్షలు వంతెర బహుమతి ఇపాంతమరి గతంలో ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పుడు పునరావాస విధానం కింద లొంగిపోయిన మావోయిస్టు కార్యకర్తలకు తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికీ రూ.50,000 లు నగదు ఇస్తారు. దీంతోపాటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వారికి ఇతర సదుపాయాలు కూడా సమకూరుస్తుంది. వారిలో వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుంది. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు హింసామార్గం వదిలి జనజీవన స్రవంతిలోకి రావడానికి ప్రభుత్వం ప్రకటించిన ఈ పునరావాస విధానం వారికి బాగా ఆకర్షించింది. ప్రభుత్వం ఎదుట లొంగిపోయి సాధారణ జీవితం గడపాల్సిందిగా వారి కుటుంబాలు కూడా ఒత్తిడి తీసుకువచ్చేలా ఈ విధానం ఉపయోగపడిందని జితేంద్ర యాదవ్ చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ విధానంతో స్ఫూర్తిపొందిన 824 మంది మావోయిస్టులు హింసామార్గాన్ని వదిలిపెట్టారని, గడచిన రెండు సంవత్సరాలుగా వారంతా దంతెవాడ జిల్లాలో జనజీవన స్రవంతిలో చేరారని చెప్పారు. గడచన రెండు సంవత్సరాలుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఉన్నతస్థాయి నాయకులతోపాటు 2,200 మందికి పైగా మావోయిస్టులు ప్రభుత్వానికి లొంగిపోయారని ఆయన చెప్పారు. 2026 మార్చినెల నాటికి దేశంలో నక్సలిజం తీవ్రవాదాన్ని నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

## బస్సుల్లో మంటలు

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. 'యమునా ఎక్స్‌ప్రెస్‌వేలోని ఆగ్రా నుండి నోయిడా వైపు తక్కువ దృశ్యమానత కారణంగా వాహనాలు ఢీకొన్నాయి. కొన్ని వాహనాలకు మంటలు కూడా అంటుకున్నాయి. గాయపడిన వారందరినీ ఆసుపత్రికి తరలించాము' అని మధుర సీనియర్ ఎస్‌పి శ్లోక్ కుమార్ అన్నారు. మృతులలో ఇద్దరిని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన 44 ఏళ్ల అఖిలేంద్ర ప్రతాప్ యాదవ్, మహారాజ్ గంజ్ జిల్లాకు చెందిన 75 ఏళ్ల రాంపాల్‌గా గుర్తించినట్లు బలదేవ్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒ రంజనా సచన్ తెలిపారు. మరో ఇద్దరిని వృందావన్‌కు చెందిన ఒక చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా, గోండా జిల్లాకు చెందిన 62 ఏళ్ల సుల్తాన్ అహ్మద్‌గా గుర్తించారు. మృతులంతా కాలి బుగ్గయ్యారని సచన్ చెప్పారు. ఘటనా స్థలిలో ఉన్న కాలిపోయిన బస్సులు, కార్లు, ఛిద్రమైన పెంకుల వలె కనిపించాయి. వీటిని రోడ్డుపై నుండి తొలగించడానికి క్రేన్‌లను పిలిపించారు. కాలిపోయిన మృతదేహాల డిఎన్ఎను వారి బంధువులు అందించిన సమాచారంతో సరిపోల్చడానికి తాము భద్రపరుస్తున్నామని, ముగ్గురు మరణించిన ప్రయాణికులను గుర్తించాని, వారి బంధువులను సంప్రదిస్తున్నామని శ్లోక్ కుమార్ చెప్పారు. జిల్లా మేజిస్ట్రేట్ చంద్ర ప్రకాష్ సింగ్ మాట్లాడుతూ మృతదేహాలను గుర్తించిన వారికి అంత్యక్రియల ఏర్పాట్లు చేస్తున్నామని, గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ రోడ్డు ప్రమాదంపై విచారణ జరిపి రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని జిల్లా మేజిస్ట్రేట్ నలుగురు సభ్యుల బృందాన్ని ఆదేశించారు. ఈ కమిటీకి అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (పరిపాలన) అమరేష్ కుమార్ నాయకత్వం వహించనున్నారు. ఘటనా స్థలంలో ఉన్న ఎస్ఎస్‌పి బలదేవ్ పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, మృతదేహాలకు పోస్ట్‌మార్టం, డిఎన్ఎ నమూనాల సేకరణ కోసం రెండు వేర్వేరు వైద్యుల బృందాలను నియమించినట్లు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధా వల్లభ్ తెలిపారు. పోలీసులు పోస్ట్‌మార్టం కోసం 17 బాడీ బ్యాగ్‌లను అందజేశారని ఆయన చెప్పారు. తీవ్రంగా గాయపడిన వారిలో కొందరిని ఆగ్రాలోని ఎస్ఎన్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రికి, మరికొందరిని ఢిల్లీకి తరలించినట్లు ఆయన తెలిపారు. మధ్యాహ్నానికల్లా మొత్తం 43 మందిని చికిత్స కోసం బృందావన్‌లోని జాయింట్ జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చినట్లు సిఎంఒ తెలిపారు. వీరిలో 10 మంది మహిళలు, 33 మంది పురుషులు ఉన్నారు. ఎక్స్‌లో మధుర పోలీసులు ఒక ప్రకటనను విడుదల చేస్తూ మైలురాయి 127 వద్ద జరిగిన ఈ ప్రమాదంలో ఏడు బస్సులు, మూడు చిన్న వాహనాలు ఉన్నాయని, గాయపడిన వారి పరిస్థితి నిలకడగానే ఉందని పేర్కొన్నారు.

### ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సిఎం యోగి

ఈ రోడ్డు ప్రమాదంపై ఉత్తర్‌ప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com